గురువారం
19•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 174
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక


PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




• కేంద్రసాహిత్య అకాడమీ అవార్డులు





## ప్రసిద్ధ తెలుగు రచయిత బండి నారాయణస్వామి ‘శప్తభూమి’ నవలకు సత్కారం

2



ఇంగ్లిష్ విభాగంలో

## శశిథరూర్‌కు పురస్కారం

III

‘యాన్ ఎరా ఆఫ్ డార్క్‌నెస్ – ద బ్రిటిష్ ఎంపైర్ ఇన్ ఇండియా’ పుస్తకానికి అకాడమీ అవార్డు

## మున్సిపాలిటీల్లో 3,149 వార్డులు

వార్డుల విభజన ప్రక్రియ పూర్తి • సీడీఎంఏకు వివరాలు అందజేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 131 మున్సిపాలిటీల్లో 3,149 వార్డులు ఖరారయ్యాయి. వార్డుల విభజన ప్రక్రియ పూర్తి కావడంతో వాటి వివరాలను మున్సిపల్ కమిషనర్లు మంగళవారం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కార్యాలయానికి సమర్పించారు. ఈ ప్రక్రియ ముగిశాక వార్డులవారీగా ఓటరు జాబితాను పురపాలకశాఖ సిద్ధం చేయనున్నది. మరోవైపు, వార్డులవారీగా ప్రతి 800 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని కేటాయించే ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుంది. తర్వాత బీసీ ఓటర్ల జాబితాను ఖరారుచేసి ప్రభుత్వానికి సమర్పిస్తారు. దీనిపై ప్రభుత్వం ఆమోదముద్ర వేశాకే బీసీ రిజర్వేషన్లు ఖరారవుతాయి. ఈ ప్రక్రియ మొత్తం ముగిసిన తర్వాత పురపాలకశాఖ.. ఎన్నికల సంఘానికి తుదిజాబితాను అందజేయనున్నది.

హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి ఏరోస్పేస్ వర్సిటీ



త్వరలో మరో రెండు ఏరోస్పేస్ పార్కులు

# డిఫెన్స్ హబ్ హైదరాబాద్

టీ-హబ్ దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్

- టీఎస్ఐపాస్‌తో బడా కంపెనీల పెట్టుబడులు
- భారత్-అమెరికా రక్షణ ఒప్పందాల సదస్సులో మంత్రి కేటీఆర్
- ఇరు దేశాల మైత్రి బలోపేతంలో హైదరాబాద్ ముఖ్య పాత్ర
- యూఎస్ కాన్సుల్ జనరల్ జోయిల్ రిఫ్‌మెన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్‌లో వరల్డ్ క్లాస్ ఏరోస్పేస్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. ఇందులో పాలుపంచుకునేందుకు యూఎస్ డిఫెన్స్ మేజర్స్, ట్రైనింగ్ పార్ట్నర్స్ ముందుకురావాలని ఆహ్వానించారు. నైపుణ్యంగల యువతను పెద్దసంఖ్యలో తయారుచేయడం వల్ల అటు కంపెనీలకు, ఇటు భాగస్వాములకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. బిజినెస్ కౌన్సిల్ ఫర్ ఇంటర్నేషనల్ అండర్‌స్టాండింగ్ (బీసీఐయూ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో యూఎస్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ నిర్వహించిన అమెరికా-భారత్ ఒప్పందాల సదస్సు బుధవారం హోటల్ తాజ్‌క్రిష్ణలో ప్రారంభమయింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న వ్యాపార అనుకూల విధానాలు.. వైమానిక, రక్షణ రంగంలో హైదరాబాద్ పాత్రను వివరించారు. ఏరోస్పేస్, డిఫెన్స్ సహా ఇతరరంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామన్నారు. స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహించేందుకు దేశంలోనే అతిపెద్దదైన టీ-హబ్ ఇంక్యుబేటర్‌ను ఏర్పాటుచేశామని.. బోయింగ్, ప్రాట్ అండ్ విట్నీ, కాలిన్ ఏరోస్పేస్ తదితర అమెరికా కంపెనీలు ఇందులో భాగస్వామ్యంగా ఉండి పని చేస్తున్నాయని తెలిపారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో హైదరాబాద్ చారిత్రకంగా డిఫెన్స్ ఎకోసిస్టమ్ కలిగి ఉన్నదన్నారు. రక్షణ విభాగానికి సంబంధించి డజన్ వరకు జాతీయ సంస్థలు ఉన్నాయని, దశాబ్దాల నుంచి డీఆర్డీవో ఇక్కడి నుంచే సేవలందిస్తున్నదని చెప్పారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు భారత్ మొత్తంలో మెరుగైన వాతావరణం తెలంగాణలో ఉన్నదన్నారు. ఇప్పటికే ప్రతిష్ఠాత్మకమైన బోయింగ్, జీఈ తదితర సంస్థలు ఆదిభట్ల, నాదర్‌గుల్‌లో యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఉత్పత్తులు ప్రారంభించాయని, అమెరికా అధ్యక్షుడు ఉపయోగించే హెలికాప్టర్‌తోపాటు ఎఫ్-16 యుద్ధ విమానం విడిభాగాలు సైతం హైదరాబాద్‌లోనే తయారవ్వటం ఇక్కడి విధానాలకు నిదర్శనమన్నారు. ఇప్పటికే నాలుగు ఏరోస్పేస్ పార్కులు ఉన్నాయని, మరో రెండు ఏర్పాటుచేసేందుకు చర్యలు చేట్టినట్టు తెలిపారు. నైపుణ్యం గలవారిని తయారుచేసేందుకు తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్స్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.

**ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్‌వన్**

తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని, 2018-19లో 14 శాతం జీఎస్డీపీ వృద్ధిరేటును నమోదుచేసిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతున్నదని చెప్పారు. ఎక్కడా లేని విధంగా టీఎస్ఐపాస్ పాలసీని అమలుచేస్తున్నామన్నారు. పెద్ద పెద్ద కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయని, అమెజాన్

మిగతా 2వ పేజీలో



బుధవారం హైదరాబాద్‌లో యూఎస్-భారత్ రక్షణ ఒప్పందాల సదస్సుకు హాజరైన యూఎస్ కాన్సుల్ జనరల్ జోయిల్ రిఫ్‌మెన్, మంత్రి కేటీఆర్, యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ అసిస్టెంట్ సెక్రటరీ జోయిల్ స్టార్

## కేటీఆర్ అమెరికాకు స్నేహితుడు, భాగస్వామి

జోయిల్ రిఫ్‌మెన్, యూఎస్ కాన్సుల్ జనరల్

**తను** ఇరవై ఏండ్లు ప్రపంచంలోని ఎన్నో దేశాలు తిరిగానని.. కానీ ఒకేదగ్గర డిఫెన్స్, ఐటీ, బయోటెక్ క్లస్టర్లు ఏర్పాటుచేయడం ఎక్కడా చూడలేదని యూఎస్ కాన్సుల్ జనరల్ – హైదరాబాద్ జోయిల్ రిఫ్‌మెన్ తెలిపారు. తెలంగాణ మంత్రి కేటీఆర్ దీన్ని సాధ్యంచేశారని ప్రశంసించారు. అమెజాన్ ప్రపంచంలోనే అతిపెద్ద హెడ్‌క్వార్టర్‌ని హైదరాబాద్‌లో ఏర్పాటుచేయడం ఇక్కడి ఆకర్షణీయ విధానాలు, కేటీఆర్ సామర్థ్యానికి నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన టీఎస్ఐపాస్ అద్భుతమైందన్నారు. భారత్-అమెరికా బంధం బలోపేతంలో హైదరాబాద్ ముఖ్యభూమిక పోషిస్తున్నదని చెప్పారు. మంత్రి కేటీఆర్‌ను అమెరికాకు స్నేహితుడు, భాగస్వామిగా ఆయన కొనియాడారు. భారత్, అమెరికా మైత్రి బలపడటంలో, ఇరుదేశాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొనడంలో ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుందన్నారు. వాషింగ్టన్‌లో 2+2 డైలాగ్ సమావేశం జరుగుతున్న సమయంలో ఇక్కడ ఇలాంటి సదస్సు నిర్వహించటం ముఖ్య ఘట్టంగా అభివర్ణించారు.

# రాష్ట్రానికి ప్రత్యేక నిధులివ్వండి

విభజన చట్టంలోని హామీలను నిలబెట్టుకోండి

మిషన్ కాకతీయ, భగీరథలకు నిధులు ఇవ్వండి

కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా కల్పించండి

రాష్ట్రాలపట్ల సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించండి

- జీఎస్టీ నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలి
- ఐజీఎస్టీ సర్దుబాటులో లోపాలను సవరించాలి
- కేంద్ర బడ్జెట్ ముందస్తు సమావేశంలో రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు డిమాండ్



బుధవారం ఢిల్లీలో నిర్వహించిన కేంద్రబడ్జెట్ ముందస్తు సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్‌కుమార్ కూడా ఉన్నారు.

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కేంద్రప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించి రాష్ట్రాలకు తగిన ఆర్థిక సహకారాన్ని అందించాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు కోరారు. తెలంగాణ వంటి బలంగా ఎదుగుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించి ‘బలమైన రాష్ట్రాలు.. బలమైన దేశం’ అన్న సూత్రాన్ని పాటించాలని సూచించారు. నీతిఆయోగ్ సిఫారసులను అనుసరించి మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్‌చేశారు. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు రాబోయే 2020-21 వార్షిక బడ్జెట్‌లో తెలంగాణకు ప్రత్యేక నిధులను కేటాయించాలని డిమాండ్‌చేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ అధ్యక్షతన ఢిల్లీలో బుధవారం నిర్వహించిన కేంద్ర బడ్జెట్ ముందస్తు సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన అంశాలను ప్రస్తావిస్తూనే దేశ ఆర్థిక పురోగతికి, రాష్ట్రాల బలోపేతానికి కేంద్రం తీసుకోవాల్సిన చర్యలపై నిర్దిష్ట సూచనలుచేశారు.

**హామీలను నెరవేర్చండి**

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం ఉద్దేశించిన బ్యాక్‌వర్డ్ రీజియన్స్ గ్రాంట్ ఫండ్ (బీఆర్జీఎఫ్) కింద తెలంగాణకు రావాల్సిన

మిగతా 2వ పేజీలో



జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

## వడ్డింపుల్లేవ్

- పన్నుల పెంపు జోలికి వెళ్లని జీఎస్టీ మండలి
- వచ్చే ఏడాది మార్చి 1 నుంచి అన్ని లాటరీలపై ఒకే పన్ను రేటు
- నేత సంచులపై పన్ను హేతుబద్ధం

9



‘కమాల్ కా మూమెంట్’ అవార్డుతో హ్యాట్రిక్ హీరో కుల్దీప్

## విశాఖలో భారత్ వీరంగం

- రెండో వన్డేలో 107 పరుగుల తేడాతో వెస్టిండీస్ చిత్తు
- రోహిత్, రాహుల్ సెంచరీలు
- హ్యాట్రిక్‌తో సత్తాచాటిన కుల్దీప్ యాదవ్

వివరాలు ఆటలో

## ఏసీబీ వలలో సిద్దిపేట అడిషనల్ డీసీపీ



నర్సింహారెడ్డి

- గోవింద్ నర్సింహారెడ్డి ఇండ్లు, ఆఫీస్‌లో రూ.కోట్ల విలువైన 12 ప్లాట్లు, భూముల పత్రాలు స్వాధీనం
- పట్టుబడిన నగదు, బంగారు ఆభరణాలు

2



## మిస్త్రీకే టాటా పగ్గాలు

టాటా సన్స్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ నియామకం చట్టవిరుద్ధం

ఎన్సీఎల్‌ఏటీ తీర్పు

9

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 90.00 | రిటైల్ లైవ్ | 112.00 |
| డ్రెస్డ్ | 162.00 | స్కిన్‌లెస్ | 185.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 433.00 | రంగారెడ్డి | 433.00 |
| మెదక్ | 433.00 | కరీంనగర్ | 436.00 |
| వరంగల్ | 436.00 | డజన్ ధర | 66.00 |

## ఒకే గొడుగు కిందకు జలశాఖలు

పకడ్బందీ నిర్వహణకు సర్కారు యోచన

సీఎం కేసీఆర్ ఆదేశాలతో మేధోమథనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో 1.25 కోట్ల ఎకరాలను సస్యశ్యామలం చేసేందుకు భగీరథయత్నం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం అందుకు అనుగుణంగా నీటిపారుదలశాఖ రూపురేఖలను మార్చాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది. రాష్ట్రంలో భారీ ఎత్తిపోతల పథకాలకు దీటుగా చిన్నపాటి చెరువులకు సైతం ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ.. సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచుతున్నది. ఈ నేపథ్యంలో భారీ ప్రాజెక్టులు మొదలుకుని.. చిన్నపాటి చెరువుల నిర్వహణ కూడా పకడ్బందీగా ఉండేలా నీటిపారుదలశాఖను ప్రక్షాళన చేయాలని సంకల్పించింది. అందులో భాగంగా భారీ, మధ్యతరహా, చిన్ననీటిపారుదల వ్యవస్థలన్నింటినీ ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. కొన్నిరోజుల క్రితం నిర్వహించిన సమీక్షాసమావేశంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అదేశాల మేరకు మేధోమథనానికి నీటిపారుదలశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఉమ్మడి రాష్ట్రం సమయం నుంచి సాగునీటిరంగంలో ప్రాజెక్టుల ఆధారంగా విభాగాలు ఏర్పాటుచేసి.. వాటి నిర్వహణ బాధ్యతలను ఇంజినీర్లకు అప్పగిస్తూ వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనూ అదే కొనసాగుతున్నది. రాష్ట్రంలోని భారీ, మధ్యతరహా, చిన్న నీటివనరులతోపాటు లిఫ్టులకు సైతం ప్రత్యేక విభాగాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టడంతోపాటు

మిగతా 6వ పేజీలో

ముస్లింలకు బోలెడన్ని..

## ప్రపంచంలో హిందువులకు ఒక్క దేశమూ లేదు!



పౌరసత్వ సవరణ చట్టం వివాదంపై కేంద్ర మంత్రి గడ్కరీ వ్యాఖ్య

5

## ఉరే సరి!



అక్షయ్‌కుమార్

- ‘నిర్భయ’ దోషి అక్షయ్‌కుమార్ క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- నలుగురు దోషులకు ఉరిశిక్షే సరైనదని వ్యాఖ్య

డెత్ వారెంట్ జారీని వాయిదావేసిన సెషన్స్ కోర్టు.. 7న విచారణ

5

## మాకు లేవా హక్కులు?

విలపించిన నిర్భయ తల్లి

## ఆర్టీసీ కార్గో సేవలు జనవరి నుంచి

ప్రతి డిపోనుంచి రెండు డీజీటీ సర్వీసులు

అభివృద్ధి కోసం ఆర్టీసీ సంస్కరణల బాట



ఆర్టీసీ కార్గో బస్సు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ అభివృద్ధికోసం సంస్కరణల బాట పడుతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా కొత్త సంవత్సరం జనవరి మొదటివారం నుంచి సరుకురవాణాకు ఆర్టీసీ సమాయత్తమవుతున్నది. ఈ మేరకు డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు (డీజీటీ) సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. మొదటివిడతగా 1209 మంది సిబ్బందిని, 822 ఆర్టీసీ డీజీటీ సర్వీసులను తెస్తున్నారు. ఒక్కో డిపోకు రెండు డీజీటీ వెహికిల్స్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. హైదరాబాద్ నగరంలోని 29 డిపోల్లో సుమారు 60 డీజీటీలు అందుబాటులోకి రానున్నాయి. మిగతావాటిని జిల్లాల్లోని డిపోలకు పంపిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇప్పటికే వీటిని బస్‌బాడీ బిల్డింగ్‌లకు పంపిస్తున్నారు. మొత్తం 1209 బస్సుల్లో అధికశాతం గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ జోన్‌కు చెందినవే ఉన్నాయి. గ్రేటర్‌లో రద్దుచేయనున్న 1,000 బస్సుల్లోనుంచి కండిషన్ ఉన్న బస్సులను వీటికి ఉపయోగిస్తున్నారు. బస్సుల రద్దుతో అదనంగా ఉండే ఉద్యోగులను కార్గో సర్వీసులకు

మిగతా 6వ పేజీలో



బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి ప్రాంగణంలో భాగవత సప్తాహానికి హాజరైన సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ, మాజీ ఎంపీ కవిత, ఇతర కుటుంబసభ్యులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుకు నమస్కరిస్తున్న దృశ్యం



తెలంగాణ కళాభారతిలో నిర్వహించిన భాగవత సప్తాహంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలను వింటున్న సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, కుటుంబసభ్యులు



శ్రీకృష్ణ జననం, పూతన సంహారం ఘట్టాలను వివరిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు





బుధవారం హైదరాబాద్ తాజ్ కృష్ణాలో జరిగిన యూఎస్- ఇండియా డిఫెన్స్ ఒప్పందాల సదస్సులో మాట్లాడుతున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్

# డిఫెన్స్ హబ్ హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి...

ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయాన్ని ఇక్కడ నెలకొల్పిందని తెలిపారు. జీఈ, హనీవెల్, ప్రాట్ అండ్ విట్నీ, లాక్‌హీడ్ మార్టిన్, తదితర బడా కంపెనీల పెట్టుబడులను కూడా హైదరాబాద్ ఆకర్షించిందని చెప్పారు. రక్షణరంగానికి అవసరమయ్యే లీప్ ఇంజిన్లు, ఎఫ్-16 యుద్ధ విమానాల రెక్కలు, అపాచీ హెలికాప్టర్ల విడిభాగాలు, ఆదానీ ఎల్బిదా డిఫెన్స్ సిస్టమ్ ద్వారా డ్రోన్ల తయారీ, సూపర్ హెర్క్యులస్ ఎయిర్ లిఫ్టర్ తదితర భాగాలను ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నట్టు వివరించారు. ఇలాంటి సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించినందుకు యూఎస్ కాన్సులేట్‌కు మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. రెండుదేశాల మధ్య వ్యూహాత్మక, వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరచడంలో యూఎస్ కాన్సుల్ జనరల్ ఎప్పుడూ కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. యూఎస్ పరిపాలనావిభాగం నేరుగా రాష్ట్రాలస్థాయిలో సంప్రదింపులు జరుపడం గొప్ప విషయమన్నారు. రక్షణరంగ సంబంధాలపై ఢిల్లీ-వాషింగ్టన్‌స్థాయిలో జరుగుతున్న చర్చలు ఎంతో సంతృప్తికరంగా ఉన్నాయని హర్షం వ్యక్తంచేశారు. అమెరికా ప్రభుత్వ ఏజెన్సీలు నేరుగా తెలంగాణ వంటి ప్రోగ్రెసివ్ రాష్ట్రాలతో చేతులు కలిపేందుకు ముందుకురావాలని విజ్ఞప్తిచేశారు. సదస్సు తొలిరోజు ఇరుదేశాల మధ్య భాగస్వామ్యం, సహకారం పెంపొందించేందుకు అనుసరించాల్సిన ఉత్తమవిధానాలపై చర్చ జరిగింది. యూఎస్ కాంపిటేటివ్‌నెస్ ఇన్ ఇండియన్ డిఫెన్స్ సెక్టార్, దీర్ఘకాల వ్యూహాత్మక అభివృద్ధి, డిఫెన్స్ సప్లైచైన్ తదితర అంశాలపై ఇరుదేశాల ప్రతినిధులు చర్చించారు.

### ఇరుదేశాల మైత్రిలో ట్రంప్, మోదీ చొరవ: జోయిల్ స్టార్

ఇరుదేశాల బంధం బలోపేతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ ఎంతో చొరవ చూపుతున్నారని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ అసిస్టెంట్ సెక్రటరీ జోయిల్ స్టార్ తెలిపారు. ఇరుదేశాల మధ్య రక్షణ ఒప్పందాలు జరుగటం సంతోషకరమన్నారు. భారత్ గ్లోబల్ పవర్‌గా ఎదుగుతుందని తాము గుర్తించామని.. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో అమెరికాకు ఇండియా అతి ప్రాధాన్య దేశమని చెప్పారు. ఇరుదేశాల మధ్య బంధాన్ని ప్రపంచానికి చాటేందుకు టైగర్ ట్రయాస్ పేరిట విశాఖలో ట్రైసర్వీస్ మిలిటరీ విన్యాసాలను నిర్వహించినట్టు తెలిపారు. అమెరికా, భారత్ మధ్య రక్షణ వాణిజ్యం 2008లో సున్నా డాలర్లుగా ఉంటే.. ఇప్పుడది 16 బిలియన్ డాలర్లకు చేరిందన్నారు. భారత్‌కు అత్యాధునిక సాంకేతికతను ఎగుమతి చేస్తున్నామన్నారు.

### ప్రజల హక్కులను కాపాడాలి

**- సీఏఏ ఆందోళనలపై అమెరికా ప్రతినిధులు**

భారత్‌లో పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని, ప్రజలహక్కులను ప్రభుత్వం కాపాడాలని అమెరికా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. రక్షణ ఒప్పందాల సదస్సులో పాల్గొన్నవారు మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందించారు. పౌరసత్వ సవరణ చట్టం, అనంతర పరిణామాల నేపథ్యంలో భారత ప్రభుత్వం ప్రజల హక్కులను కాపాడాలని కోరుతున్నట్టు చెప్పారు. నిరసనకారులు సైతం హింసను విడాలని సూచించారు.

# త్వరలో భూ విలువల సవరణ!

- క్షేత్రస్థాయి నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు
- ప్రజలపై భారం పడకుండా సుదీర్ఘ కసరత్తు
- సీఎం కేసీఆర్‌కు త్వరలో నివేదిక!
- భూ విలువ మదింపులో హేతుబద్ధతతో ముందుకెళ్తున్న రిజిస్ట్రేషన్లశాఖ

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో భూముల విలువను హేతుబద్ధీకరించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నది. శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువను పెంచడం లేదా సవరించడం వల్ల సామాన్యులకు మేలు జరుగడంతోపాటు రాబడి కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఏడాది కిందటే చాలాచోట్ల భూముల విలువను సవరిస్తూ అధికారులు ప్రాథమిక కసరత్తు చేపట్టారు. భూముల విలువ మదింపులో గతంలో లేనివిధంగా రిజిస్ట్రేషన్లశాఖ సుదీర్ఘ కసరత్తు చేసింది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి భూముల విలువల్లో హెచ్చుతగ్గులను సవరించే ప్రయత్నం చేస్తున్నది. బహిరంగమార్కెట్‌లో వాస్తవంగా ఉన్న భూముల విలువను ప్రామాణికంగా తీసుకొని రిజిస్ట్రేషన్ చార్జీలను సరిచేస్తారు. దీని ప్రకారం కొన్నిచోట్ల రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గితే.. మరికొన్నిచోట్ల పెరిగే అవకాశాలు ఉన్నాయి. బహిరంగ మార్కెట్ విలువ, ప్రభుత్వ విలువ మధ్య తేడా ఎక్కువగా ఉన్నందున భూమి విలువలను సవరించాల్సిన అవసరమున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భూముల విలువ పెంపు, సవరణపై త్వరలో సీఎం కేసీఆర్‌కు రిజిస్ట్రేషన్లశాఖ ఉన్నతాధికారులు నివేదిక సమర్పించనున్నట్టు తెలిసింది. సీఎం అనుమతినిస్తే ముందుకువెళ్లేలా రంగం సిద్ధం చేసుకొంటున్నారు. రాష్ట్రంలో ప్రాంతాలవారీగా రేట్లు, ఏయే ప్రాంతాల్లో ఎన్ని స్థిరాస్తి డాక్యుమెంట్లు రిజిస్టర్ అవుతున్నాయనే విషయాలపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ పర్యవేక్షణలో వివరాలు సేకరిస్తున్నారు. క్రెడాయ్, ట్రెడా, టీబీఎఫ్ వంటి రియల్టర్ సంఘాలతో కూడా చర్చిస్తున్నారు.




### పొరుగు రాష్ట్రంలో నాలుగుసార్లు..

గత ఆరేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువ పెంచలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రియల్ వ్యాపారం బాగా పెరగడంతోపాటు మార్కెట్ విలువ, బేసిక్ బుక్‌వ్యాల్యూ మధ్య చాలా తేడా రావడంతో అసమతుల్యత నెలకొన్నదనే భావన నెలకొన్నది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఏడాదికోసారి భూముల విలువల్ని సవరించడం లేదా స్టాంప్ డ్యూటీని పెంచుతుంటారు. పొరుగురాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే నాలుగుసార్లు భూమి విలువను సవరించడంతోపాటు స్టాంప్‌డ్యూటీని పెంచారు. ఆంధ్రప్రదేశ్‌లో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఫీజును 7.5 శాతానికి పెంచగా.. తెలంగాణలో అది 6 శాతంగానే ఉన్నది. తెలంగాణ ఆవిర్భవించిన ఏడాదికే రియల్‌ఎస్టేట్ అనూహ్యంగా జోరుపుంజుకొన్నది. బహిరంగ మార్కెట్‌లో భూమి విలువ అమాంతం పెరిగిపోయింది.

### నల్లధన ప్రవాహానికి చెక్!

**వాస్తవానికి** స్థిరాస్తిరంగంలో నల్లధనం ప్రవాహం అధికంగా ఉంటుంది. పెద్దనోట్ల రద్దు అనంతరం కఠిన ఆంక్షలు అమలులోకి రావడంతో నల్లధనం ఫ్లో కొంత తగ్గింది. చాలా డాక్యుమెంట్లలో మార్కెట్ విలువ కంటే ఎక్కువ ధరను పేర్కొంటుండటం వల్ల రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెరుగుతున్నది. రియల్ మార్కెట్‌లో ప్రభుత్వం నిర్ణయించిన బుక్‌వ్యాల్యూ ప్రకారం ఒక ధర ఉంటే.. బహిరంగ మార్కెట్ మరోలా ఉంటున్నది. చాలా ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్ణయించిన విలువ కంటే మార్కెట్ విలువ మూడు, నాలుగు రెట్లు అధికంగా ఉన్నది. ఉదాహరణకు మియాపూర్, అత్తాపూర్, మాదాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్‌లో బహిరంగ మార్కెట్ విలువ గజానికి సగటున రూ.40 వేల నుంచి 60 వేల వరకు ఉండగా.. బుక్‌వ్యాల్యూలో గజానికి రూ.10వేలుగానే ఉన్నది. కూకట్‌పల్లి, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలో చదరపు అడుగుకు రూ.2 వేల వరకు ఉంటే.. బహిరంగ మార్కెట్‌లో రూ.4 వేల నుంచి 5 వేల వరకు ఉన్నది. రూ.రెండు లక్షల కంటే ఎక్కువ మొత్తంలో నగదు ఇవ్వడానికి వీలులేదనే ఆదాయ పన్నుశాఖ నిబంధన.. స్థిరాస్తిరంగంలో రియల్ ధనం పెరగడానికి దోహదపడింది.



భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు ప్రజలకు భారం కాకుండా తెలంగాణ రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు గతంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మేరకు బహిరంగ మార్కెట్ విలువను కుదించి కనీసస్థాయిలోనే పన్ను ఉండేలా ప్రతిపాదించారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్‌లో ఉన్న మొత్తం విలువను 30 నుంచి 40 శాతానికి కుదించి 60 నుంచి 70 శాతం విలువను మాత్రమే బుక్‌వ్యాల్యూగా తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఫలితంగా ఫీజుల భారం కొంతవరకు తగ్గనున్నది. భూముల విలువ మదింపులో హేతుబద్ధతను ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకొన్న ఉన్నతాధికారులు బుక్‌వాల్యూను తగ్గించేందుకు కూడా అదే రీతిలో ఏర్పాట్లు చేస్తున్నారు. దీనివల్ల ప్రజలకు భారం తగ్గడంతోపాటు భూముల క్రయవిక్రయాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

# ధర్మ రక్షకుడు శ్రీకృష్ణుడు

- భాగవత సప్తాహంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు
- హాజరైన సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులు

**కవాడిగూడ:** లోకంలో ధర్మాన్ని నిలబెట్టేందుకు అవతరించిన పరమాత్ముడు శ్రీకృష్ణుడు అని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సమస్త జగత్తును చీకటి నుంచి వెలుగువైపు తీసుకువెళ్లేందుకు వచ్చిన ఆ పరమాత్ముడు తలుచుకుంటే ఏదైనా చేయగలడని చెప్పారు. హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం) ప్రాంగణంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహంలో భాగంగా బుధవారం ఐదోరోజు శ్రీకృష్ణ జననం, పూతన సంహారం ఘట్టాలను వివరించారు. భగవంతున్ని సేవించడం రావాలని, ఆయనను ఏభావంతో సేవించినా అది అమృతమై మనను కాపాడుతుందని వివరించారు. ఆ పరమాత్ముడిని మించిన శక్తి ఏదీలేదన్నారు. మనం కోరుకొనే కోరికలు ధర్మబద్ధమై ఉండాలని, త్యాగబుద్ధితో బతకాలని సూచించారు. మనం కష్టపడినా ఎదుటివారు మంచిగా ఉండాలని కోరుకోవాలని చెప్పారు. లోకాన్ని చూడటం గొప్పకాదని, మన మనస్సును గమనించడం గొప్పవిషయమని తెలిపారు. ఆత్మను గమనించడం తప్ప ఆత్మను గురించి చెప్పేవారెవరూ లేరన్నారు. శ్రీకృష్ణుడి కథలు, లీలలు వింటుంటే బాధలు, బంధనాలు తీరిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ సతీమణి శోభ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, టీఆర్ఎస్ నాయకులు గోవింద్ రాంఠీ, తెలంగాణ జాగృతి నాయకురాలు మంచాల వరలక్ష్మి పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణకు బోర్డు

- చైర్మన్‌గా సీఎం కేసీఆర్, వైస్ చైర్మన్‌గా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డును ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చైర్మన్‌గా వ్యవహరించే బోర్డులో వైస్ చైర్మన్‌గా అటవీ, పర్యావరణశాఖల మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సభ్యులుగా ఎమ్మెల్యేలు కొనేరు కోనప్ప, మర్రి జనార్దన్‌రెడ్డి, వనమా వెంకటేశ్వరరావు, వైల్డ్‌లైఫ్ ఎన్జీవో నుంచి అనిల్‌కుమార్, జేవీడీ మూర్తి, అవినాశ్ విశ్వనాథన్, పర్యావరణ వేత్తలు డాక్టర్ కార్తికేయన్, వీ కిషన్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ వాసుదేవరావు, ఎస్ రాఘవేందర్, బీవీ సుబ్బారావు, కార్తీక్ చింతలపాటి రాజు, రాజీవ్ మ్యాథ్యూస్, కోవా లక్ష్మి, బానోత్ రవికుమార్ సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు మరో 13 మంది బోర్డులో సభ్యులుగా వ్యవహరిస్తారు. వీరంతా మూడేండ్లు పదవిలో కొనసాగుతారు.

# జాతీయస్థాయిలో మెరిసిన హరికృష్ణ

- నేషనల్ సింపోజియంకు ఎంపికైన ఆయన కవిత
- ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పురస్కార ప్రదానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పండుగత్తాందంటె సాలు.. దునియాల లేని హైరానంత పడ్తడు మా నాయ్న.. అంటూ ఊర్ల ఉన్న నాయ్న పండుగపూట వచ్చే కొడుకుకోసం పడే తాపత్రయాన్ని తెలంగాణ యాసలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ రాసిన కవితకు జాతీయస్థాయి గుర్తింపు దక్కింది. ఊరికిపోయిన యాల్ల.. అనే శీర్షికతో ఆయన రాసిన కవిత ఆలిండియా రేడియో నిర్వహించిన నేషనల్ సింపోజియం ఆఫ్ పొయెట్స్ -2020 తెలుగు భాష విభాగంలో ఎంపికైంది. ఈ మేరకు బుధవారం ఆ సంస్థ అవార్డుల జాబితాను ప్రకటించింది. ఈ నెల 27, 28 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం అందజేయనున్నారు. ఈ కవితను 2020 జనవరి 28న దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆలిండియా రేడియో కేంద్రాల ద్వారా ఆయా రాష్ట్రాల భాషల్లోకి అనువదించి ప్రసారం చేయనున్నారు. ఊళ్లో తండ్రి తమ కోసం ఎదురుచూసే విషయాన్ని హరికృష్ణ తన స్వీయ అనుభవంతో కవిత్వీకరించారు. తెలంగాణ భాషా, సాంస్కృతికశాఖ సంచాలకుడిగా పనిచేస్తూనే నిరంతరం సాహిత్యరంగానికి సేవలందిస్తున్న హరికృష్ణ రాసిన కవితను ఆలిండియా రేడియో ఎంపిక చేయడంతో ఆయనకు జాతీయ కవిగా ప్రత్యేక గుర్తింపు దక్కినట్టయింది.



మామిడి హరికృష్ణ


### ఉద్యమస్ఫూర్తిని ప్రపంచవ్యాప్తం చేస్తున్న కవి

తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని ప్రపంచవ్యాప్తం చేయాలన్న లక్ష్యంతో మామిడి హరికృష్ణ ఈ ప్రాంతం ప్రాముఖ్యంపై ఎన్నో కవితలను ఆంగ్లంలోకి అనువదించి విశ్వవ్యాప్తం చేశారు. తన కవితల ద్వారా పల్లె అందాలు, మట్టివాసనల గొప్పదనం తెలియజెప్పడమే కాకుండా ఆధునిక ధోరణుల్లోని అంశాలను సైతం ప్రతిబింబింపజేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ రచయితల గొప్ప రచనలను మామిడి హరికృష్ణ తెలుగులోకి అనువదించారు. ప్రపంచ కవిత పేరిట వాటిని నమస్తే తెలంగాణ దినపత్రిక ఏడాదిపాటు ప్రచురించింది. తెలుగు సాహిత్యంలో ఫ్యూజన్ షాహరీ అనే కొత్త ప్రక్రియను హరికృష్ణ పరిచయంచేశారు. ఆయన చేసిన సాహిత్యసేవకు గుర్తింపుగా పలు అవార్డులు దక్కాయి. అందులో ప్రధానంగా 1992లో నాలుగు రాష్ట్రాల కవులు పాల్గొన్న దక్కన్ యువ కవితోత్సవంలో 'నగరం స్థైర్యాన్నిచ్చింది' అనే కవితకు ఉత్తమ పురస్కారం దక్కింది. హిందీవుడ్ అవార్డును, 2009, 2010, 2012 సంవత్సరాలకు ఉత్తమ సినీ విమర్శకుడిగా నంది అవార్డులు పొందారు. జాతీయస్థాయిలో ఉత్తమ సినీ విమర్శకుడిగా మూడోస్థానం పొందడం విశేషం.

# 'శప్తభూమి'కి సాహితీ సత్కారం


**కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి తెలుగు నవలా రచయిత బండి నారాయణస్వామి ఎంపిక**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలుగు నవలా రచయిత బండి నారాయణస్వామి.. ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ-2019 అవార్డుకు ఎంపికయ్యారు. శప్తభూమి నవలకుగాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది. నారాయణస్వామి అనంతపురం జిల్లాకేంద్రంలోని పాత ఊరులో హన్నూరప్ప, పోలేరమ్మ దంపతులకు 1952 జూన్ 3న జన్మించారు. ఎంఏ తెలుగు చదివిన ఆయన అధ్యాపకుడిగా పనిచేశారు. నారాయణస్వామి.. 40 వరకు కథలు రాసి 'వీరగల్లు' అనే కథాసంపుటిని వెలువరించారు. గద్దలాడతండాయి, మీ రాజ్యం మీరేలండి, రెండు కలలదేశం వంటి నవలలు రాశారు. రాయలసీమ సమాజం సాహిత్యం అనే విమర్శగ్రంథం రాశారు. 2017లో తానా వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన నవలా పోటీలో మూడు నవలలకు రూ.2 లక్షల నగదు బహుమతి లభించగా, వాటిలో ఒకటి శప్తభూమి.



కేంద్ర సాహిత్య అకాడమీ ఈ ఏడాదికి 23 మందిని పురస్కారాలకు ఎంపికచేయగా, అందులో శప్తభూమి స్థానం దక్కించుకున్నది.

### రాయలసీమ చరిత్ర నేపథ్యంలో శప్తభూమి



**శప్తభూమి** నవల రాయలసీమ చరిత్ర నేపథ్యంలో రాసినది. ఇది రాయలకాలం తర్వాత సుమారు 18వ శతాబ్దం నాటి అనంతపురం సంస్థాన రాజకీయాలు, అప్పటి జీవన విధానాన్ని తెలియజేస్తున్నది. హండే రాజుల కాలంనాటి ఘటనలు, కక్షలు, కార్పణ్యాల నడుమ నలిగిన ప్రజల జీవితాలు, పాలెగాళ్ల దౌర్జన్యాల సమాహారమే ఈ శప్తభూమి. ఈ నవలలోని చారిత్రక పాత్రలను సమీక్షించుకుంటున్నప్పుడు ఎక్కువమంది అణగారినవర్గాలవారే ఉన్నట్టు తెలిసింది. వారుకూడా దళిత బహుజన కులాలవారే. ఈ విషయం గుర్తించాక రాయలసీమ చారిత్రక నవల కాస్తా, రాయలసీమ దళిత బహుజన చారిత్రక నవలగా మారడం ప్రారంభమైంది. ఈ విధంగా చారిత్రక కథ నుంచి చారిత్రక నవలకు, చారిత్రక నవల నుంచి దళిత బహుజన చారిత్రక నవలకు ప్రయాణించిన ఆలోచన క్రమం కూడా ఈ నవలా రచన వెనుక పనిచేసింది.

- బండి నారాయణస్వామి

### ముహూర్తం

సూర్యోదయం: 6.43 గంటలకు

సూర్యాస్తమయం: 5.37 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం అష్టమి రాత్రి 9.23 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: ఉత్తర రాత్రి 10.34 వరకు, తదుపరి హస్త, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.48 నుంచి సాయంత్రం 5.19 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.32 నుంచి 2.54 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 2.43 నుంచి సాయంత్రం 4.10 వరకు, వర్జ్యం: లేదు.

# రాష్ట్రానికి ప్రత్యేక నిధులివ్వండి

మొదటిపేజీ తరువాయి...

రూ.450 కోట్లను వెంటనే విడుదల చేయాలని మంత్రి హరీశ్‌రావు కేంద్రాన్ని డిమాండ్‌చేశారు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో అద్భుతమైన రీతిలో చేపట్టిన మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయ వంటి కార్యక్రమాలకు నిధులను విడుదలచేయాలని నీతిఆయోగ్ సిఫారసు చేసినా కేంద్రం నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు, మిషన్‌కాకతీయకు రూ.5వేల కోట్లు ఇవ్వాలన్న నీతి ఆయోగ్ సిఫారసును పరిగణనలోకి తీసుకుని 2020-21 వార్షిక బడ్జెట్‌లో నిధులను విడుదలచేయాలని కోరారు. లక్ష కోట్ల వ్యయంతో చేపట్టిన మహత్తరమైన కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదానిచ్చి ప్రత్యేక నిధులను కేటాయించాలని హరీశ్‌రావు డిమాండ్‌చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో హామీ ఇచ్చిన విధంగా రాష్ట్రంలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటుచేయాలని కోరారు.

### కేంద్ర పథకాల నిధులపై రాష్ట్రాలకే విచక్షణ ఉండాలి

28 రకాలుగా ఉన్న కేంద్ర ప్రాయోజిత పథకాలను ఒకే గొడుగు కిందకు తేవాలని, వాటికి స్కీంలవారీగా కాకుండా ఏకమొత్తంలో నిధులను విడుదలచేయాలని మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నిధులను ఏ విధంగా వాడుకోవాలనే విచక్షణాధికారం రాష్ట్రాలకే ఉండాలని అన్నారు. వచ్చే బడ్జెట్‌లో ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

### ఆందోళనకరంగా మాంద్యం

దేశంలో అసాధారణ రీతిలో ఆర్థికమాంద్యం పెరిగిపోవటంపట్ల మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) దారుణంగా పడిపోతున్నదన్నారు. 2016-17లో 8.2% ఉన్న జీడీపీ ఏటా భారీగా తగ్గుతూ వస్తున్న విషయాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జీడీపీ 8.2% నుంచి 4.5 శాతానికి పడిపోవటం ఆందోళనకర పరిణామంగా ఆయన అభివర్ణించారు. బ్యాంకుల బకాయిలు, నిరర్థక ఆస్తులు పెరిగిపోవటం పరిస్థితిని మరింత దిగజారుస్తున్నదని చెప్పారు.

### జీఎస్టీ నిధులు వెంటనే విడుదలచేయండి

జీఎస్టీ నష్టపరిహారం చెల్లింపులో, ఐజీఎస్టీ సర్దుబాటులో ఉన్న లోపాలను సవరించి, జాప్యాన్ని నివారించి వెంటవెంటనే నిధులు విడుదల చేయాలని మంత్రి హరీశ్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కేంద్రం సంక్షేమ పథకాలను తగ్గించి, రాష్ట్రాల మ్యాచింగ్ గ్రాంట్లను పెంచడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. కేంద్రం గతంలోలాగే మ్యాచింగ్ గ్రాంట్లను భరించాలని కోరారు. దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు తగ్గడం వల్ల రాష్ట్రాలకు కలిగిన ఇబ్బందులను మంత్రి సమావేశంలో ప్రస్తావించారు. గ్రాస్ ట్యాక్స్ రెవెన్యూలో 31% తగ్గగా, రాష్ట్రాల సొంత రాబడిలో 47% వరకు లోటు ఏర్పడిందని విశ్లేషించారు. ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ నిధులను రాష్ట్రాలకు కేటాయించే విధానంలో మార్పు తీసుకురావాల్సిన అవసరమున్నదని సూచించారు. ఆర్టికల్ 269-ఏ ప్రకారం ఐజీఎస్టీ నిధులను పబ్లిక్ అకౌంట్ ఆఫ్ ఇండియా కన్సాలిడేటెడ్ ఫండ్‌లో జమచేయకుండా కాంపెన్సేషన్ ఫండ్‌లోకి పంపాలన్నారు. ఈ ఏడాది ఆఖరునాటికి ఐజీఎస్టీ కింద రాష్ట్రాలకు పంపిణీచేయాల్సిన రూ.1,76,688 కోట్లలో రూ.67,998 కోట్లు మాత్రమే ఇచ్చారని, వీటిని కూడా నిబంధనలకు విరుద్ధంగా కేంద్ర పన్నుల వాటా కింద విడుదలచేశారని చెప్పారు. ఈ విషయాన్ని కాంగ్ తప్పుబట్టిన విషయాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

### జాప్యంతో ఇబ్బందులు

**జీఎస్టీ** నష్టపరిహారం కింద రాష్ట్రాలకు రావాల్సిన బకాయిలను విడుదలచేయడంలో అసాధారణ జాప్యంవల్ల ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయని మంత్రి హరీశ్ అన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని నష్టపరిహారం మొత్తాన్ని వెంటవెంటనే విడుదలచేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్‌ను కోరారు. కేంద్రం పన్నుల విధానాన్ని సరళతరం చేయాలని సూచించారు. పన్నులను ఎగవేయకుండా ఆకర్షిత పథకాలను అమలుచేయాలని, స్వచ్ఛందంగా నల్లధనాన్ని వెల్లడించిన మొత్తాన్ని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కింద జమచేసి రాష్ట్రాలకు సహకరించాలని కోరారు. పదేండ్లపాటు 'లాక్ ఇన్ పీరియడ్'గా పరిగణించి, తర్వాత దశలవారీగా సదరు వ్యక్తులకు తిరిగి ఇవ్వాలని సూచించారు. సమావేశంలో హరీశ్‌రావు ప్రసంగం బాగుందని పలు రాష్ట్రాలకు చెందిన మంత్రులు అభినందించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు. బుధవారం మధ్యాహ్నం జరిగిన జీఎస్టీ కౌన్సిల్‌లో మంత్రితోపాటు రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్‌కుమార్, వాణిజ్యపన్నులశాఖ అదనపు కమిషనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### లోకం పోకడ




# అప్రోచ్ రోడ్డు 100 అడుగులు?

- కొత్త లేఅవుట్ నిబంధనలను సిద్ధంచేసిన పురపాలకశాఖ
- ఐదెకరాల్లోపు 40 అడుగులు ఓకే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌తోపాటు ఇతర పట్టణ ప్రాంతాల్లో భవిష్యత్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ముందుగానే పరిష్కారం చూపేందుకు రాష్ట్ర పురపాలకశాఖ సిద్ధమయింది. నగరాల్లో రోడ్లు తక్కువ విస్తీర్ణంలో ఉండటంతో వాహనాల రద్దీ పెరుగగానే రోడ్ల విస్తరణను చేపట్టడం.. ఇందులో భాగంగా ఇండ్లను కూల్చివేయడం సర్వసాధారణంగా మారింది. ఇలాంటి ఇబ్బందులను భవిష్యత్‌లో అధిగమించేందుకు పురపాలకశాఖ కొత్త లేఅవుట్ నిబంధనలను సవరించినట్టు సమాచారం. దీనిప్రకారం ఐదెకరాలకు మించి విస్తీర్ణంలో చేసిన లేఅవుట్లలో అప్రోచ్ రోడ్డు తప్పనిసరిగా వంద అడుగులు ఉండాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఐదెకరాల్లోపు లే అవుట్లకు 40 అడుగుల రోడ్డును అభివృద్ధి చేయవచ్చు. ఈ నిబంధనలపై పురపాలకశాఖ సాధ్యాసాధ్యాలను పరిశీలించి.. సీఎం కేసీఆర్ ఆమోదానికి పంపించనున్నది. ఇప్పటివరకు ఎన్ని ఎకరాల్లో లే అవుట్లు అభివృద్ధి చేసినా 40, 60 అడుగులలోనే రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. పంచాయతీల పరిధిలో కొన్ని ముప్పై అడుగులు కూడా ఉంటున్నాయి. పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రోడ్లు విశాలంగా లేకపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రోడ్లు విస్తరించేందుకు తరుచూ కూల్చివేతలు జరుపాల్సి వస్తున్నది. ఇండ్ల యజమానులు, ప్రభుత్వానికి తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. భవిష్యత్‌లో ఇలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పురపాలకశాఖ లేఅవుట్ నిబంధనలను మార్చేందుకు సిద్ధమయింది.



బుధవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్‌చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

## ప్రపంచశాంతికి చిహ్నం క్రిస్మస్ వేడుకలు

- ప్రజలంతా శాంతియుతంగా మెలగాలి
- ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా మెలగాలని, అప్పుడే ఆ ప్రాంతం స్వర్గసీమగా విరాజిల్లుతుందని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఇదేసూత్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆచరణలో చూపుతున్నారని చెప్పారు. క్రిస్మస్ వేడుకలు ప్రపంచశాంతికి చిహ్నమని పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని వెస్లీ కాలేజీ మైదానంలో బుధవారం రాత్రి నిర్వహించిన క్రిస్టియన్ ఉత్సవ కమిటీ సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతివర్గం పండుగను వేడుకలా జరిపే నైజమున్న గొప్ప మానవతావాది సీఎం కేసీఆర్ అని, అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నదే ఆయన అభిమతమని చెప్పారు. కార్యక్రమంలో క్రిస్టియన్ ఉత్సవ కమిటీ నాయకులు అరుణ, విద్య స్రవంతి, బిషప్, పలు చర్చిల ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.



బుధవారం సికింద్రాబాద్‌లోని వెస్లీ కళాశాల మైదానంలో ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న క్రిస్టియన్ ఉత్సవ కమిటీ నేతలు

## నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అతుల్ కర్వాల్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి అతుల్‌కర్వాల్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆయన అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా, సీఆర్పీఎఫ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



## నవోదయ, కేవీల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు

ఎంపీ బండా ప్రకాశ్ హర్షం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా ఉన్న నవోదయ, కేంద్రీయ విద్యాలయాలకు సంబంధించిన అడ్మిషన్లలో ఓబీసీ విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగా రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం నిర్ణయించడం పట్ల రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. ఈ నెల 13న ఓబీసీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రాజ్యసభకు నివేదిక సమర్పించిందన్నారు. ఓబీసీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఓబీసీ కోటాపై సీఎం కేసీఆర్ సూచనలకు అనుగుణంగా పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామని ఎంపీ తెలిపారు. 2020-21 విద్యాసంవత్సరం నుంచి ఈ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, దీనివల్ల దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీ విద్యార్థులకు న్యాయం జరుగనున్నదని పేర్కొన్నారు.

### 30 వరకు ఇంటర్ పరీక్షఫీజు గడువు పొడిగింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మార్చిలో నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి బుధవారం ప్రకటించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులకు రూ.3,000 ఆలస్యరుసుంగా, కళాశాలకు వెళ్లకుండా ప్రైవేట్‌గా పరీక్షలను రాసే విద్యార్థులకు ఆలస్యరుసుం రూ.1,200గా నిర్ణయించారు. ఇప్పటివరకు పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

### ఓయూ పీజీకోర్సుల ఫీజు గడువు 24

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ పరిధిలోని పీజీకోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్టు అధికారులు తెలిపారు. మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 24 వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుంతో జనవరి 2 వరకు చెల్లించవచ్చని, పరీక్ష తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని, ఇతర వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

### బిల్ కలెక్టర్లకు 'రీలింక్విష్‌మెంట్'

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జీహెచ్ఎంసీలో బిల్ కలెక్టర్ పోస్టులకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులు రీలింక్విష్‌మెంట్ ఇచ్చుకోవాలని టీఎస్‌పీఎస్సీ బుధవారం ప్రకటనలో తెలిపింది. ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియను పూర్తిచేసేందుకు ఈ నెల 20 నుంచి 23 వరకు అవకాశం ఉన్నదని పేర్కొన్నది.

**జూనియర్ అసిస్టెంట్ ఫలితాలు విడుదల**

రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ బుధవారం విడుదలచేసింది. వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

# బాల్యానికి తీపి బాధ!

## పాఠశాలస్థాయిలోనే మధుమేహం ముప్పు

- చదువుల ఒత్తిడిలో చితికిపోతున్న చిన్నారులు
- 19 ఏండ్లలోపువారిలో 10.4 శాతం షుగర్ బాధితులు
- అదేస్థాయిలో పెరుగుతున్న రక్తపోటు.. ఎన్‌హెచ్‌ఎం సర్వేలో వెల్లడి
- ఒత్తిడి తగ్గించడమే ఏకైక మార్గమంటున్న నిపుణులు

**రోగాలకు పునాది బీపీ, షుగర్.. వయస్సు మీదపడ్డాక ఇందులో ఏదో ఒకదానితో లేదా రెండింటితో బాధపడని వారంటూ ఉండరంటే అతిశయోక్తి కాదేమో.. ఆధునిక జీవనవిధానం, చదువుభారంతో పెరుగుతున్న ఒత్తిడి, పరిసరాల ప్రభావంతో ఈ మహమ్మారులు బాల్యాన్నీ పట్టిపీడిస్తున్నాయి. చదువే లక్ష్యంగా సాగుతున్న చిన్నారులతో ఆటలాడుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా బాల్యం 'తీపి' బాధను అనుభవిస్తున్నదని.. రక్తపోటూ రాకాసిలా భయపెడుతున్నదని జాతీయపోషకాహార సర్వే తేల్చింది. ఈ సర్వే ప్రకారం 19 ఏండ్లలోపువారిలో 10.4 శాతం మంది వీటి బారినపడ్డారు.**

**(తంగళ్లపల్లి సంపత్)**
**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆధునిక జీవన విధానం, చదువుల ఒత్తిడి, ర్యాంకుల కోసం పోరాటం, వ్యాయామానికి ప్రాధాన్యమివ్వకపోవడం తదితర పరిస్థితులు చిన్నారుల ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావంపై కేంద్రవైద్యఆరోగ్య మంత్రిత్వశాఖ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో యునిసెఫ్, జాతీయ పోషకాహార సంస్థ సర్వే నిర్వహించాయి. ఇందులోభాగంగా 2016 నుంచి 2018 డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా మొత్తం 1,12,316 మంది చిన్నారులను పరిశీలించారు. 51,029 మంది విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. 3,600 మంది విద్యార్థుల వయస్సు, బరువు ప్రకారం ఎదుగుదల ఉన్నదా అనే విషయాన్ని పరిశీలించారు. ఈ సర్వేలో 30 మంది మైక్రోస్కోపిస్టులు, 100 డాటా క్వాలిటీ మానిటర్స్, 200 మంది ల్యాబ్‌అసిస్టెంట్లు, 360 మంది వివిధ విభాగాల వైద్యనిపుణులు, 200 మంది కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. వివిధ అంశాలపై 900 మందిని ఇంటర్వ్యూ చేశారు. రెండేండ్లపాటు సర్వేచేసి, దాదాపు 9 నెలలపాటు రక్త నమూనాలను పరీక్షించారు. ఈ సర్వేలో తేలిన అంశాలకు సంబంధించిన నివేదికను నాలుగురోజుల క్రితం కేంద్ర వైద్యారోగ్యమంత్రిత్వశాఖ విడుదలచేసింది. ఈ సర్వేలో బాల్యానికి ప్రమాదం ఏర్పడినట్టు గుర్తించారు. రక్తహీనత, ఎదుగుదల లోపం, ఐరన్‌లోపంతో



పాటు, అత్యంత ప్రమాదకరమైనస్థాయిలో మధుమేహం పాకుతున్నట్టు వెల్లడయింది. దీనికి పలు కారణాలను సైతం విశ్లేషించారు.

**ఎంతెంత అంటే..!**

దేశవ్యాప్తంగా మొత్తం 9,673 మంది 5 నుంచి 9 ఏండ్ల వయసు చిన్నారులను పరిశీలించగా.. 10.3 శాతం మందికి మధుమేహం ముప్పు ఉన్నది. వీరిలో బాలుర శాతం 11.2.. బాలికల శాతం 9.2గా ఉన్నది. అర్బన్‌ప్రాంతాల్లో 9.1 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 10.7 శాతం మంది ఉన్నారు.

**పేదవిద్యార్థుల్లో 11.5 శాతం**

మధుమేహంబారిన పడుతున్నవారిని వర్గాలవారీగానూ గుర్తించారు. నిరుపేద విద్యార్థుల్లో 9.1 శాతం, పేదవిద్యార్థుల్లో 11.5 శాతం, మధ్యతరగతివర్గాలకు చెందినవారిలో 10.4 శాతం, ఉన్నతవర్గాల్లో 10 శాతం, సంపన్నవర్గాలవారిలో 10.2 శాతం ఈ ప్రమాదం ఉన్నది.

**తెలంగాణలో 8 శాతం**

తొమ్మిదేండ్లలోపు విద్యార్థులకు మధుమేహ ముప్పుఉన్న రాష్ట్రాల్లో మణిపూర్ 22.0 శాతంతో ముందువరుసలో ఉండగా.. ఆ తర్వాత సిక్కిం, త్రిపుర, గుజరాత్, ఒడిశా, పశ్చిమబెంగాల్ 20 నుంచి 21 శాతంతో ఉన్నాయి. తెలంగాణలో 8 శాతంగా నమోదయింది. రాష్ట్రంలో ఈ విభాగంలో 310 మంది విద్యార్థులను పరిశీలించారు.

### 10 నుంచి 19 ఏండ్ల మధ్య..

దేశస్థాయిలో కౌమార దశ విద్యార్థుల్లో (10 నుంచి 19 ఏండ్ల వరకు ) డయాబెటిస్ ముప్పు 10.4 శాతం మందికి ఉన్నది. మొత్తం 10,034 మందిని పరిశీలించారు. వీరిలో 0.6 శాతం మందికి ఇప్పటికే ఈ వ్యాధి ఉన్నట్టు తేలింది. బాలురలో 11.4 శాతం మందికి ముప్పు ఉన్నట్టు తేలగా.. 0.7 శాతం విద్యార్థులకు నిర్ధారణ అయింది. బాలికల్లో 9.3 శాతం మందికి ముప్పు ఉండగా.. 0.4 శాతం మందికి నిర్ధారణ అయింది. గ్రామీణప్రాంతాల్లో 10.2 శాతం, పట్టణప్రాంతాల్లో 10.9 శాతం ముప్పు ఉన్నట్టు తేలింది. నిరుపేదవర్గాల విద్యార్థులకు 11.1 శాతం, పేదవర్గాలకు 10.1 శాతం, మధ్యతరగతి వర్గాలకు 11.1, ఉన్నతవర్గాలకు 8.8, సంపన్నవర్గాలకు 10.9 శాతం ముప్పు ఉన్నది.

**తెలంగాణలో 8.6**

కౌమారదశ విద్యార్థుల్లో తెలంగాణలో మొత్తం 309 మంది రక్త నమూనాలు సేకరించగా.. 8.6 శాతం మందికి ముప్పుఉన్నది. వీరిలో 1.1శాతం మందికి నిర్ధారణయింది. ఈ దశలో కేరళ 32.2 శాతంతో ముందుండగా.. సిక్కిం 25.8శాతం, మిజోరాం 23.7శాతం, పశ్చిమ బెంగాల్ 22.1, మణిపూర్ 21.3, గుజరాత్ 20.9 శాతంతో తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

### ఒత్తిడి తగ్గించాల్సిందే



చదువుకునే వయస్సులోనే మధుమేహం, బీపీ బారినపడటం ప్రమాదకరమేనని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మానసిక ఒత్తిడినేనని వివరిస్తున్నారు. ప్రస్తుతం చదువులు.. ర్యాంకుల పేరుతో కేవలం పుస్తకాలకే పరిమితం చేస్తుండటం, ఆటలకు గంటసమయం కూడా కేటాయించకపోవడం, శారీరక శ్రమలేకపోవడం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని అంటున్నారు. మరోవైపు నిద్రలేమి, సమయానికి తినకపోవడం, జంక్‌ఫుడ్ మధుమేహం ముప్పుకు ప్రధాన కారకాలవుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రధానంగా తల్లిదండ్రులు, విద్యాలయాలు మార్పుకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉన్నదని సూచిస్తున్నారు.

**వయసులవారీగా మధుమేహం ముప్పు (శాతంలో)**

| | 5 -9 | 10 -19 |
|---|---|---|
| దేశవ్యాప్తంగా | 10.3 | 10.4 |
| తెలంగాణ | 8.0 | 8.6 |

### 'హై' లోనే 'బీపీ'

కౌమారదశ విద్యార్థుల్లో మధుమేహంతోపాటు, బీపీ కూడా పెరుగుతున్నట్టు తేలింది. దేశంలో మొత్తం 10,925 మంది 10 నుంచి 19 ఏండ్ల మధ్య విద్యార్థులను పరిశీలించగా.. 4.9 శాతం మందికి హైబీపీ ఉన్నట్టు గుర్తించారు. వీరిలో బాలురకు 4.7 శాతం, బాలికలకు 5.1 శాతం బీపీ ఉంటుంది. ప్రధానంగా 10 నుంచి 14 ఏండ్ల మధ్య 4.9 శాతం ఉంటుండగా.. 15 నుంచి 19 ఏండ్ల మధ్య 5శాతం మందికి బీపీ ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో 4.8 శాతం, అర్బన్ ప్రాంతాల్లో 5.4 శాతంగా నమోదయింది. నిరుపేద వర్గాల విద్యార్థుల్లో 5.5 శాతం, పేదవర్గాల్లో 5.9 శాతం, మధ్యతరగతిలో 3.7 శాతం, ఉన్నతవర్గాల్లో 3.6, సంపన్నవర్గాల్లో 6.2 శాతం మంది విద్యార్థుల్లో హైబీపీ ఉన్నది. తెలంగాణలో 364 మందిని పరిశీలించగా.. 6.7 శాతం మందికి హైబీపీ ఉన్నట్టు తేలింది. అత్యధికంగా బీపీతో బాధపడుతున్న విద్యార్థుల విభాగంలో 10.1శాతంతో ఢిల్లీ ముందువరుసలో ఉన్నది. రక్తంలో కొవ్వు అధికంగా ఉండటంతో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే విద్యార్థుల సంఖ్య కూడా 7 శాతంగా నమోదైంది. దీంతోపాటు 15.2 శాతం మంది హిమోగ్లోబిన్ సమస్యతో బాధపడుతున్నారు.

# వరంగల్‌కు మెట్రో నియో!

- మంత్రి కేటీఆర్ ఆహ్వానంతో నగరంలో అధ్యయనం
- జిల్లా యంత్రాంగంతో సమావేశం
- పనితీరుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

వరంగల్ మహానగరానికి మెట్రో నియో రైల్ రాబోతున్నదా?.. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, జరుగుతున్న పరిణామాలు దానినే సూచిస్తున్నాయి. ప్రస్తుతం మహారాష్ట్రలోని నాగ్‌పూర్, పుణె, నాసిక్ నగరాల్లో అక్కడి ప్రభుత్వం మెరుగైన ప్రజారవాణా సౌకర్యం కోసం చేస్తున్న ప్రయత్నాలను పరిశీలించిన పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ మన రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లోనూ ఈ మెట్రో నియోను అందుబాటులోకి తేవాలని భావించారు. దీంతో మంత్రి మహా మెట్రో ప్రతినిధులతో చర్చించి, ఆ ప్రతినిధి బృందాన్ని వరంగల్ నగరంలో కూడా పరిశీలించాలని ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో మహా మెట్రో ప్రతినిధులు, హెచ్ఎండీఏ అధికారులు బుధవారం వరంగల్‌లో పర్యటించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఇక్కడి రోడ్ నెట్‌వర్క్, జనాభా, రోజువారీ ప్రయాణ సదుపాయాలు మొదలైన అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనంచేశారు. అనంతరం వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, నగర మేయర్ గుండా ప్రకాశ్‌రావు, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డితో సమావేశమయ్యారు.



బుధవారం వరంగల్‌లో పర్యటించిన మహామెట్రో ప్రతినిధులతో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మేయర్ గుండా ప్రకాశ్‌రావు, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ తదితరులు

10 లక్షల జనాభా ఉన్న వరంగల్ మహానగరంలో మెట్రో నియో ప్రాజెక్టును అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఈ ప్రాజెక్టు అధ్యయనం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే దాదాపు రూ.1,100 నుంచి 1,200 కోట్లతో వరంగల్ మహానగరానికి మెట్రో నియో సేవలు అందుబాటులోకి వచ్చే అవకశాశం ఉన్నది. ప్రపంచంలోని దాదాపు వంద దేశాల్లో అతి తక్కువ ఖర్చుతో ప్రజారవాణాలో తనదైన ముద్ర వేసిన మెట్రో నియో.. మన దేశంలో మహారాష్ట్ర తర్వాత తెలంగాణలోనే అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. దేశంలో పెరుగుతున్న నగరాల జనాభాకు అనుగుణంగా మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఈ సంస్థ సహకరిస్తుంది. ముందుగా హెచ్ఎండీఏ ట్రాన్స్‌పోర్ట్ హెడ్ విజయలక్ష్మి, కుడా ప్లానింగ్ అధికారి అజిత్‌రెడ్డితో కలిసి కాజీపేట నుంచి పెట్రోల్ బంక్, అక్కడినుంచి పోచమ్మమైదాన్ మీదుగా వెంకట్రామ టాకీస్ నుంచి రైల్వేస్టేషన్, అక్కడినుంచి తిరిగి వరంగల్ చౌరస్తా మీదుగా పోచమ్మమైదాన్ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మహా మెట్రో డిప్యూటీ డైరెక్టర్ ఎస్కే సిన్హా తమ సంస్థ చేపడుతున్న ప్రాజెక్టుల వివరాలను, మెట్రో నియో పనితీరు ఏ విధంగా ఉంటుందో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మెట్రో నియో ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 శాతం నిధులు సమకూర్చుకోవచ్చని, లేదా పీపీటీ పద్ధతిలోగానీ లేదా గ్లోబల్ ఫైనాన్షియల్ సంస్థల్లో 60 శాతం నిధులను రుణాలుగా తీసుకొని, మిగతా 40 శాతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 శాతం చొప్పున సమకూర్చుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సమావేశ వివరాలను రాష్ట్ర పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శికి నివేదించాలని మహా మెట్రో అధికారులు కలెక్టర్‌ను కోరారు.

### కాళోజీ వర్సిటీలో పలు పోస్టులకు నోటిఫికేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో నాలుగు అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఒక స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని, మిగతా వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.


**TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION**
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad

**ASSISTANT REGISTRAR AND STATISTICAL OFFICER IN THE KALOJI NARAYANA RAO UNIVERSITY OF HEALTH SCIENCES, WARANGAL (GENERAL RECRUITMENT)**

Applications are invited online from qualified candidates through the proforma Application to be made available on Commission's website **(www.tspsc.gov.in)** for the Notifications pertaining to the posts in Kaloji Narayana Rao University of Health Sciences, Warangal, Telangana.

| Notification Number | Name of the Post | No.of Vacancies |
|---|---|---|
| 08/2019 | Assistant Registrar | 04 |
| 09/2019 | Statistical Officer | 01 |

The Candidates are advised to visit Commission's Website:**(www.tspsc.gov.in)** for detailed Notifications, submission of online applications and Last date for Submission of Applications, which will be uploaded later.

**Hyderabad** Sd/-
**Date. 18/12/2019.** **SECRETARY**
DIPR R.O. No.548-pp/CL/Advt/1/2019-20







# సిద్దిపేట అదనపు డీసీపీకి భారీ ఆస్తులు

- ఏసీబీ తనిఖీలో వెల్లడయిన అధికారి సంపద
- గోవింద్ నర్సింహారెడ్డి ఇండ్లు, ఆఫీస్‌లో రూ.కోట్లు విలువైన 12 ప్లాట్లు, భూముల పత్రాలు స్వాధీనం
- పట్టుబడిన నగదు, బంగారు ఆభరణాలు

**హైదరాబాద్/సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) గోవింద్ నర్సింహారెడ్డిపై ఏసీబీ అధికారులు సెక్షన్ 13(1)(బీ), రెడ్‌విత్ 13(2) సెక్షన్ల కింద మంగళవారం కేసు నమోదుచేశారు. ఈ మేరకు మంగళ, బుధవారాల్లో కరీంనగర్ ఏసీబీ అదనపు ఎస్పీ అనూష నేతృత్వంలో బృందాలుగా విడిపోయి జరిపిన సోదాల్లో పెద్దఎత్తున ఆదాయానికి మించి ఆస్తులకు సంబంధించిన ఆధారాలు లభించినట్టు అధికారులు తెలిపారు. నర్సింహారెడ్డి ఇండ్లు, కార్యాలయంలోనూ సోదాలు కొనసాగినట్టు వివరించారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, షాద్‌నగర్‌లలో నర్సింహారెడ్డి బంధువులు, కుటుంబసభ్యుల ఇండ్లలోనూ సోదాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నర్సింహారెడ్డి బినామీల పేరిట హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మొత్తం 12 ప్లాట్లు గుర్తించారు. వీటి విలువ డాక్యుమెంట్ల ప్రకారం రూ.4 కోట్లవరకు ఉంటుందని తెలిసింది. కోట్ల విలువైన వ్యవసాయ భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నర్సింహారెడ్డి ఇంట్లో పెద్దమొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు పట్టుబడినట్టు తెలుస్తున్నది. అదనపు డీసీపీకి దగ్గరగా ఉండే వన్‌టౌన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లోనూ సోదాలు జరిగాయి. ఏసీబీ అదనపు ఎస్పీ అనూష, డీఎస్పీ భద్రయ్య, ముగ్గురు సీఐలతో కూడిన బృందం నర్సింహారెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించారు. మరో బృందం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చౌడారంలోని సుమారు 8.4 ఎకరాల భూవివరాలు, కొండపాక మండలం మేథీనిపూర్‌లో కొనుగోలుచేసిన 7.20 ఎకరాల భూవివరాలను స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించింది. మర్కూక్ మండలంలో మరో ఐదెకరాలను నర్సింహారెడ్డి కొనుగోలు చేసినట్టు సమాచారం. ఈ సోదాలు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలవరకు కొనసాగాయి.



సిద్దిపేటలోని అదనపు డీసీపీ నర్సింహారెడ్డి క్యాంపు ఆఫీస్



సిద్దిపేట క్యాంపు ఆఫీస్ నుంచి స్వాధీనం చేసుకున్న పత్రాలు తీసుకెళుతున్న ఏసీబీ అధికారి

**డీఎస్పీ నుంచి అదనపు డీసీపీగా..**

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గోవింద్ నర్సింహారెడ్డి పదోన్నతిపై సిద్దిపేట డీఎస్పీగా 2016లో బాధ్యతలు స్వీకరించారు. కొత్త జిల్లా ఆవిర్భావంతో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఏర్పాటైంది. ఏసీపీగా 13 నెలలపాటు పనిచేశారు. అనంతరం అదనపు డీసీపీగా పదోన్నతి పొంది సిద్దిపేటలోనే మూడేండ్లుగా పనిచేస్తున్నారు.



అమిత్ షా దేశానికి హోం మంత్రి. కేవలం బీజేపీ నేతగా వ్యవహరించరాదు. దేశంలో శాంతిభద్రతలను కాపాడాలి. మీరు సబ్‌కా వికాస్ అన్నారు. కానీ ఇప్పుడు సర్వనాశనం చేస్తున్నారు. బెంగాల్‌లో ఆ చట్టానని మీరెలా అమలుచేస్తారో నేను చూస్తాను. మీరెదో పెద్ద బండరాయి, నేను ఎలుకను అనుకుంటున్నారు. మీరేం భయపెట్టలేరు. తిరుగబడి కొరికేస్తాం.

**మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి**

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం దేశపౌరులకు సంబంధించినది కాదు. అది విదేశీయులకే వర్తిస్తుంది. కాబట్టే దీనికి మద్దతు ఇచ్చాం. అయితే, ఎన్నార్సీని మాత్రం మేం తొలినుంచీ వ్యతిరేకిస్తున్నాం. దీనిపై మా వైఖరి ఇప్పటికీ అదే.

**నవీన్ పట్నాయక్, ఒడిశా ముఖ్యమంత్రి**



### చరిత్రలో నేడు




**1941**

జర్మనీ సైన్యంపై సంపూర్ణ అధికారాన్ని చేజిక్కించుకున్న హిట్లర్.

**1946**

ఫ్రెంచి పాలనకు వ్యతిరేకంగా పోరాటానికి పిలుపునిచ్చిన వియెత్నాం విప్లవ నేత హోచిమిన్.





**1950**

చైనా ఆక్రమణతో టిబెట్ నుంచి పారిపోయిన దలైలామా.

చైనా రెండవ విమాన వాహక నౌక షాండాంగ్ మంగళవారం నాడు సైన్యానికి చేరింది. ఈ నౌక పూర్తిగా స్వదేశంలోనే తయారైంది. సైన్యం ఆధునీకరణ మూలంగా చైనా రక్షణ సామర్థ్యం వేగంగా పెరుగుతున్నది. అయితే ప్రపంచంలోని ఉన్నతశ్రేణి సైనిక శక్తిగా ఇంకా ఎదుగలేదు. ఇందుకు చాలాకాలం పట్టవచ్చు. అయితే చైనా తన సైన్యాన్ని ఏ విధంగా ఉపయోగించుకుంటుందనేదే ప్రశ్న. చైనా తన బలాన్ని పెంచుకోవడం అమెరికాకు వ్యతిరేకంగా కాదు.

**గ్లోబల్ టైమ్స్**

కెనడాలో ప్రభుత్వానికి మెజారిటీ లేకపోవడంతో ఇటీవల ప్రతిపక్షాలన్నీ ఏకమై తమ దేశానికి, చైనాతో గల సంబంధాలను పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటుచేయగలిగాయి. చైనా కంపెనీ అధికారి మెంగ్ వాంజూను అప్పగించవలసిందిగా అమెరికా కోరినప్పటి నుంచి వివాదం మొదలైంది. కెనడా మెంగ్‌ను అరెస్టు చేయడం చైనాకు ఆగ్రహం కలిగించింది. చైనా ప్రతీకారంగా ఇద్దరు కెనడియన్లను గూఢచార అభియోగంతో అరెస్టు చేసింది. కెనడా ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం లేదు. కెనడా ఇక ముందు చైనాతో సంబంధాలను పటిష్టపరుచుకునేందుకు ప్రయత్నించాలె.

**టొరంటో స్టార్**



# ముషార్రఫ్‌కు శిక్ష

సైనిక పాలనకు ప్రసిద్ధికెక్కిన పాకిస్థాన్‌లో ఒకప్పటి సైనిక–అధ్యక్షుడు ముషార్రఫ్‌కు న్యాయస్థానం మరణశిక్ష విధించడం అసాధారణం. దేశం విడిచివెళ్లి అనారోగ్యం పేరుతో దుబాయిలో చికిత్స పొందుతున్న ముషార్రఫ్‌ను రప్పించి శిక్షను అమలుజరుపడం అంత సులభం కాదు. కానీ న్యాయస్థానం ముషార్రఫ్ వంటి బలమైన మాజీ సైనిక పాలకుడికి మరణశిక్ష విధించగలగడమే ఒక అనూహ్య పరిణామం. సైనికాధ్యక్షుడికి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినందుకు న్యాయస్థానం శిక్ష విధించడం పాకిస్థాన్ చరిత్రలో ఇదే మొదటిసారి. అయితే ముషార్రఫ్‌కు శిక్ష విధించిన కేసు ప్రజా ప్రభుత్వాన్ని కూలదోసినందుకు కాదు. 2007లో రాజ్యాంగాన్ని రద్దుచేసి, అత్యవసర పరిస్థితి విధించిన ముషార్రఫ్ ప్రధాన న్యాయమూర్తితో సహా న్యాయమూర్తులు అందరినీ జైలులో బంధించాడు. ఈ కేసులో దేశద్రోహానికి పాల్పడ్డట్టు నిర్ధారించిన న్యాయస్థానం ముషార్రఫ్‌కు మరణశిక్షను విధించింది. ఇటీవలికాలంలో అతి స్వల్ప వ్యవధిలోనే న్యాయస్థానం రెండుసార్లు సైనిక వ్యవస్థకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సైన్యాధ్యక్షుడు జనరల్ ఖమర్ జావేద్ బజ్వాకు మూడేండ్ల పాటు పదవీకాలాన్ని పొడిగించినప్పుడు ఇందుకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. న్యాయస్థానం బజ్వా పదవీకాలం పొడిగింపును ప్రశ్నించింది. ఇందుకు నిబంధనలు లేవని ఆక్షేపించింది. పదవీకాలాన్ని ప్రస్తుతానికి ఆరు నెలలకు తగ్గిస్తూ పార్లమెంటు చట్టాన్ని సవరిస్తేనే పొడిగింపు సాధ్యమని స్పష్టంచేసింది.

**న్యాయస్థానం తాజా తీర్పు పాకిస్థాన్ అధికార వ్యవస్థలోని బలాబలాల్లో మార్పును సూచిస్తున్నదా అనేది ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే. పాకిస్థాన్‌లో అధికారంలో ఉన్న ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సైన్యం చేతిలో కీలుబొమ్మ. రెండు ప్రధాన రాజకీయపక్షాలు కాకుండా ఇమ్రాన్‌ఖాన్ అధికారంలోకి రావడానికి దేశవ్యాప్తంగా సైన్యం ఇచ్చిన మద్దతే కారణం. ఇమ్రాన్ ప్రభుత్వం ముషార్రఫ్‌పై విచారణ సాగకుండా అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించింది. కానీ న్యాయస్థానం దృఢంగా ఉండటంతో విఫలమైంది. ఇప్పుడు ఇమ్రాన్‌ఖాన్ బృందం, సైనికాధికారులు లోలోపల మంతనాలు జరుపుతున్నారు.**

పాకిస్థాన్ న్యాయస్థానం సైన్యాధ్యక్షుడి పదవీకాలం పొడిగింపును అడ్డుకోవడమే కాదు, ఈ సందర్భంగా సైన్యం అధికారాలపై చేసిన వ్యాఖ్యలు కూడా పుండు మీద కారం చల్లినట్టుగా ఉన్నాయి. పాకిస్థాన్ విచిత్రమైన చారిత్రక నేపథ్యంలో సైన్యాధ్యక్షుడు ఎన్నోవిధాలుగా శక్తిమంతమైన అధికారాలు కలిగి ఉంటాడు. ఇంతటి హద్దులేని, వ్యవస్థకు అతీతమైన అధికారం ఉండటం ప్రమాదకరం అని హెచ్చరించింది. సైన్యాధ్యక్షుడి పదవీకాలం పొడిగింపు, పునర్నియామకం మొదలైనవి ఏ చట్టంతో నిమిత్తం లేకుండా ఉండటం ఏమిటని ప్రశ్నించింది. 'నీవు ఎంత ఉన్నతుడివైనా కావచ్చు, కానీ చట్టం నీకన్నా ఉన్నతమైనది' 1616లో ఇంగ్లాండ్ రాజు మొదటి జేమ్స్ కేసులో ప్రధాన న్యాయమూర్తి ఎడ్వర్డ్ కోక్ చేసిన వ్యాఖ్యలను న్యాయస్థానం ఉదహరించింది. ఈ విధంగా న్యాయస్థానం తీర్పు, వ్యాఖ్యలు పాకిస్థాన్‌లో అపరిమిత అధికారాలు చెలాయిస్తున్న సైన్యానికి అవమానకరంగా మారాయి. పాకిస్థాన్ ప్రజాస్వామ్యం పరిణతదశకు చేరుకున్నదని కూడా ఈ సందర్భంగా న్యాయస్థానం పేర్కొన్నది. కానీ పాకిస్థాన్ చరిత్రలో అత్యధిక భాగం సైన్యమే పాలించింది. పాకిస్థాన్‌తోపాటు పలు దేశాలలో సైనిక తిరుగుబాట్ల వెనుక అమెరికా హస్తం ఉందనేది స్థిరపడిన అభిప్రాయం. అఫ్ఘానిస్థాన్‌లో కార్యకలాపాలు సాగించడానికి ముషార్రఫ్‌ను ఉపయోగించుకున్నది అమెరికానే. ముషార్రఫ్ 1999లో సైనిక తిరుగుబాటు జరిపి పాకిస్థాన్ ముస్లిం లీగ్ నాయకుడు నవాజ్ షరీఫ్ ప్రధాని నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూలదోశాడు. 2007 కల్లా ప్రజా ఉద్యమాలు పెరిగిపోవడంతో ముషార్రఫ్ ఎన్నికలు జరుపవలసి వచ్చింది. బెనజీర్ భుట్టో హత్య నేపథ్యంలో జరిగిన ఎన్నికలలో పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ విజయం సాధించింది. అయితే ముష్రారఫ్ గద్దె దిగితే ఆయనకు క్షమాభిక్ష పెట్టేవిధంగా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కుదరడంలో అమెరికా తెరవెనుక మధ్యవర్తిత్వ పాత్ర వహించింది. కానీ 2013 ఎన్నికల్లో నవాజ్ షరీఫ్ అధికారానికి రావడంతో ముషార్రఫ్‌పై విచారణ మొదలైంది. నాటినుంచి ముషార్రఫ్‌పై ఉచ్చు బిగిస్తూనే ఉన్నది కానీ ఆయన విదేశాల్లో పరారీలో ఉన్నాడు.

న్యాయస్థానం తాజా తీర్పు పాకిస్థాన్ అధికార వ్యవస్థలోని బలాబలాల్లో మార్పును సూచిస్తున్నదా అనేది ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే. పాకిస్థాన్‌లో అధికారంలో ఉన్న ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సైన్యం చేతిలో కీలుబొమ్మ. రెండు ప్రధాన రాజకీయపక్షాలు కాకుండా ఇమ్రాన్‌ఖాన్ అధికారంలోకి రావడానికి దేశవ్యాప్తంగా సైన్యం ఇచ్చిన మద్దతే కారణం. ఇమ్రాన్ ప్రభుత్వం ముషార్రఫ్‌పై విచారణ సాగకుండా అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించింది. కానీ న్యాయస్థానం దృఢంగా ఉండటంతో విఫలమైంది. ఇప్పుడు ఇమ్రాన్‌ఖాన్ బృందం, సైనికాధికారులు లోలోపల మంతనాలు జరుపుతున్నారు. రాజకీయ వ్యవస్థ సైన్యాన్ని ఎదుర్కోలేని పరిస్థితుల్లో న్యాయవ్యవస్థ ఎదిరించిన సందర్భాలున్నాయి. ముషార్రఫ్ సైనిక పాలకుడిగా ఉన్నప్పుడు న్యాయవ్యవస్థతో ఘర్షణలు జరిగాయి. 2007లో ముషార్రఫ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇఫ్తికర్ మహమ్మద్ చౌదరిని తొలిగించినప్పుడు దేశవ్యాప్త నిరసన వ్యక్తమైంది. ఇప్పుడు కూడా రాజకీయ వ్యవస్థ బలంగా నిలబడితే న్యాయస్థానం నుంచి ప్రజల నుంచి పూర్తి మద్దతు లభిస్తుంది. సైన్యానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ ముస్లింలీగ్, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఏకమై ప్రజాస్వామ్య ప్రతిష్ఠాపనకు ఉద్యమించాలె. రాజకీయ ప్రయోజనాలకన్నా ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరుచడం ప్రధానమని గ్రహించాలె.

**జనగళం**

## విద్యార్థులే దేశ భవిష్యత్

బీజేపీ సర్కారు తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం దేశంలో ఆందోళనలు రేపుతున్నది. గత కొన్నిరోజుల నుంచి దేశం అట్టుడుకుతున్నది. ముఖ్యంగా ఢిల్లీలోని జామియా మిలియా విశ్వవిద్యాలయ విద్యార్థులపై దౌర్జన్యం దేశాన్ని కదిలించింది. వాళ్లమీద దాడిచేసింది పోలీసులు అని చెబుతున్నా.. సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు వైరలవుతున్నాయి. విద్యార్థి ఆందోళన సందర్భంగా జరిగిన హింసకు కారణమైంది.. బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, జీన్స్‌ప్యాంట్లు, షూలు, చేతిలో కర్రలతో అచ్చం పోలీసులను పోలినట్టు ఉన్న ఏబీవీపీ, ఆరెస్సెస్ కార్యకర్తలే బస్సులకు నిప్పంటించినట్లు ఉన్నది. అలాగే పోలీస్ డ్రెస్సుల్లో ఉన్న వ్యక్తులే హింసాదౌర్జన్యాలు చేశారని కొన్ని దృశ్యాలు చెబుతున్నాయి. వీటిపై ప్రభుత్వం స్పందించకపోవటం గమనార్హం.

'మేం పోరాడుతున్నది ముస్లింల కోసం కాదు, దేశం కోసం. ఈ దేశం లౌకిక దేశం' అని జామియా విద్యార్థులు నినదిస్తున్నారు. పోలీసుల నిర్బంధాలను ధిక్కరిస్తూ పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లాఠీ దెబ్బలను ఎదిరించి పోలీసుల దాడులను ప్రతిఘటిస్తున్నారు. దేశాన్ని మత ప్రాతిపదికన విభజించే రాజకీయాలను ఎదిరిస్తామని నినదిస్తున్నారు. అలాగే కొందరు 'తమను ఇండ్లలోనే ఉండాలనీ, మాట్లాడకూడదని చెప్తారనీ, కానీ ఇప్పుడు మాట్లాడకుండా ఉండటం సరైన సమయం కాదని' విద్యార్థినులు అంటున్నారు. చట్టం ముందు అందరూ సమానులే అన్న రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా ఈ చట్టం ఉన్నదని నిరసిస్తున్నారు. మరోవైపు సాధారణంగానే ఉద్యమాలకు దూరంగా ఉండే ప్రతిష్ఠాత్మక మద్రాస్, ఖరగ్‌పూర్, కాన్పూర్ తదితర ఐఐటీ విద్యార్థులు కూడా బీజేపీ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. బెనారస్ హిందూ యూనివర్సిటీ మొదలుకొని హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ యూనివర్సిటీ విద్యార్థుల వరకూ పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకిస్తున్నారు. దాదాపుగా దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాన్నీ ఆందోళన బాట పట్టాయి. కాబట్టి కేంద్రం ప్రతిష్ఠకు పోకుండా పౌరసత్వ సవరణ చట్టంపై పునరాలోచించాలి. విద్యార్థులే దేశ భవిష్యత్తు అనే విషయాన్ని ప్రభుత్వాలు మరువకూడదు. దేశవ్యాప్తంగా ప్రజానీకమంతా నిరసిస్తున్న ఈ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి. లేకపోతే కేంద్రం తగిన ఫలితాన్ని అనుభవించకతప్పదు.

**- వినోద్ మామిడాల**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# ప్రభావం చూపని 'బాబు' ప్రచారం

**ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెలంగాణకు తాకట్టుపెడుతున్నారంటూ టీడీపీ అధినేత చంద్రబాబు చేస్తున్న ఆరోపణలను అక్కడ అత్యధికులు నమ్మటం లేదు. వివిధ ప్రతిపక్షాలు, సాధారణ ప్రజలే గాక చివరకు టీడీపీకి చెందినవారు కూడా ఈ మాటలను తేలికగా కొట్టివేస్తున్నారు. ఇందులో రాజకీయం తప్ప వాస్తవం లేదన్నది ఈ రచయిత గుంటూరు జిల్లాను మూడురోజుల పాటు సందర్శించిన సందర్భంగా పట్టణవాసులతో పాటు గ్రామీణుల నుంచి వినవచ్చిన అభిప్రాయం. ఇటువంటి అభిప్రాయాలు ఏర్పడటానికి మూడు కారణాలున్నాయి.**

ఒకటి, చంద్రబాబుపై ఇంతకాలం ఏర్పడిన అపనమ్మకం ఇప్పటికీ తగ్గకపోవడం. తగ్గకపోవటమే గాక, ఇప్పుడు ప్రతిపక్ష నాయకుని పాత్రలో ఆయన వ్యవహరిస్తున్న తీరువల్ల ఇంకా పెరుగుతుండటం. రెండు, జగన్మోహన్‌రెడ్డి గత ఆరు నెలల పాలన ప్రజలకు నమ్మకాన్ని కలిగిస్తుండటం. ఆయన తెలంగాణతో నెరపే సంబంధాలు రాష్ట్ర ప్రయోజనాల కోసమే తప్ప అందుకు హాని చేయగలవనే అనుమానాలు ఎంతమాత్రం లేకపోవటం. మూడు, ఒక ముఖ్యమంత్రిగా కేసీఆర్ పట్ల, ఒక రాష్ట్రంగా తెలంగాణ పట్ల, అక్కడి ప్రజల పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏర్పడిన గౌరవాభిమానాలు. రాష్ట్ర విభజన తర్వాత కొద్దికాలం నుంచి మొదలుకొని ఈ విధంగా ఏర్పడసాగిన గౌరవాభిమానాలు, రెండవ విడుత ఎన్నికలు జరిగి కేసీఆర్ తిరిగి అధికారానికి వచ్చినప్పటి నుంచి మరింతగా పెరుగుతున్నాయి. ఈ మూడు పరిస్థితుల జమిలి ఫలితమే పైన పేర్కొన్న తరహా చంద్రబాబు ప్రచారం ప్రజలపై ఎటువంటి ప్రభావం చూపకపోవటానికి కారణమవుతున్నది. ఆ ప్రచారాన్ని కొంత నమ్ముతున్నట్లు కనిపిస్తున్న వారిలో రెండు విధాలైన వారున్నారు. ఒకటి, ధనిక వర్గాలకు, ఉన్నత వర్గాలకు చెంది బలమైన ప్రయోజనాలు కలవారు. రెండు, స్వయంగా చంద్రబాబుకు సన్నిహితులైన వారు. అయితే టీడీపీకి చెందిన ఒక చట్టసభ సభ్యుని అభిప్రాయాన్ని బట్టి, అటువంటి సన్నిహితుల్లోనూ ఆ ప్రచారాన్ని నిజంగా నమ్ముతున్నది ఎందరో, నమ్ముతున్నట్లు నటిస్తున్నది ఎందరో చెప్పగల పరిస్థితి లేదు.

దానినట్లుంచి, పైన పేర్కొన్న మూడు కారణాల వివరాల్లోకి వెళ్దాం. ఉమ్మడిరాష్ట్రం విడిపోయిన తర్వాత ఐదేండ్ల పాటు సాగిన చంద్రబాబు పాలనలో సంక్షేమం, అంతకన్న ముఖ్యంగా అభివృద్ధి జరుగవలసినంతగా జరుగలేదనే అభిప్రాయం కలుగటమే గాక, పరిపాలనపరంగా, అధికారపక్షమైన టీడీపీ పరంగా జరుగకూడనివి అనేకం జరిగాయన్న భావనతోనే ప్రజలు ఆయనను అంత దారుణంగా ఓడించారు. ఆ విధంగా ఏర్పడిన అపనమ్మకం అట్లుండగా, తర్వాత ప్రతిపక్షనేతగా చంద్రబాబు నేర్చుకోవలసిన పాఠాలు నేర్చుకొని తిరిగి నమ్మకాన్ని సంపాదించుకొనటానికి బదులు అదే అపనమ్మకాన్ని ఇంకా పెంచుకునేవిధంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం అక్కడి ప్రతిపక్షాలకు, ప్రజలకు ఏర్పడుతున్నది. తెలంగాణ ప్రభుత్వంతో జగన్ సంబంధాల గురించి చంద్రబాబు చేస్తున్న ప్రచారంతో నిమిత్తం లేకుండా ఈ ప్రచారానికన్న ముందుకాలంలోనే కలుగుతుండిన భావన ఇది. అటువంటి నేపథ్యంలో టీడీపీ అధ్యక్షుడు ఈ ప్రచారాన్ని ఆరంభించటం వల్ల దానికి విలువ, విశ్వసనీయత కలుగకుండాపోతున్నట్లు గుంటూరు నగరంలో, గ్రామీణ ప్రాంతాల్లో పలువురు చేసిన వ్యాఖ్యలను బట్టి తోస్తున్నది.

ఈ అభిప్రాయానికి బలం చేకూర్చుతున్న మరొక స్థితి జగన్మోహన్‌రెడ్డి తొలి ఆరు మాసాల పరిపాలన పట్ల అంతటా సానుకూలత కనిపించటం. నగరంలో, గ్రామాల్లో వివిధ వృత్తులు, కులాలు, వర్గాల వారే గాక అన్ని ప్రతిపక్షాల ముఖ్యుల అభిప్రాయం ఇదే. పార్టీల వారు రాజకీయ విమర్శలు బహిరంగంగా ఏమి చేసినా, ముఖాముఖిన కూర్చుని ఇష్టాగోష్టిగా మాట్లాడినపుడు, వాస్తవస్థితి ఏమిటో వారే స్వయంగా చెప్తున్నారు. ఆశ్చర్యంగా తోచవచ్చుగాని చివరకు తెలుగుదేశం నాయకులు, శ్రేణులు సైతం ఇదే అభిప్రాయంతో ఉన్నారు. అటువంటప్పుడు జగన్మోహన్‌రెడ్డి తమ రాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణకు తాకట్టు పెట్టడమన్న ప్రచారమే వారికి హాస్యాస్పదంగా తోస్తున్నది. వీరందరి దృష్టిలో సెక్రటేరియట్ భవనాలను తెలంగాణకు అప్పగించటంలో అభ్యంతరపెట్టదగింది అసలు ఏమీ లేదు. అవి నిరుపయోగంగా పడి ఉండటం, ఆంధ్రప్రదేశ్ అవసరాల కోసం జగన్ ప్రభుత్వం కోరుకున్న భవనాలను కేసీఆర్ ప్రభుత్వం వెంటనే ఇవ్వటం వీరు ఎత్తి చూపుతున్న విషయాలు. నీళ్లు, ఆస్తులు, ఉద్యోగాల వంటివి ముఖ్యమైనవి గనుక రాత్రికిరాత్రి తేలేవి కావని, అయితే ఐదేండ్ల పాటు చంద్రబాబు చూపిన వైరభావంతో గాక మైత్రీభావంతో జగన్ వ్యవహరిస్తుండటమే వాంఛనీయమైనదనే భావన సర్వత్రా వ్యక్తమవుతుండటం గమనించదగ్గ విశేషం. ఈ విషయంలో జగన్‌కు, చంద్రబాబుకు మధ్యగల తేడా వంటిదే ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ప్రతిపక్షాలు ఒకవైపు, చంద్రబాబు ఒక్కరూ మరొకవైపు అన్నట్లుగా ఉంది. అందువల్లనే చంద్రబాబు చేస్తున్న ప్రయోజనాల తాకట్టు ప్రచారం ఎటువంటి ప్రభావాన్ని చూపటం లేదు.

ప్రభావాన్ని దాదాపు శూన్యం చేస్తున్న మరొక స్థితి, పైన ప్రస్తావించినట్లు, ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల, తెలంగాణ రాష్ట్రం పట్ల, అక్కడి ప్రజల పట్ల ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ ప్రజలకు, వివిధ శిష్టవర్గాలకు, రాజకీయ పార్టీలకు ఏర్పడిన గౌరవాభిమానాలు. రాష్ట్ర విభజన జరిగినప్పుడు కొద్ది కాలం పాటు ఉండిన వైమనస్యత తొలిగిపోవటం అనతికాలంలోనే మొదలై గౌరవాభిమానాలు ఏర్పడుతుండటం తెలిసిందే. ఈ మార్పు చంద్రబాబు పాలన కాలంలోనే కనిపించగా, ప్రజలు వ్యతిరేకించిన ఆయన చిత్తయి జగన్ అధికారానికి వచ్చిన తర్వాత వేగాన్ని అందుకుం ది. అందుకు ప్రధాన కారణం, కేసీఆర్ సమర్థుడైన నాయకుడు, పాలకుడు అంటూ గత ఐదేండ్ల పాటు ఏర్పడిన భావన, ఆయన తిరిగి అధికారానికి వచ్చిన తర్వాత మరింత బలపడుతుండటం. అందుకు అదనంగా ఆయన ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కావలసింది కరచాలనమే తప్ప ఖడ్గచాలనం కాదని ప్రకటించటాన్ని అక్కడివారు గుర్తు చేస్తున్నారు. అమరావతి ప్రారంభోత్సవానికి వెళ్లిన కేసీఆర్ ఇదే స్నేహ హస్తాన్ని చంద్రబాబుకు కూడా అందించినా ఆయన దానిని అందుకొనటానికి బదులు వెనుకటి శత్రు వైఖరినే కొనసాగించటాన్ని కొద్దిమంది ప్రస్తావిస్తూ, టీడీపీ అధినేత కూడా జగన్ వలె సానుకూల వైఖరిని అవలంబించి ఉంటే ఈ సరికి పరస్పర సహకారంతో రెండు రాష్ర్టాలకు ఎం తో మంచి జరిగి ఉండేదని అభిప్రాయపడుతున్నారు. వెరసి ఇవన్నీ కలగలసి చంద్రబాబు ప్రచారాన్ని ఒక పరాజయ వ్యూహంగా మార్చివేశా యన్నది స్పష్టమైంది.

గుంటూరు జిల్లా సందర్శన సందర్భంగా దృష్టికి వచ్చిన మరొక రెండు విషయాలను ఇక్కడ ప్రస్తావించాలి. వాటిలో ఒకటి అక్కడి కొత్త ప్రభుత్వపు తొలి ఆరు నెలల పాలన. ఈ కాలంలో జగన్ తన వైఫల్యాలతో చాలా చెడ్డపేరును మూటకట్టుకున్నారన్నది చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిరంతరం అంటున్న మాట. వారి నిరంతర హోరును దూరం నుంచి వినేవారు అది నిజమనుకోవచ్చు కూడా. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ప్రతిపక్షాలు అట్లా అనుకోవటం లేదన్నది క్షేత్రస్థాయికి వెళ్లి వివిధ వర్గాలు, పార్టీలతో ముఖాముఖిగా మాట్లాడినపుడు అర్థమయే విషయం. జగన్ పాలనలో మంచి తగినంత ఇప్పటికే జరిగిందని, మరింత మంచికి ఆరంభాలు జరిగాయని, ఇసుక వంటి విషయాల్లో తలెత్తిన ఇబ్బందులు తొలిగిపోతున్నాయని, ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలే అయినందున మునుముందు ఏమి జరిగేదీ వేచి చూడాలని, జగన్ ఉద్దేశాలు మంచివి కావటమే గాక ఆయన చెప్పింది చేసే లక్షణం గల పట్టుదల మనిషి అయినందున రాగల కాలం బాగుండవచ్చునన్నది ఈ వివిధ వర్గాలవారు చెప్పిన దాని సారాంశం.

**గుంటూరు జిల్లా సందర్శన సందర్భంగా దృష్టికి వచ్చిన మరొక రెండు విషయాలను ఇక్కడ ప్రస్తావించాలి. వాటిలో ఒకటి అక్కడి కొత్త ప్రభుత్వపు తొలి ఆరు నెలల పాలన. ఈ కాలంలో జగన్ తన వైఫల్యాలతో చాలా చెడ్డపేరును మూటకట్టుకున్నారన్నది చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిరంతరం అంటున్న మాట. వారి నిరంతర హోరును దూరం నుంచి వినేవారు అది నిజమనుకోవచ్చు కూడా. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ప్రతిపక్షాలు అట్లా అనుకోవటం లేదన్నది క్షేత్రస్థాయికి వెళ్లి వివిధ వర్గాలు, పార్టీలతో ముఖాముఖిగా మాట్లాడినపుడు అర్థమయే విషయం.**

ప్రతిపక్షాల విషయానికి వస్తే, ప్రభుత్వ సాఫల్య వైఫల్యాలను బట్టి, టీడీపీ అదృష్టదురదృష్టాలు ఆధారపడి ఉంటాయి గనుక ఇది భవిష్యత్తులో గాని తేలని ప్రశ్న అయినప్పటికీ, చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరు ఇదేవిధంగా కొనసాగితే ఆయన పార్టీకి భవిష్యత్తు లేదన్నది అదే పార్టీ వారు కూడా అంటున్న మాట. రెండవ స్థానంలోకి రావాలనుకుంటున్న బీజేపీ తన సైద్ధాంతిక బలంతో ఆ పని చేయగల అవకాశాల్లేవని, తెలుగుదేశం బలహీనపడితే వారిని ఆకర్షించటం, దానితో పాటు అవసరమైన వనరుల వినియోగం, ఢిల్లీ నుంచి శక్తియుక్తుల ప్రయోగం అనే మూడూ జరిగితేనే వీలవుతుందని ఆ పార్టీవారే అన్నమాట. ఇక వామపక్షాలు ఏ ఆశలూ లేని వేదాంతంలోకి ప్రవేశించాయి. వారు అక్షరాలా నిష్కామకర్మ మాత్రమే ఆచరిస్తున్నారు. వివరాలకు ఇది సందర్భం కాదు.

# ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ

**విశ్లేషణ**



**రమేశ్ హజారి**

పువ్వు పుడుతూనే పరిమళాలను మోసుకొస్తుంది. చైత్రం తన ప్రవేశంతోనే ప్రకృతి రమణీయతకు శ్రీకారం చుడుతుంది. ఈ పరిణామ క్రమమంతా గతితార్కికతను అనుసరించే నడుస్తది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వెనుక ప్రజలతో పాటు నాయకత్వ త్యాగమే స్వయం పాలనను తెచ్చింది. ఉద్యమ రథసారథిగా నాడు కేసీఆర్ ప్రాణాలకు తెగించి చేసిన పోరాట సారమే తర్వాతికాలంలో ముఖ్యమంత్రిగా మరిన్ని బాధ్యతలను పెంచింది. ఈ క్రమంలో సాగుతున్న ఆరేండ్ల తెలంగాణ స్వయంపాలన.. తెలంగాణను ఒక రాష్ట్రంగా నిలబెట్టడమే కాదు, కేటీఆర్ అనే ఓ నవతరం నాయకత్వాన్ని తెలంగాణ కోసం తీర్చిదిద్దింది. రేపటి తెలంగాణకు నాయకత్వ భరోసానిస్తూ రెండో టర్మ్‌లోకి ప్రవేశించిన స్వయం పాలన.. ఏడాది కాలంలో యువ నాయకత్వానికి పాలనానుభవంతో పాటు పార్టీ నిర్మాణ బాధ్యతలను పంచింది.

టీఆర్ఎస్ సుప్రీమో.. పార్టీ అధ్యక్షులు కేసీఆర్ అప్పగించిన వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలను స్వీకరించిన కేటీఆర్ ఒక పరిణితి చెందిన తెలంగాణ అడ్మినిస్ట్రేటర్‌గానే కాంకుడా అరువై లక్షల మంది కార్యకర్తలకు పథనిర్దేశకుడిగా కూడా నిలదొక్కుకున్నడు. తెలంగాణ ఉద్యమకారులతో కలిసి ఉద్యమం చేసిన నాటి నుంచి తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నడు. తన సొంత శక్తితోనే తనను తాను నిలుపుకున్నారు. అట్లా.. 'ఫాదర్ ఆఫ్ తెలంగాణ' అడుగుజాడల్లో నడుస్తూ 'ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ'గా నిలిచిన తెలంగాణ రాష్ట్ర తొలితరం యువనేతగా కేటీఆర్ జన హృదయాల్లో నిలిచిపోయారు. తన ప్రతిభతో దేశవిదేశాలకు తెలంగాణ గొప్పతనాన్ని చాటిచెప్తున్న టెక్నోక్రాట్ కార్యనిర్వహణాదక్షుడిగా.. కేసీఆర్ కలలుగన్న బంగారు తెలంగాణ పునర్నిర్మాణానికి అటు మంత్రిగా ఇటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన కుడి, ఎడమ రెండుభుజాలను అందిస్తున్నడు. తండ్రికి తగ్గ తనయుడిగా నిలిచి వారసత్వ రాజకీయాలకు అర్థం మార్చి తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ధీరుడు ఆయన. పిలిస్తే పలికే మానవీయుడు కేటీఆర్. సిరిసిల్ల ఎమ్మెల్యే అయిన తనను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించేలా చేసింది తప్పితే కేవలం కొడుకుగా కాదనేది మనందరం ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశం.

తెలంగాణ ఉద్యమం ఎందరో సామాన్యులను, కవులను, కళాకారులను చేసినట్టే కేటీఆర్ వంటి రాజకీయ నాయకులనూ తయారుచేసింది. అట్లా ఉద్యమం అందించిన నేటితరం యువనాయత్వం కేటీఆర్. విదేశాల్లో లక్షలాది జీతాన్ని అందించే కార్పొరేట్ క్లాస్ జీవితాన్ని కాదనుకొని తెలంగాణ ప్రజా ఉద్యమంలోకి నడిచివచ్చిండు కేటీఆర్. ఓ మహావృక్షం నుంచి నిటారుగా ఎదుగుతున్న కొమ్మగా తన అస్తిత్వాన్ని చాటుతున్నడు. రాజకీయాలు మేము మాత్రమే చేయగలం, మేమే అందుల దురంధురులమని ప్రగల్భాలు పలికే పక్క రాష్ర్టాల వారికి ఆదర్శంగా నిలిచి వారి చేత ఔరా అనిపించుకుంటూ.. నాయకత్వం అంటే నోట్లో కలిపిపెట్టే వారసత్వపు పప్పు ముద్ద కాదని తేల్చేసిండు. తెలంగాణ సమాజమంటే నిత్యం ఆందోళనలతో తల్లడిల్లుతూ అంతర్గత సంఘర్షణలకు అలజడులకు గురవుతూ తమ రాజకీయ సమస్యలను తామే గుర్తించలేక పరిష్కరించుకోలేని ఆవేశపరుల సమూహమనే ముద్ర ఉండేది. ఈ ముద్రను తుడిచేస్తూ.. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పుకున్న కాలం కన్న పార్టీ టీఆర్ఎస్. ఆ పార్టీకి చేతికందివచ్చిన కొడుకు కేటీఆర్.

తెలంగాణ రాష్ట్ర సాధనానంతర దశలో చౌరస్తాలో నిలబడిన అనేక అనుమానాలను పటాపంచలు చేసే దిశగా కేసీఆర్ చూపించిన పలు దారుల్లో ఓ అద్భుతమైన దారి కేటీఆర్. హైదరాబాద్ మా దయాదాక్షిణ్యాల మీదనే బతుకుతున్నదని సెట్లర్ ఇంగ్లీషులో బట్లర్ భాషను బట్టీపట్టి మాతృభాష సక్కగా మాట్లాడరాని తెలుగుభాష గుత్తేదారుల వారసత్వాలకు అన్ని భాషల్లో విసిరిన శాందార్ హైదరాబాదీ సవాల్ కేటీఆర్. తెలంగాణ హృదయంతో దేశీయ మేధస్సుతో ప్రపంచ జ్ఞానాన్ని పోతపోసుకున్న భాషా సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ వేదికలను అబ్బురపరుస్తున్న తెలంగాణ ఆత్మకు అద్దంపట్టిన టెక్నికల్ వండర్ కేటీఆర్ అనడంలో అతిశయోక్తి లేదు. అటు రతన్ టాటా నుంచి సత్య నాదెళ్ల వరకు అటు సిరిసిల్ల చేనేత కార్మికుని నుంచి హైదరాబాద్ బస్తీవాసి వరకు పిలిస్తే పలుకుతూ అందరి హృదయాలను గెలుస్తున్న నిగర్వి. పైకి క్లాస్‌గా కనిపించే మాస్ మనసున్న జనం మనిషి కేటీఆర్.



**తన గొప్పతనాన్ని గుర్తించి ప్రపంచానికి చాటిచెప్పేవాడు దొరుకనంత వరకు వజ్రం కూడా సామాన్యమైన రాయిలాగనే ఉండాల్సి వస్తుంది. తెలంగాణతో సహా అనేక అద్భుత కోణాలున్న హైదరాబాద్ అనే వజ్రపు తునక తెలంగాణను ప్రపంచానికి కొత్త కోణంలో అనర్గళంగా ఇంగ్లీషులో పరిచయం చేసిన ఘనత కేటీఆర్‌దే. వయస్సు చిన్న, మనసు వెన్న. భావి తెలంగాణకు సమకాలీన మెయిన్ స్ట్రీం రాజకీయనేస్తం కేటీఆర్.**

తన గొప్పతనాన్ని గుర్తించి ప్రపంచానికి చాటిచెప్పేవాడు దొరుకనంత వరకు వజ్రం కూడా సామాన్యమైన రాయిలాగనే ఉండాల్సి వస్తుంది. తెలంగాణతో సహా అనేక అద్భుత కోణాలున్న హైదరాబాద్ అనే వజ్రపు తునక తెలంగాణను ప్రపంచానికి కొత్త కోణంలో అనర్గళంగా ఇంగ్లీషులో పరిచయం చేసిన ఘనత కేటీఆర్‌దే. వయస్సు చిన్న, మనసు వెన్న. భావి తెలంగాణకు సమకాలీన మెయిన్ స్ట్రీం రాజకీయనేస్తం కేటీఆర్.

కేటీఆర్ పనితీరు, నిబద్ధత, దార్శనికత, నాయకత్వ లక్షణాలతో అధినాయకుడు కేసీఆర్ అప్పగించిన వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలను ఏడాది కాలంగా సమర్థవంతంగా నిర్వర్తించి తనను తాను ఎప్పటికప్పుడు నిరూపించుకుంటున్నడు కేటీఆర్. అటు మంత్రిగా ప్రభుత్వంలో కీలక బాధ్యతలను నిర్వర్తిస్తూనే అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశానుసారం ఇటు పార్టీ శ్రేణులను నిరంతరం ఉత్తేజపరుస్తూ క్లాస్ నుంచి మాస్ వరకు జనం మనిషిగా నిలుస్తూ గుణాత్మక పురోగతిని సాధిస్తున్నడు.

సక్సెస్‌కు చెమటోడ్చటం తప్ప షార్ట్‌కట్స్ ఉండవని నిరూపిస్తూ రేపటితరానికి ఆదర్శంగా నిలుస్తున్నడు. కేసీఆర్ ఫాదర్ ఆఫ్ తెలంగాణ అయితే, ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణగా కేటీఆర్‌ను తెలంగాణ ప్రజలు భావిస్తున్నరు. తండ్రికి తగ్గ తనయుడిగా అన్నిరంగాల్లో తన సత్తాను చాటుతున్న కల్వకుంట్ల వారసుడు.. తెలంగాణలో ఎమర్జయిన లీడర్. తెలంగాణకు కాలం అందించిన యువనేత. గత ఆరేండ్ల కాలంగా దేశవిదేశాల రాజకీయ యవనికపై తెలంగాణ సత్తాను చాటడం చూస్తుంటే.. 'ఎస్ హీ కెన్.. జస్ట్ డు ఇట్' అనిపిస్తున్నది.

'పుత్రోత్సాహము తండ్రికి/ పుత్రుడు జన్మించినపుడు పుట్టదు, జనులా/ పుత్రుని కనుగొని పొగడగ/ పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!' అంటాడు సుమతీ శతకకారుడు. అటు మంత్రిగా ఇటు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షునిగా రెండు బాధ్యతలను భుజాల మీదికి ఎత్తుకొని, తెలంగాణ బాహుబలిగా కాల పరీక్షను తట్టుకొని నిలవడ్డడు. తన ప్రతిభతో, పట్టుదలతో నాయకత్వం వారసత్వం కాదని నిరూపించిండు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీకి నడిచివస్తున్న కాలానికి ఎదిగివచ్చిన కొడుకులా అనేక విజయాలను సాధించిపెడుతున్నడు.

నాడు జీహెచ్ఎంసీ ఎన్నికలను ఒంటిచేత్తో గెలిపించడంతో మొదలైన విజయ పరంపర 2019 పార్లమెంట్ ఎన్నికలను అధినేత ఆదేశాల మేరకు తన భుజాల మీదేసుకొని అత్యధిక సభ్యులను గెలిపించడం వరకు సాగింది. నిరంతరం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారిని ఎప్పటికప్పుడు సమన్వయపరుస్తూ పార్టీని మరింతగా బలోపేతం చేస్తున్నరు. ఈ ఏడాది కాలంగానే కాదు, మొత్తం తన ఉద్యమ నేపథ్యాన్ని గత ఆరేండ్ల ప్రభుత్వంలో సాధించిన విజయాలను విశ్లేషిస్తే అర్థమయ్యేది ఒక్కటే... నాయకుడిగా ఎదుగాలంటే కఠోర శ్రమ ఒక్కటేనని నిరూపించిన ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ యువనేత కేటీఆర్. రేపటి తరాలకు ఆదర్శం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# హిందువులకు ఒక్క దేశమూ లేదు!

- ముస్లింలకు బోలెడన్ని ఉన్నాయి
- పౌరసత్వ చట్టం వివాదంపై

కేంద్ర మంత్రి గడ్కరీ వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** ప్రపంచంలో హిందువుల కోసం ప్రత్యేకంగా ఒక దేశమంటూ లేదు కాబట్టి పౌరసత్వ సవరణ చట్టం తప్పనిసరి అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. ఓవైపు దేశమంతటా పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న సమయంలో కేంద్ర మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఢిల్లీలో బుధవారం జరిగిన 'న్యూస్ 18, ఇండియా చౌపాల్' కార్యక్రమంలో పాల్గొన్న గడ్కరీ పౌరసత్వ చట్టం అమలుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించారు. కొత్త చట్టం హిందువుల కోసమేనని అంటూ.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి వచ్చిన హిందూ శరణార్థులకు భారత పౌరసత్వాన్ని ఇచ్చేందుకు ఉద్దేశించినదని చెప్పారు. 'ప్రపంచంలో హిందువులకు ఓ దేశం అంటూ లేదు. ఇదివరకు నేపాల్ ఏకైక హిందూ దేశంగా ఉండేది. కానీ ఇప్పుడు ఒక్క హిందూ దేశం కూడా లేదు. ఈ పరిస్థితుల్లో హిందువులు, సిక్కులు ఎక్కడికి వెళతారు? ముస్లింలకు అనేక దేశాలున్నాయి. వారికి ఎక్కడైనా పౌరసత్వం లభిస్తుంది.



పౌరసత్వ చట్టం విషయంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి' అని గడ్కరీ పేర్కొన్నారు. దేశంలోని ముస్లింలకు తాము (బీజేపీ) వ్యతిరేకం కాదన్నారు. కొన్ని ప్రతిపక్ష పార్టీలే మైనారిటీలలో భయాందోళనలను సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

## ఎల్వోసీలో ఉద్రిక్తతలు ఏ క్షణమైనా పెరుగొచ్చు

ఆర్మీ అధిపతి బిపిన్ రావత్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి ఉద్రిక్తతలు ఏ క్షణమైనా పెరుగొచ్చని, దేశం నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నదని సైనికాధిపతి జనరల్ బిపిన్ రావత్ బుధవారం పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసినప్పటి నుంచి పాకిస్థాన్ కాల్పుల ఉల్లంఘనలను తీవ్రతరం చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి గత నెలలో లోక్‌సభకు వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది ఆగస్టు– సెప్టెంబర్ మధ్య పాక్ 950 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది.

## ఐరాసలో కశ్మీర్‌పై వెనుకకు తగ్గిన చైనా

**ఐక్యరాజ్యసమితి, డిసెంబర్ 18:** జమ్ముకశ్మీర్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతామండలిలో చర్చించాలన్న విజ్ఞప్తిని చైనా ఉపసంహరించుకున్నది. జమ్ముకశ్మీర్‌లో పరిస్థితిపై చర్చించాలని ఈ నెల 12న 15 సభ్య దేశాల ఐరాస భద్రతా మండలికి పాకిస్థాన్ విదేశాంగశాఖ మంత్రి షా మహ్మద్ ఖురేషి లేఖ రాశారు. దీనికి పాక్ మిత్ర దేశం చైనా మద్దతు పలికింది. దీంతో మంగళవారం భద్రతా మండలి సమావేశంలో రహస్య చర్చలు జరుగుతాయని అంతా భావించారు. కానీ నిర్ణయించిన ఎజెండా ప్రకారం కశ్మీర్ అంశం చర్చకు రాలేదు. యూరోపియన్ దౌత్యవేత్త ఒకరు మాట్లాడుతూ చైనా తన విజ్ఞప్తిని ఉపసంహరించుకోవడం వల్లే కశ్మీర్ అంశంపై చర్చ జరుగలేదన్నారు. భద్రతా మండలి భేటీ ముగిసిన తర్వాత ఐరాసలో చైనా రాయబారి ఝూంగ్ మాట్లాడుతూ ఉత్తర కొరియాలో పరిస్థితిపై చర్చించామన్నారు.



# ఉరే సరి!



'నిర్భయ' దోషి అక్షయ్‌కుమార్ క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

కేసు దర్యాప్తు, విచారణలో ఎలాంటి లోపాలు కనిపించలేదన్న ధర్మాసనం

నలుగురు దోషులకు ఉరిశిక్షే సరైనదని వ్యాఖ్య

డెత్ వారెంట్ జారీని వాయిదా వేసిన సెషన్స్ కోర్టు

క్షమాభిక్ష పిటిషన్‌పై దోషుల స్పందన తెలుసుకోవాలని అధికారులకు ఆదేశం

తదుపరి విచారణ జనవరి 7కు వాయిదా

క్యూరేటివ్ పిటిషన్‌ను దాఖలు చేస్తామన్న ముఖేశ్ న్యాయవాది







సుప్రీంకోర్టు తీర్పు అనంతరం విజయ సంకేతం చూపుతున్న నిర్భయ తల్లిదండ్రులు.. (ఇన్‌సెట్) దోషి అక్షయ్‌కుమార్ సింగ్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** ఏడేండ్లుగా సాగుతున్న 'నిర్భయ' కేసులో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకున్నది. దోషుల్లో ఒకడైన అక్షయ్‌కుమార్ సింగ్ పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. నిర్భయపై సామూహిక లైంగికదాడి, హత్య కేసులో అక్షయ్‌తోపాటు ముఖేశ్ (30), పవన్ గుప్తా (23), వినయ్ శర్మ(24)ను దోషులుగా నిర్ధారించిన సుప్రీంకోర్టు.. వారికి 2017 మే 5న మరణశిక్ష విధించింది. వారిలో ముగ్గురు గతంలోనే క్షమాభిక్ష పిటిషన్లు దాఖలు చేయగా, గత ఏడాది జూలై 9న తిరస్కరించింది. తాజాగా అక్షయ్‌కి కూడా చుక్కెదురైంది. దీంతో ఈ కేసులోని నలుగురు దోషులకు మరణశిక్ష అమలు దాదాపు ఖాయమైంది. ఈ నేపథ్యంలో నలుగురు దోషులను ఉరితీసేందుకు డెత్‌వారెంట్ జారీ చేయాలంటూ ఢిల్లీ ప్రభుత్వం, నిర్భయ తల్లిదండ్రులు ఢిల్లీలోని సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. అయితే దోషులకు క్షమాభిక్షకు ఉన్న అవకాశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని న్యాయమూర్తి స్పష్టంచేశారు. తదుపరి విచారణను జనవరి 7కి వాయిదా వేశారు. ఏ కేసులో అయినా దోషులకు చివరి అవకాశంగా 'క్యూరేటివ్ పిటిషన్'ను దాఖలు చేసే అవకాశం ఉన్నది. ఈ కేసులో మరో దోషి ముఖేశ్ త్వరలో క్యూరేటివ్ పిటిషన్‌ను దాఖలు చేసే అవకాశాలున్నాయి.

### 2017 తీర్పులో లోపాలేం లేవు

అక్షయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ భానుమతి నేతృత్వంలో జస్టిస్‌లు భూషణ్, ఏఎస్ బోపన్నతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తాము 2017లో ఇచ్చిన తీర్పులో ఎలాంటి లోపాలు కనిపించడం లేదని, నాటి తీర్పును సమీక్షించడానికి తగిన కారణాలు లేవని పేర్కొన్నది. అక్షయ్ లేవనెత్తిన అభ్యంతరాలను గతంలోనే సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకున్నదని తెలిపింది. అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే మరణశిక్ష విధించినట్టు స్పష్టం చేసింది.

### పుస్తకాల ఆధారంగా తీర్పు ఇవ్వలేం

విచారణ సందర్భంగా అక్షయ్ తరఫు న్యాయవాది ఏపీ సింగ్ వాదనలు వినిపిస్తూ దర్యాప్తులో అనేక లోపాలు ఉన్నాయని, విశ్వసనీయత లేదని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'విచారణ మొత్తం పూర్తయ్యాక మీరు దర్యాప్తును శంకిస్తారా?' అని అసంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం సింగ్ వాదిస్తూ ప్రజలు, మీడియా, రాజకీయ ఒత్తిళ్లు కేసు దర్యాప్తుపై ప్రభావం చూపాయని, దీంతో నలుగురిని అనవసరంగా ఈ కేసులో ఇరికించారని చెప్పారు. ఈ కేసులో ప్రత్యక్షసాక్షిగా ఉన్నట్టు చెప్తున్న వ్యక్తి ఇంటర్వ్యూలు ఇవ్వడానికి పలు మీడియా సంస్థల నుంచి రూ.లక్షలు వసూలు చేసినట్టు రహస్య శోధనలో (స్టింగ్ ఆపరేషన్‌లో) బయటపడిందని గుర్తుచేశారు. 2013 మార్చి 11న ఢిల్లీలోని తీహార్ జైలులో ఆత్మహత్యకు పాల్పడినట్టుగా చెప్తున్న రామ్‌సింగ్ మరణం అనుమానాస్పదంగా ఉన్నదని, టీఐపీలో అనేక లోపాలు ఉన్నాయంటూ ఆ జైలు మాజీ అధికారి సునీల్ గుప్తా ఇటీవల రాసిన 'బ్లాక్ వారెంట్' అనే పుస్తకంలో పేర్కొన్నారని చెప్పారు. ఢిల్లీలో వాయు కాలుష్యం వల్ల ఇప్పటికే ఆయుష్షు తగ్గుతున్నదని, ఇంకా మరణశిక్ష విధించాల్సిన అవసరం ఏమున్నదని ఏపీ సింగ్ ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై ధర్మాసనం స్పందిస్తూ.. రహస్యశోధనకు సంబంధించిన ఆధారాలు విచారణ సందర్భంగా సమర్పించలేదని, టీఐపీపై ఇప్పటికే వాదనలు ముగిశాయని స్పష్టం చేసింది. 'కోర్టు ముందుకు తీసుకొచ్చిన ఆధారాలను బట్టే విచారణ జరుపుతాం. ఎవరో రచయిత తన పుస్తకంలో రాసిన దానిని పరిగణనలోకి తీసుకోలేము. ఇలా పుస్తకాలను ఆధారాలుగా తీసుకుంటే ప్రమాదకరమైన పరిణామాలకు దారి తీస్తుంది' అని పేర్కొన్నది. ఇంతటి తీవ్రమైన కేసులో కాలుష్యం గురించి ప్రస్తావించడంపై విస్మయం వ్యక్తం చేసింది. దీంతోపాటు 'ఈ కలియుగంలో మనిషి శవంతో సమానం. కాబట్టి మరణశిక్ష విధించడం సమంజసం కాదు' అన్న ఏపీ సింగ్ వాదన ఆశ్చర్యాన్ని కలిగించిందని ధర్మాసనం తెలిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. నిర్భయ ఘటన మానవత్వానికే మాయని మచ్చ అని, ఐదుగురు దోషులను రాక్షసులని అభివర్ణించారు. ఈ కేసులో వారికి వ్యతిరేకంగా నిర్దిష్టమైన ఆధారాలు ఉన్నాయని చెప్పారు. వాటిని ట్రయల్‌కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే మరణశిక్ష విధించాయని గుర్తుచేశారు. డీఎన్‌ఏ ఆధారాలు సైతం ఈ క్రూరమైన నేరంలో అక్షయ్ పాత్ర ఉన్నదని నిర్ధారిస్తున్నాయన్నారు.

### క్షమాభిక్ష కోరడంపై దోషుల స్పందన తెలుసుకోండి

అక్షయ్‌కుమార్ క్షమాభిక్ష పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఉరిశిక్ష అమలుచేయడానికి వీలుగా డెత్ వారెంట్లు జారీచేయాలంటూ ఢిల్లీ ప్రభుత్వం, నిర్భయ తల్లిదండ్రులు ఢిల్లీలోని పటియా లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అదనపు జడ్జి సతీశ్‌కుమార్ అరోరా విచారణ జరిపారు. నలుగురు దోషులు క్షమాభిక్ష కోసం రాష్ట్రపతికి దరఖాస్తు చేస్తారో లేదో తెలుసుకోవాలని, వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని తీహార్ జైలు అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు తీర్పు కాపీ పరిశీలించాల్సి ఉన్నదన్నారు. తదుపరి విచారణను జనవరి 7వ తేదీకి వాయిదా వేశారు. ఈ మేరకు తీహార్ జైలు అధికారులు నలుగురు దోషులకు నోటీసులు జారీచేశారు. క్షమాభిక్ష పిటిషన్‌పై ఏడురోజుల్లోగా స్పందన తెలుపాలని ఆదేశించారు. మరోవైపు ఈ కేసులో మరో దోషి ముఖేశ్ కుమార్ తరఫు న్యాయవాది ఎంఎల్ శర్మ మాట్లాడుతూ తాము సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్‌ను దాఖలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

## అప్పుడు నేను మైనర్‌ను!

హైకోర్టులో 'నిర్భయ' దోషి పవన్‌గుప్తా పిటిషన్

**న్యూఢిల్లీ:** నిర్భయపై సామూహిక లైంగికదాడి జరిగినప్పుడు తాను మైనర్‌నని, తనకు వయసు నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కోరుతూ దోషుల్లో ఒకడైన పవన్ కుమార్ గుప్తా ఢిల్లీ హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశాడు. దర్యాప్తు అధికారులు తన వయసును నిర్ధారించేందుకు ఆసిఫికేషన్ టెస్ట్‌ను (ఎముకల దృఢత్వాన్ని నిర్ధారించే పరీక్ష) చేయలేదన్నాడు. దీంతో మైనర్లకు వర్తించే జువెనైల్ చట్టాలతో తాను లబ్ధి పొందలేకపోయానని చెప్పాడు. ఈ పిటిషన్‌పై గురువారం జస్టిస్ సురేశ్ కుమార్ కైత్ విచారణ జరుపనున్నారు. నిర్భయ కేసులోని ఆరుగురు దోషుల్లో ఒకడు మైనర్ కావడంతో మూడేండ్ల శిక్ష అనంతరం విడుదలైన సంగతి తెలిసిందే.



పవన్‌గుప్తా

# మాకు లేవా హక్కులు?

దోషుల హక్కులనే పరిగణనలోకి తీసుకుంటారా?

దోషులకు మరణశిక్ష అమలులో జాప్యంపై కోర్టు గదిలో విలపించిన నిర్భయ తల్లి



ఆశాదేవి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** నిర్భయ తల్లి బుధవారం ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టులో భోరున విలపించారు. నిర్భయ కేసులో మరణశిక్షకు గురైన నలుగురు దోషులకు శిక్ష అమలు చేయడంపై నిర్ణయాన్ని ఢిల్లీ కోర్టు మళ్లీ వాయిదా వేయడంపై ఆమె ఒక్కసారిగా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'దోషులకు మరో అవకాశమిచ్చారు. వారి హక్కులను మాత్రమే ఎందుకు పరిగణనలోకి తీసుకుంటున్నారు? మా హక్కుల సంగతేమిటి?' అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు, నలుగురు దోషుల్లో ఒకడైన అక్షయ్‌కుమార్.. తనకు విధించిన మరణశిక్షను సమీక్షించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చడాన్ని నిర్భయ తల్లి స్వాగతించారు. సుప్రీంకోర్టు నిర్ణయం అనంతరం పటియాలా హౌస్‌కోర్టులో విచారణ ప్రారంభమైంది. నలుగురు దోషులకు మరణశిక్షను అమలు చేసేందుకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఢిల్లీ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై అదనపు సెషన్స్ జడ్జి సతీష్‌కుమార్ అరోరా విచారణ ప్రారంభించారు. సుప్రీంకోర్టు తీర్పు పత్రాల కోసం వేచి చూస్తామని అంటూ జడ్జి కేసు విచారణను జనవరి 7వ తేదీకి వాయిదా వేశారు. ఈ నిర్ణయం విన్న వెంటనే నిర్భయ తల్లి కన్నీటి పర్యంతమయ్యారు. 'మేము ఏడేండ్లుగా పోరాడుతూనే ఉన్నాము. కానీ కోర్టు మా హక్కులను పరిగణనలోకి తీసుకోలేదు. తదుపరి విచారణ జరిగే తేదీన కూడా తుది తీర్పు వెలువడుతుందన్న నమ్మకం లేదు' అని ఆమె విలేకరుల ముందు వాపోయారు. అంతకుముందు ఆమె కోర్టులో విలపిస్తున్న సమయంలో జడ్జి ఆమెను ఓదారుస్తూ, 'మీ పట్ల నాకు సానుభూతి ఉన్నది. మీ కుమార్తె మరణించిందని తెలుసు. కానీ వారికీ(దోషులకు) హక్కులు ఉంటాయి. మీ ఆవేదనను వినేందుకే మేమిక్కడ ఉన్నాం. అదే సమయంలో చట్టానికి బద్ధులమై కూడా ఉన్నాం' అని వ్యాఖ్యానించారు. దోషులు నలుగురు రాష్ట్రపతికి క్షమాభిక్ష కోసం విన్నవించుకుంటారేమో తెలుసుకోవాలని కోర్టు తీహార్ జైలు అధికారులను ఆదేశించింది.

## లైంగిక దాడి కేసులో 17 రోజుల్లోనే తీర్పు

దోషికి జీవిత ఖైదు.. రాజస్థాన్‌లో ఘటన

**జైపూర్:** చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఓ దుండగుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ రాజస్థాన్‌లోని కోర్టు కేవలం 17 రోజుల్లోనే తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని చురు జిల్లా పరిధిలో గత నెల 30న నాలుగేండ్ల బాలికపై దయారామ్ మేఘ్వాల్ (21) అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై విచారణ జరిపిన ప్రత్యేక పోక్సో కోర్టు దోషిగా నిర్ధారించడంతోపాటు అతడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది. గత నెల 30న అఘాయిత్యం జరిగిన మరుసటి రోజే దయారామ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి ఐపీసీ, పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ నెల 7న కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పోక్సో చట్టం కింద దోషి దయారామ్‌కు న్యాయమూర్తి మంగళవారం జీవిత ఖైదు విధించినట్లు జిల్లా ఎస్పీ తేజస్వి గౌతం బుధవారం తెలిపారు. పోలీసులు చురుగ్గా స్పందించి ఏడు రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేశారని ఎస్పీ చెప్పారు. దీనిపై న్యాయస్థానం రోజువారీ విచారణ జరిపింది.

## లైంగికదాడుల కేసుల వివరాలివ్వండి

రాష్ట్రాలు, హైకోర్టులకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ:** దేశంలో లైంగికదాడుల ఘటనలు పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. లైంగికదాడి నేరాలకు సంబంధించి న్యాయవ్యవస్థ పనితీరును అంచనా వేసేందుకు దీనిపై సుమోటోగా విచారణను ప్రారంభించింది. లైంగిక దాడి కేసుల్లో దర్యాప్తు, ఆధారాల సేకరణ, బాధితుల వాంగ్మూలం నమోదు, విచారణ సమయం తదితర వివరాలతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 7లోగా నివేదిక అందజేయాలని అన్ని రాష్ట్రాలను, హైకోర్టులను ఆదేశించింది.



పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం భోపాల్‌లో జరిగిన నిరసన ప్రదర్శన

# కొనసాగుతున్న 'పౌర' సెగలు

ఈశాన్య ఢిల్లీలో 144 సెక్షన్

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో భారీ ప్రదర్శనలు

దేశవ్యాప్త నిరసనకు వామపక్షాల నిర్ణయం



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా 'పౌరసత్వ' సెగలు కొనసాగుతున్నాయి. మంగళవారం పెద్ద ఎత్తున హింసాకాండ చెలరేగిన ఈశాన్య ఢిల్లీలో ముందస్తు జాగ్రత్త చర్యగా 144 సెక్షన్ విధించారు. జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరుకుంది. పశ్చిమబెంగాల్, అసోంలలో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో పలు చోట్ల భారీ ప్రదర్శనలు జరిగాయి. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఎన్నార్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని వామపక్షాలు నిర్ణయించాయి.

### ఈశాన్య ఢిల్లీలో నిషేధాజ్ఞలు


మంగళవారం అల్లర్లతో అట్టుడికిన ఢిల్లీలోని సీలంపూర్‌లో పోలీసులు, పారా మిలిటరీ సిబ్బంది బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. భద్రతను కట్టుదిట్టం చేశారు. హర్షవిహార్, సోనియా విహార్ పోలీస్ స్టేషన్లు మినహా ఈశాన్య ఢిల్లీ వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. సీలంపూర్ హింసాకాండకు సంబంధించి 8 మందిని అరెస్ట్ చేశారు. మరో 18 మందిని ముందస్తు కస్టడీలోకి తీసుకున్నారు.

### మూడో రోజుకు జామియా విద్యార్థుల నిరసన

సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా జామియా వర్సిటీ విద్యార్థులు చేపట్టిన ఆందోళన బుధవారం మూడో రోజుకు చేరుకున్నది. దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడ విద్యార్థులు ఆందోళన చేపడుతున్నారో తెలియజేస్తూ వర్సిటీ 7వ నంబర్ గేట్ వద్ద దేశ చిత్రపటాన్ని ఏర్పాటుచేశారు. అలాగే శాంతియుతంగా నిరసన చేపట్టాలని విజ్ఞప్తిచేస్తూ మరో పోస్టర్‌ను అతికించారు. జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్, సామాజిక ఉద్యమకారిణి మేధాపాట్కర్ విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కన్హయ్య మాట్లాడుతూ.. ఈ నిరసన కేవలం ముస్లింల రక్షణ కోసం మాత్రమే కాదని, మొత్తం దేశ రక్షణ కోసమన్నారు. సీఏఏ కంటే ఎన్నార్సీ అత్యంత ప్రమాదకరమైనదని వ్యాఖ్యానించారు.

### గువాహటిలో సాధారణ పరిస్థితులు

అసోంలోని గువాహటిలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. శాంతి భద్రతలు మెరుగుపడడంతో కర్ఫ్యూను ఎత్తివేసినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు దిబ్రూగఢ్‌లో మాత్రం కర్ఫ్యూను పాక్షికంగా సడలించారు. ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు) గువాహటిలోని లతాసిల్ మైదానంలో మూడురోజులుగా చేపట్టిన 'సామూహిక సత్యాగ్రహం' బుధవారం ముగిసింది. పశ్చిమబెంగాల్‌లో బుధవారం ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదు.



పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం మహారాష్ట్రలోని థానేలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టిన దృశ్యం

- సీఏఏ, ఎన్నార్సీపై దేశవ్యాప్తంగా నిరసన చేపట్టనున్నట్లు వామపక్షాలు ప్రకటించాయి. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, సీపీఐ, ఏఐఎఫ్‌బీ, ఆర్‌ఎస్పీ తరఫున సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రకటన విడుదల చేశారు.
- మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ముస్లిం తల్లులు, అక్కచెల్లెల్ల గురించి కాకుండా, దేశ 'ప్రథమ సేవకుడు' ముందుగా 'ప్రథమ సేవిక' గురించి ఆలోచించాలని పరోక్షంగా విమర్శించారు.
- సీఏఏకి వ్యతిరేకంగా మద్రాస్ యూనివర్సిటీలో నిరసన చేపడుతున్న విద్యార్థులను ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం అధినేత కమల్‌హాసన్ పరామర్శించారు. వారికి సంఘీభావం ప్రకటించారు.
- మహారాష్ట్రలో ముస్లింల ప్రాబల్యం అధికంగా ఉండే థానేలోని ముంబ్రాతోపాటు పలు ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. పుణెలో అస్సామీలు నిరసన చేపట్టారు.
- నిరసనల నేపథ్యంలో కర్ణాటకలోని బెంగళూరు, మంగళూరులో నిషేధాజ్ఞలు విధించారు.

# సీఏఏపై స్టే ఇవ్వం

చట్టం చెల్లుబాటుపై విచారణ జరుపుతాం: సుప్రీంకోర్టు

పిటిషన్లపై వివరణ ఇవ్వాలని కేంద్రానికి నోటీసు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** సీఏఏ చెల్లుబాటును పరిశీలించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. అయితే ఆ చట్టంపై స్టే విధించేందుకు నిరాకరించింది. మతపరమైన హింస కారణంగా పొరుగున ఉన్న పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు శరణు వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించినదే పౌరసత్వ సవరణ చట్టం. దీన్ని సవాల్ చేస్తూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నేత జైరాం రమేశ్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, ఆసు సహా పలువురు వ్యక్తులు, పార్టీలు, సంస్థలు సుప్రీంకోర్టులో 59 పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బోబ్డే, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషన్లపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పిటిషన్లపై వచ్చే 22వ తేదీన విచారణ జరుపుతామని తెలిపింది. సీఏఏ లక్ష్యం, ఉద్దేశం, అందులోని అంశాలపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాలని న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ కోరగా, ధర్మాసనం అంగీకరించింది. ఇందుకు ఆడియో, విజువల్ మాధ్యమాలను వినియోగించుకోవాలని కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌కు సూచించింది. విచారణ సందర్భంగా పిటిషన్ల తరఫు న్యాయవాదులు.. సీఏఏపై స్టే విధించాలని కోర్టును కోరారు. అయితే ఏజీ దీనిపై అభ్యంతరం తెలిపారు. నోటిఫై అనంతరం చట్టంపై స్టే విధించేందుకు కుదరదని పలు తీర్పులను ప్రస్తావించారు. దీంతో స్టే విధించేందుకు ధర్మాసనం నిరాకరించింది. తదుపరి విచారణ జరుగబోయే వచ్చే నెల 22వ తేదీన స్టే విధింపుపై వాదనలు వింటామని తెలిపింది.

## సీఏఏతో ప్రమాదం లేదు

ఎన్నార్సీని వ్యతిరేకిస్తాం: నవీన్ పట్నాయక్

**భువనేశ్వర్:** జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)కు తాము ఎట్టి పరిస్థితుల్లో మద్దతు ఇచ్చేది లేదని బీజేడీ అధ్యక్షుడు, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ చెప్పారు. ఎన్నార్సీ, పౌరసత్వ సవరణ చట్టంపై (సీఏఏ) నవీన్ పట్నాయక్ వైఖరి తెలియజేయాలని మంగళవారం పలువురు నిరసనకారులు భువనేశ్వర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'సీఏఏ వల్ల భారతీయులకు ఎలాంటి ప్రమాదం లేదు. అసలు ఆ చట్టాన్ని తీసుకొచ్చింది విదేశీయుల కోసం. కాబట్టి భారత్‌లో ఉన్న ముస్లింలు భయపడాల్సిన పనిలేదు. సీఏఏ భారతీయులపై ఎలాంటి ప్రభావం చూపదన్న విషయాన్ని గుర్తించిన తర్వాతే మద్దతిచ్చాం. కానీ ఎన్నార్సీకి మద్దతు ఇవ్వబోమని పార్లమెంట్‌లోనే చెప్పాం' అని తెలిపారు.

# నిప్పు పెట్టడం కాదు.. చల్లార్చండి

- భయ్యా! నన్ను తక్కువ అంచనా వేయకు
- అమిత్ షాపై మమతాబెనర్జీ ధ్వజం




**కోల్‌కతా:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. 'కేంద్ర హోం మంత్రి అమిత్ షా గారూ మీ పని దేశానికి నిప్పుపెట్టడం కాదు.. నిప్పును చల్లార్చడం' అని ధ్వజమెత్తారు. 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' అనేది తమ విధానమని చెప్పిన కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సర్వనాశ్' కు పాల్పడిందని విమర్శించారు. బుధవారం కోల్‌కతాలో నిర్వహించిన ర్యాలీకి మమత నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'బాబ్రీ మసీదు కూల్చివేతకు గురైనప్పుడు దేశంలో కొంత అశాంతి నెలకొన్నది. తర్వాత పరిస్థితులు సద్దుమణిగి ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారు. కానీ వాళ్లు (బీజేపీ నేతలు) మళ్లీ అధికారంలోకి వచ్చాక దేశంలో అశాంతి నెలకొన్నది. ఓ వైపు సీఏఏ వల్ల ఎవరూ పౌరసత్వాన్ని కోల్పోరని అమిత్ షా చెబుతున్నారు. మరోవైపు సీఏఏ, ఎన్నార్సీలకు ఆధార్, పాన్‌కార్డులు పనిచేయవని అంటున్నారు. మరి ఏవీ పనిచేస్తాయి?.. బీజేపీ వాళ్లు ఇచ్చే తాయత్తా? సోదరుడా (అమిత్ షా) నన్ను తక్కువ అంచనా వేయకు. మళ్లీ చెబుతున్నా.. ఎన్నార్సీని, సీఏఏను పశ్చిమబెంగాల్‌లో అమలు చేయను. ఈ రెండింటిని కేంద్రం వెనక్కి తీసుకోవాలి. బలవంతంగా అమలు చేయాలని చూస్తే.. ఎట్లా అమలు చేస్తారో నేను కూడా చూస్తా' అని సవాల్ విసిరారు.

## నిరసనల అణచివేతపై ఐరాస ఆందోళన

**ఐరాస:** పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా భారత్‌లో చేపడుతున్న నిరసనల సందర్భంగా చోటుచేసుకుంటున్న హింస, పోలీస్ బల ప్రయోగంపై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తంచేశారు. గుటెరస్ అధికార ప్రతినిధి స్టెఫానీ డుజారిక్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ భావ ప్రకటన హక్కులను గౌరవించాలని భారత ప్రభుత్వానికి సూచించారు. ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ కూడా సీఏఏపై ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ చట్టం వివక్షాపూరితమైనదని పేర్కొన్నారని చెప్పారు.

## భారత ముస్లింలపై ప్రభావం ఉండదు

సీఏఏపై జామా మసీద్ షాహి ఇమామ్ బుఖారీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ప్రభావం ముస్లింలపై పడదని, దేశంలో ఉన్న ఏ ఒక్క ముస్లిం వ్యక్తి కూడా దీని వల్ల పౌరసత్వాన్ని కోల్పోయే ప్రమాదం లేదని ఢిల్లీలోని జామా మసీద్ షాహి ఇమామ్ సయ్యద్ అహ్మద్ బుఖారీ చెప్పారు. 'జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ), సీఏఏ మధ్య చాలా తేడాలున్నాయి. సీఏఏ వల్ల భారత్‌లో నివసిస్తున్న ఏ ఒక్కరూ కూడా పౌరసత్వాన్ని కోల్పోరు. అది హిందువైనా, ముస్లింఅయినా. కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి వచ్చిన ముస్లిం శరణార్థులకు మాత్రమే భారత పౌరసత్వం ఇవ్వమని చట్టం చెబుతున్నది. కాబట్టి భారత్‌లో నివసిస్తున్న ముస్లింలు భయపడాల్సిన అవసరం లేదు' అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నదని, అయితే ఈ నిరసన హింసాత్మకంగా మారకుండా ఉండాలని సూచించారు.

## స్పీకర్ల సదస్సుకు డిప్యూటీ స్పీకర్

- పద్మారావుతోపాటు అసెంబ్లీ కార్యదర్శి హాజరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అఖిల భారత చట్టసభల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభాపతులు, ఉప సభాపతుల సమావేశానికి రాష్ట్రం నుంచి డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావు, శాసన సభ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు హాజరయ్యారు. మూడ్రోజులపాటు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో జరిగే సదస్సులో పాల్గొన్నారు. బుధవారం ప్రారంభ సమావేశానికి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్లమెంట్ సెక్రటరీ జనరల్స్, అన్ని రాష్ట్రాల చట్టసభల ప్రిసైడింగ్ ఆఫీసర్స్, కార్యదర్శులు పాల్గొన్నారు. తొలిరోజు ప్రిసైడింగ్ ఆఫీసర్ల సమావేశంలో రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు- స్పీకర్ల పాత్ర, చట్టసభల ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గురువారం జరిగే సమావేశంలో అన్ని రాష్ట్రాల చట్టసభల్లో ఒకే విధమైన పార్లమెంటరీ నిబంధనలు రూపొందించడం, చట్టసభలు తరచూ ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లపై కూలంకషంగా చర్చించనున్నారు.



టీఎస్ పీఎస్సీ ఐదో వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న చైర్మన్ ఘంటా చక్రపాణి. చిత్రంలో సభ్యులు విఠల్, చంద్రావతి, ఖాద్రి, రామ్మోహన్‌రెడ్డి, సాయిలు, కార్యదర్శి వాణీప్రసాద్ కూడా ఉన్నారు.

## సమిష్టికృషితో 30 వేల ఉద్యోగాల భర్తీ

ప్రతి పరీక్షను పకడ్బందీగా నిర్వహించాం

టీఎస్‌పీఎస్సీ ఐదో వార్షికోత్సవంలో చైర్మన్ ఘంటా చక్రపాణి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ తోడ్పాటు, ఉద్యోగులు, సిబ్బంది.. సమిష్టి కృషితో ఐదేండ్లలో 30 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశామని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్ ఘంటా చక్రపాణి చెప్పారు. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా, ప్రతి పరీక్షను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. బుధవారంనాటికి టీఎస్‌పీఎస్సీ ఏర్పడి ఐదు వసంతాలు పూర్తయిన సందర్భంగా నాంపల్లిలోని ప్రధాన కార్యాలయం ప్రతిభాభవన్‌లో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తూ దేశంలోనే ఇతర కమిషన్లకు ఆదర్శంగా టీఎస్‌పీఎస్సీని నిలిపామని అన్నారు. చైర్మన్‌తోపాటు సెక్రటరీ వాణీప్రసాద్, సభ్యులు విఠల్, డాక్టర్ చంద్రావతి, డాక్టర్ ఖాద్రి, డాక్టర్ రామోహ్మన్‌రెడ్డి, ప్రొఫెసర్ సీహెచ్ సాయిలు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



### దేవాదాయశాఖ కార్యదర్శి, కమిషనర్‌గా అనిల్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విశ్రాంత ఐఏఎస్ అధికారి వీ అనిల్‌కుమార్‌ను దేవాదాయ, ధర్మాదాయశాఖ కార్యదర్శి, కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రెండేండ్లు అనిల్‌కుమార్ ఈ పదవిలో కొనసాగుతారు. ఇప్పటివరకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన నీతూకుమారి ప్రసాద్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది.

### ఫ్యాక్టరీస్ డైరెక్టర్‌గా రాజగోపాలరావుకు పదోన్నతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర ఫ్యాక్టరీస్ డైరెక్టర్‌గా బీ రాజగోపాలరావుకు పదోన్నతి లభించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన బుధవారం పూర్తిస్థాయి డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు.

### నివేదిక ఇవ్వండి

- నారాయణ, శ్రీచైతన్య ఉల్లంఘనలపై హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థల్లో లోపాలపై విచారణచేపట్టి నివేదిక అందజేయాలని ఇంటర్ బోర్డుకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని దాఖలైన పిల్‌పై బుధవారం విచారణచేపట్టి ఈ ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది.

### సీడీపీవోల సమస్యలు పరిష్కరిస్తా: మమత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీడీపీవోల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని టీజీవో అధ్యక్షురాలు వీ మమత హామీ ఇచ్చారు. టీజీవో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సహదేవ్, జ్యోతి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పథకాల ప్రభావంపై సర్వే

- రాష్ట్ర ప్రణాళికశాఖ నిర్ణయం
- సీఈజీఐఎస్‌తో అవగాహన
- క్షేత్రస్థాయి సర్వేకు నోటిఫికేషన్
- దరఖాస్తులకు ఈ నెల 31 గడువు
- మూడురోజులపాటు అధికారులతో సమావేశమైన సీఈజీఐఎస్ బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం విభిన్నరీతుల్లో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నది. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి తదితరరంగాల్లో విప్లవాత్మక తీరులో చేపడుతున్న పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయి? పథకాల అమలుతో అభివృద్ధి సూచిక ఏరకంగా ప్రభావితమవుతున్నదనే విషయాలపై అధ్యయనం చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీతిఆయోగ్ గౌరవ సలహాదారు కార్తీ మురళీధరన్ నేతృత్వంలోని సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ (సీఈజీఐఎస్)తో రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికశాఖ అక్టోబర్ 16న ఒప్పందం కుదుర్చుకున్నది. ఇప్పటికే సీఈజీఐఎస్ అధ్యయనం మొదలుపెట్టింది. కార్తీ మురళీధరన్ నేతృత్వంలోని 12 మంది ప్రతినిధుల బృందం రాష్ట్రంలో మూడురోజుల తొలి పర్యటనను బుధవారం పూర్తిచేసింది. విద్య, వైద్యం,గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉపాధి తదితర రంగాల్లో పథకాలు ఎలా ఉన్నాయి?ఎలా అమలవుతున్నాయి? క్షేత్రస్థాయిలో వాటి ఆచరణ, ప్రజలకు అందుతున్న సంక్షేమఫలాలకు సంబంధించి ఈ ప్రతినిధి బృందం వివిధశాఖల ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఉద్యోగుల వేతనాలు, వారి పనివిధానం, వేతనాల పెంపుదలపై పీఆర్సీతో కూడా భేటీ అయింది. ఆర్థికమంత్రి హరీశ్‌రావు, ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ బీ వినోద్ కుమార్,ఆర్థికశాఖ అధికారులతో బృందం సభ్యులు సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో పథకాల ప్రభావంపై అధ్యయనంకోసం సంయుక్తగా ఫీల్డ్‌సర్వే నిర్వహించేందుకు ప్రణాళికశాఖకు చెందిన ప్లానింగ్ సొసైటీ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

#### ఇంకా నాణ్యమైన విద్య అందాలంటే

క్షేత్రస్థాయిలో అమలవుతున్న పథకాల వివరాలు తెలుసుకోవడం, వాటిని క్రోడీకరించి ఎక్కడెక్కడ ఏయే మార్పులు చేస్తే ఇంకా మెరుగైన ఫలితాలు వస్తాయో సూచనలు చేయడం కోసం కార్తి మురళీధరన్ నేతృత్వంలోని బృందం సమావేశాలు నిర్వహించిందని అధికారులు చెప్పారు. ప్రభుత్వం అన్నివర్గాల పేద పిల్లలకు ఉచితంగా నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించడానికి గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేసింది. వీటితో నాణ్యమైన విద్య ఎంతవరకు అందుతున్నది? ఇంకా ఏరకంగా మెరుగుపర్చవచ్చు? అనే అంశాలపై ఈ సంస్థ సలహాలు, సూచనలు ఇవ్వనున్నది.



#### బాలికలకు మెరుగైన విద్య ఎలా?

కేసీఆర్ కిట్ పథకం అమలుద్వారా ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెరిగాయి. దాదాపు 60% ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లోనే జరుగుతున్నాయి. అయితే సిజేరియన్ ఆపరేషన్స్‌ను కూడా పూర్తిస్థాయిలో నిరోధించాల్సి ఉన్నది. మిగిలిన 40 శాతంలో కూడ మరిన్ని ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లో చేయించటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశంపై సీఈజీఐఎస్ సూచనలు ఇవ్వనున్నది. కల్యాణలక్ష్మి/ షాదీ ముబారక్ పథకం ప్రారంభించిన తర్వాత రాష్ట్రంలో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయి. నేపథ్యంలో బాలికలకు మెరుగైన విద్య అందించడం ఎలా? అనే అంశంపైనా సీఈజీఐఎస్ అధ్యయనం చేయనున్నది.

#### దరఖాస్తులకు ఆహ్వానం

సీఈజీఐఎస్‌తో అవగాహన మేరకు ప్రణాళిక శాఖకు చెందిన స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ.. 33 జిల్లాల్లో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించడానికి ఏజెన్సీలను ఆహ్వానించింది. ఆసక్తిగల సంస్థలు 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఖైరతాబాద్‌లోని గణాంకభవన్‌లోని రాష్ట్రాభివృద్ధి ప్రణాళిక సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కార్యాలయం లో దరఖాస్తు సమర్పించాలని కోరింది. మరిన్ని వివరాలకు tsdps/telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

## పద్మశ్రీ వాపస్ ఇస్తా

- తీవ్ర ముప్పు ఎదుర్కొంటున్న ప్రజాస్వామ్యం
- ప్రముఖ ఉర్దూ రచయిత ముజ్తాబా హుస్సేన్



**హైదరాబాద్, డిసెంబర్ 18:** గతంలో కేంద్ర ప్రభుత్వం తనకు ఇచ్చిన పద్మశ్రీ అవార్డును వాపస్ చేయాలని నిర్ణయించుకున్నట్టు హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ ఉర్దూ రచయిత ముజ్తాబా హుస్సేన్ (87) ప్రకటించారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతున్న నేపథ్యంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఉర్దూసాహిత్యంలో చేసిన సేవకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2007లో హుస్సేన్‌కు పద్మశ్రీ అవార్డును అందించింది. దేశంలో ప్రస్తుత పరిస్థితులపట్ల తాను సంతృప్తితో లేనని, ఈ అవార్డును దగ్గర ఉంచుకోలేనని అన్నారు. దేశంలో నేరపూరిత కార్యక్రమాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ప్రజాస్వామ్యం తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నదని పేర్కొన్నారు. గాంధీజీ, నెహ్రూ, సర్దార్ పటేల్, మౌలానా అబుల్‌కలాం ఆజాద్, అంబేద్కర్ వంటివారు నిర్మించిన ప్రజాస్వామ్య వ్యవస్థ విచ్ఛిన్నమైపోతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజల గొంతుకలు నొక్కివేస్తున్నారని, మరెంతో మంది హత్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు. పేదలు కనీసం చిరునవ్వుతో బతికే పరిస్థితులు లేవని ఒక వార్తాసంస్థతో చెప్పారు. గతంలో రాజకీయ నాయకులు రాజనీతిజ్ఞులుగా ఉండేవారని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని అన్నారు.

## గోశాల జీవాలకు సంచార వైద్యసేవలు

- అనుమతిలేని పశువధశాలల నిర్వాహకులపై కఠినచర్యలు
- రాష్ట్ర పశు సంక్షేమ బోర్డు సమావేశంలో మంత్రి తలసాని



పశు సంక్షేమ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జీహెచ్‌ఎంసీ పరిధిలోని గోశాలల జీవాలకు జనవరి నుంచి అవసరమైన వైద్యసేవలను సంచార వైద్యశాల ద్వారా అందిస్తామని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన పశు సంక్షేమబోర్డు సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. జీవాలను హింసిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, రవాణా సమయంలోనూ జాగ్రత్తలు తీసుకోవడంలేదని, పశుసంరక్షణ చట్టాలు పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు సంక్షేమబోర్డుకు కార్యాలయం లేదని, త్వరలోనే డైరెక్టర్ కార్యాలయ భవనంలోనే ప్రారంభిస్తామని, ప్రతి 4 నెలలకోసారి బోర్డు సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. నిస్వార్థంతో జీవాలకు సేవచేసేవారిని బోర్డు సభ్యులుగా తీసుకుంటామని చెప్పారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కుక్కపిల్లల విక్రయకేంద్రాలకు ధ్రువపత్రాలు ఇస్తామని తెలిపారు. పీసీబీ, పోలీస్ తదితర శాఖలు సమన్వయంతో అనుమతిలేని పశువధశాలలను తక్షణం మూయించి, నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు స్వాధీనంలోకి తీసుకున్న జీవాల సంరక్షణకు బంజరుదొడ్ల నిర్వహణలో శ్రద్ధచూపాలని తెలిపారు. ఏప్రిల్‌లో నిర్వహించే సమావేశానికి జంతుప్రేమికులను ఆహ్వానించి సూచనలను తీసుకోవాలని, న్యాయాధికారులను కూడా నియమించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సంచాలకుడు లక్ష్మారెడ్డి, అదనపు సంచాలకుడు రాంచందర్, ఐజీ బాలనాగదేవి, వైల్డ్ లైఫ్ ఓఎస్డీ శంకరన్, జీహెచ్‌ఎంసీ చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### సర్కారు దృష్టికి మినీ అంగన్‌వాడీల సమస్యలు

- టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మినీ అంగన్‌వాడీల్లో పనిచేస్తున్నవారికి ఉద్యోగ భద్రత, అంగన్‌వాడీ టీచర్లతో సమానంగా వేతనాల వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ తెలిపారు. బుధవారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్కేవీ అనుబంధ మినీ అంగన్‌వాడీ టీచర్ల సంఘం కార్యవర్గ సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ.. అంగన్‌వాడి కేంద్రాల కుదింపుపై ఆందోళన అవసరం లేదని తెలిపారు. సమావేశంలో అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి, టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, ప్రతినిధులు సుజాత, షానాజ్, ఝాన్సీ, సంధ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### పర్యాటకశాఖ ఉద్యోగులను ఆదుకోండి

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు టీఎన్జీవోల వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పర్యాటకశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని టీఎన్జీవో కేంద్ర సంఘం, పర్యాటకశాఖ ఉద్యోగుల సంఘం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. దీనిపై సీఎం కేసీఆర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఉద్యోగ సంఘ నేతలు చెప్పారు. మంత్రిని కలిసినవారిలో టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు కారం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్, సహఅధ్యక్షురాలు బండారు రేచల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, జ్యోతి, రచన, కరుణ, ప్రకాశ్, వినోద్, తదితరులు ఉన్నారు.

### కొడుకును సరిగ్గా పెంచలేకపోతున్నా..!

- 11వ అంతస్తు నుంచి దూకి తల్లి ఆత్మహత్య
- చందానగర్ అపర్ణలేక్ బ్రీజ్‌లో ఘటన



ప్రియాంక(ఫైల్)

**చందానగర్, నమస్తే తెలంగాణ:** కుమారుడిని సరిగా పెంచలేకపోతున్నాననే మనస్తాపంతో ఓ తల్లి 11వ అంతస్థు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్ చందానగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. మియాపూర్ ఏసీపీ కృష్ణప్రసాద్ వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ అలహాబాద్‌కు చెందిన అనుభవ్ చిత్రె, ప్రియాంక (30) దంపతులకు పది నెలల కుమారుడు ఉన్నాడు. అనుభవ్ గచ్చిబౌలిలోని డీఎల్‌ఎఫ్‌లో పనిచేస్తుండగా.. ప్రియాంక ఇంట్లో ఉంటూ కుమారుడిని చూసుకుంటున్నది. కుమారుడికి సరిపడా పాలురావడం లేదని, అతడిని సరిగా పెంచలేకపోతున్నానని మానసికంగా కుంగిపోతూ వచ్చింది. ఈ క్రమంలోనే బుధవారం భర్త ఉద్యోగానికి వెళ్లిన తర్వాత ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఇంట్లోని కిటికీలో నుంచి కిందికి దూకింది. తీవ్ర గాయాలపాలైన ప్రియాంక అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు కేసు నమోదుచేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. ప్రియాం క తల్లిదండ్రులు అలాహాబాద్ నుంచి వస్తున్నారని, వారు వచ్చిన తర్వాత మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉన్నదని పోలీసులు తెలిపారు.

## 15 రోజుల్లో కానిస్టేబుళ్ల శిక్షణ షెడ్యూల్

- తుది దశకు చేరుకున్న ఎంపిక ప్రక్రియ
- 90 శాతం మంది అభ్యర్థుల ఐబీ ధ్రువీకరణ పూర్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో భారీగా భర్తీ అయిన కానిస్టేబుల్ అభ్యర్థుల శిక్షణ షెడ్యూల్ మరో 15 రోజుల్లో రానున్నది. సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ సహా ఇతర విభాగాల్లో కలిపి మొత్తం 16,925 మంది కానిస్టేబుళ్ల భర్తీ ప్రక్రియ తుది అంకానికి చేరుకొన్నది. రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇప్పటికే ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. ఎంపికైన అభ్యర్థుల వ్యక్తిగత వివరాలపై ఐబీ ధ్రువీకరణ ప్రక్రియ 90 శాతం వరకు పూర్తయినట్టు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి వర్గాలు తెలిపాయి. మిగిలిన పది శాతం మంది అభ్యర్థుల ఐబీ వెరిఫికేషన్ వారంరోజుల్లో పూర్తవుతుందని అధికారులు చెప్తున్నారు. వాస్తవ షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ మూడోతేదీ వరకే ఈ ప్రక్రియ ముగియాల్సి ఉండగా.. ఆర్టీసీ సమ్మె కారణంగా పోలీసులకు బందోబస్తు విధులు నిర్వహించాల్సి రావడంతో ఐబీ ధ్రువీకరణ నిలిపివేశారు. ప్రస్తుతం పరిస్థితులు చక్కబడటంతో ఐబీ విచారణ పనులను వేగవంతం చేశారు. అన్నీ పూర్తయితే రానున్న 15 రోజుల్లో శిక్షణ షెడ్యూల్ విడుదల చేసేలా ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒకేసారి 16,925 మంది కానిస్టేబుళ్లు శిక్షణకు రానుండటంతో.. ఎక్కడెక్కడ శిక్షణ ఇవ్వాలన్న దానిపైనా సమాలోచనలు జరుపుతున్నారు. కాగా, ఇప్పటికే 1,217 ఎస్సై, 29 కమ్యూనికేషన్ ఎస్సై, 26 ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టులకు అభ్యర్థుల భర్తీ ప్రక్రియ పూర్తయింది. వీరిలో సివిల్ ఎస్సైలకు ఇండక్షన్ ట్రైనింగ్ సైతం తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో ప్రారంభమైంది. ఈ నెల 24 నుంచి టీఎస్‌ఎస్పీ రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ల శిక్షణ ప్రారంభించనున్నారు.

## బోనస్ తీసుకునే స్థాయికి చేరాలి

- ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ పిలుపు
- ఉద్యోగాలు పొందిన 38 మందికి శిక్షణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్రమశిక్షణతో పనిచేసి సంస్థ లాభాలబాటలో నడిచేలా చేయాలని ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ సంస్థ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. వచ్చే ఏడాదినాటికి ప్రతిఒక్కరు బోనస్ తీసుకునేస్థాయికి ఎదగాలన్నారు. సమ్మెకాలంలో మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి చొప్పున సీఎం కేసీఆర్ హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగ అవకాశం కల్పించారు. వీరికి బుధవారం బస్‌భవన్‌లో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సునీల్‌శర్మ మాట్లాడుతూ.. సమ్మెకాలంలో కార్మికులు మరణించడం బాధాకరమని, సీఎం ఆదేశాలతో 38 మందికి ఉద్యోగాలిచ్చినట్టు తెలిపారు. వీరిలో 16 మందిని జూనియర్ అసిస్టెంట్లుగా, 12 మందిని కండక్టర్లుగా, 8 మందిని సెక్యూరిటీ కానిస్టేబుళ్లుగా, ఇద్దరిని కార్మికులుగా తీసుకున్నామని, క్యాటగిరీలవారీగా రెండువారాల నుంచి 13 వారాల వరకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగం పొందినవారు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెద్దదిక్కును కోల్పోయిన తమకు అండగా నిలిచి, ఉద్యోగాలిచ్చి ఆదుకున్నారని సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, పురుషోత్తం, యాదగిరి, చీఫ్ పర్సనల్ మేనేజర్ సూర్యకిరణ్, జేడీ రాంచందర్‌రావు, ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్గో సేవలు జనవరి నుంచి

మొదటిపేజీ తరువాయి...

ఉపయోగించుకోనున్నారు.

#### దశలవారీగా విస్తరణ

టీఎస్‌ఆర్టీసీలో కార్గో సేవలను దశలవారీగా విస్తరించనున్నారు. మొదటిదశలో వివిధ ప్రాంతాలు, జిల్లాల్లో ప్రైవేటువ్యక్తుల నుంచి బుకింగ్స్ స్వీకరిస్తారు. అనంతరం ప్రభుత్వానికి సంబంధించి వస్తురవాణాను చేపట్టేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రభుత్వశాఖల్లో మొదటగా వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ రవాణాపై దృష్టిసారించనున్నారు. పీడీఎస్ బియ్యం, వ్యవసాయోత్పత్తులు, తదితరాలను ఆర్టీసీ కార్గో ద్వారా తరలిస్తారు. తదుపరి విద్యాశాఖ, పరిశ్రమలశాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖలకు విస్తరించాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రైవేటుకార్గో సర్వీసులకు దీటుగా ఆర్టీసీ సర్వీసులను నిర్వహిస్తామని అధికారులు విశ్వాసంగా చెప్తున్నారు.


తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN: NIT No: 3215/NZB/DCE(R)/EE-R/DEE-7/AEE-1/2019-20 (2వ పిలుపు), తేది: 18.12.2019 ప్రకారం నిజామాబాద్ సర్కిల్‌లోని నిజామాబాద్ జిల్లాలో నాన్-ప్లాన్ గ్రాంట్లు క్రింద ఒక రోడ్డు పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి (2వ పిలుపు). టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను 20.12.2019న సా. 4.00 గం|| నుండి ఇ-మార్కెట్ ప్లేస్ అనగా tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 27.12.2019న సా. 4.00 గం||వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా tender.telangana.gov.inలో చూడవచ్చును.

సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN తరపున
DIPR RO. No. 1998-DP/CL/Advt/1/2019-20, Dt: 18/12/2019

తెలంగాణ రాష్ట్రం
ఆగ్రో ఇండస్ట్రీస్ అభివృద్ధి సంస్థ లిమిటెడ్
(రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ)
రిజిస్టర్డ్ కార్యాలయం: బ్లాక్ నం. 301, 302 3వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500038. ఫోన్: 040-23302680, 81 ఇ-మెయిల్: tsagrosfmd@gmail.com
వెబ్‌సైట్: tsagros.org
Lr.No. TSAGROS/NFSM/FMD/EOI/2019-20 తేది: 18-12-2019
ఆసక్తి వ్యక్తీకరణ


2019-20 సం|| కొరకు రేట్ కాంట్రాక్టు ప్రాతిపదికన జాబితాలో చేర్చుట కొరకు "వ్యవసాయ పరికరాలు, యంత్రాలు మరియు ఎక్విప్‌మెంట్" మరియు మునిసిపాలిటీ సంబంధిత పరికరముల" యొక్క సరఫరాదారుల నుండి సీల్డు EOI దరఖాస్తులు కోరబడుతున్నవి. తదుపరి వివరాల కొరకు www.tsagros.org చూడగలరు.

సం/- వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO No. 546pp/CL/Advt/1/2019-20, Dt: 18/12/2019


## చూయింగ్‌గమ్ చెప్పిన చరిత్ర

ఆరువేల ఏండ్ల కిందటి మహిళ పూర్తి డీఎన్‌ఏ లభ్యం

**కోపెన్‌హాగన్:** కొన్నిసార్లు చిన్న వస్తువులే వేల ఏండ్లకిందటి చరిత్రను విడమర్చి చెప్తాయి. ఇలాంటి ఘటనే తాజాగా డెన్మార్క్‌లో వెలుగు చూసింది. శాస్త్రవేత్తలు చూయింగ్ గమ్ వంటి పదార్థం సహాయంతో దాదాపు ఆరువేల ఏండ్ల కిందట నియోలిథిక్ యుగంలో జీవించిన యువతి జన్యుక్రమాన్ని, అప్పట్లో ఆమె నోటిలో జీవించిన సూక్ష్మక్రిముల ఉనికి ని గుర్తించారు. క్రీ.పూ 10,000-4,500 ఏండ్ల మధ్య కాలాన్ని నియోలిథిక్ యుగంగా పిలుస్తుంటారు. డెన్మార్క్‌లోని లోలాండ్ ద్వీపంలో ఉన్న ఓ ఎండిపోయిన ఉప్పునీటి మడుగులో శాస్త్రవేత్తలు తవ్వకాలు జరుపగా.. రెండు సెం.మీ. పొడవున్న చూయింగ్ గమ్ వంటి పదార్థం లభించింది. దీనిని 'బిర్చ్' చెట్టు (కొండరావి చెట్టు వంటిది) నుంచి తయారు చేసినట్టు గుర్తించారు. ఈ చెట్ల బెరడును కాల్చి, ఆ బూడిదను వివిధ ప్రక్రియల ద్వారా పేస్ట్ మాదిరిగా తయారుచేస్తారు. దీని ని 'బిర్చ్ టార్' అని పిలుస్తారు. వేల ఏండ్లుగా దీనిని గమ్ మాదిరిగా అంటించేందుకు వినియోగిస్తున్నారు. లోలాండ్ ద్వీపంలో దొరికిన బిర్చ్ టార్‌ను కోపెన్‌హాగన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశీలించి అందులో మానవ డీఎన్‌ఏ ఉన్నట్టు గుర్తించారు. దానిని విశ్లేషించగా పూర్తి జన్యుక్రమం బయటపడింది. దాదాపు 5,600 ఏండ్ల కిందట జీవించిన ఒక మహిళ దానిని చూయింగ్‌గమ్‌లాగా నమిలి ఊసినట్టు నిర్ధారించారు. ఆమెకు నల్లని చర్మం, నల్లని కురులు, నీలంరంగు కండ్లు ఉన్నట్టు వెల్లడైంది. బిర్చ్ టార్‌ను మరింత విశ్లేషించగా.. అప్పట్లో ఆ మహిళ నోటిలో న్యుమోనియాను కలిగించే స్ట్రెప్టోకోకస్ న్యుమోనియే, లింఫ్ గ్రంథుల్లో వాపు, జ్వరం కలిగించే ఎప్‌స్టెన్ బార్ వైరస్ వంటి సూక్ష్మజీవులు ఉన్నట్టు గుర్తించారు. ఇదే ప్రాంతంలో దొరికిన ఇతర జంతువుల అవశేషాల్లో 40 రకాల సూక్ష్మజీవుల ఆనవాళ్లను గుర్తించామని పరిశోధనకు నేతృత్వం వహించిన థెసిస్ జేన్సన్, హాన్నెస్ స్క్రుయేడర్ తెలిపారు. బిర్చ్ టార్ ను చూయింగ్ గమ్‌గా కూడా వాడేవారని ఇప్పుడే తెలి సిందన్నారు. వీరి పరిశోధన వ్యాసం నేచర్ కమ్యూనికేషన్స్ లో ప్రచురితమైంది.



మహిళ ఊహా చిత్రం
(ఇన్‌సెట్) తవ్వకాల్లో లభ్యమైన బిర్చ్‌టార్

## రాష్ట్రంలో పెరుగుతున్న చలి తీవ్రత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో తూర్పుదిశ నుంచి చలిగాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వీటి ప్రభావంతో మెదక్, రంగారెడ్డి, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో చలితీవ్రత పెరుగుతున్నదని చెప్పారు. రాగల మూడ్రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లాలో 12.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, మెదక్‌లో 13.7 డిగ్రీలుగా రికార్డయింది.

## ఒకే గొడుగు కిందకు జలశాఖలు

మొదటిపేజీ తరువాయి...

మధ్యతరహా ప్రాజెక్టులు, చెరువులను కూడా పునరుద్ధరిస్తున్నది. ప్రస్తుతం ఒక జిల్లా లేదా మండలంలోని భారీ ప్రాజెక్టుకు విడిగా, అదే ప్రాంతంలోని మధ్యతరహా ప్రాజెక్టులు, చెరువులకు విడిగా ఇంజినీర్లు ఉన్నారు. వీరందరినీ ఒకే గొడుకు కిందకు తీసుకొస్తే నీటివనరుల నిర్వహణ పకడ్బందీగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. సాగునీటి నిపుణులు సైతం ఈ విధానంలో నీటివనరుల నిర్వహణ సులువుగా, ప్రభావవంతంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. కొన్నిరోజుల కిందట జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం కేసీఆర్ చేసిన దిశానిర్దేశం మేరకు నీటిపారుదలశాఖ అధికారులు ఈ నెల 21న ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

#### సర్కారు లక్ష్య సాధనకు మంచిమార్గం!

ఏదైనా భారీ ప్రాజెక్టు నిర్మిస్తే.. నిర్దేశించిన ఆయకట్టుకు నేరుగా సాగునీరు అందించడంపైనే దృష్టిసారించేవారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి నిర్వహణ విధానాన్ని సమూలంగా మార్చివేసింది. భారీ ప్రాజెక్టు పరిధిలోని నిర్దేశిత ఆయకట్టుకే పరిమితంకాకుండా.. దాని పరిధిలోని ప్రతి చిన్న చెరువును సైతం సాధ్యమైనంత వరకు నింపాలని స్పష్టంచేసింది. ఈ ఏడాది కాళేశ్వరం నీటితో వేల చెరువులను నింపడంవల్ల అనేక జిల్లాల్లో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఎన్నడూలేని విధంగా శ్రీరాంసాగర్ పరిధిలో 14 లక్షల ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అం దింది. ఇదే పద్ధతిలో అన్ని ప్రాజెక్టుల పరిధిలోనూ అత్యధికంగా చెరువులను నింపాలని ప్రభుత్వం ఆదేశించింది. వేలకోట్లు వెచ్చించి నిర్మించిన ఎత్తిపోతల పథకాలద్వారా మళ్లిస్తున్న జలాలు చివరిభూములవరకు పారి.. ప్రతి ఎకరాను తడుపుతున్నాయి.

#### ఒకటే వ్యవస్థ ఉత్తమం: ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి

భారీ ప్రాజెక్టు మొదలు చెరువుల వరకు ఒకే వ్యవస్థకింద నిర్వహణ ఉండటం మంచి ఫలితాలనిస్తుందని, ప్రభుత్వం అదేరీతిన యోచిస్తున్నదని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల సంఘం (ట్రీ) ప్రధాన కార్యదర్శి ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. దీనిద్వారా మానవ వనరుల వినియోగంపై స్పష్టత వచ్చి, వాటి వినియోగం కూడా సమర్థంగా ఉంటుందన్నారు. ప్రాజెక్టుల నిర్వహణకు బడ్జెట్ కేటాయించేందుకు సీఎం కేసీఆర్ అంగీకరించినందున విభాగాలవారీగా కాకుండా ఏరియావారీగా నిర్వహణ ఉండటం వల్ల ప్రతి పైసా సద్వినియోగం అవుతుందని వివరించారు. దీని రూపురేఖలు ఎలా ఉండాలనేదానిపై మథనం జరుగాలని, తద్వారా ఒక కార్యాచరణ రూపొందించవచ్చని చెప్పారు.

# యాదాద్రి పనులు వేగిరం



యాదాద్రిలో ప్రధాన ఆలయం వద్ద జరుగుతున్న పునరుద్ధరణ పనులు (ఇన్‌సెట్‌లో) పద్మాలను చెక్కుతున్న శిల్పి

**యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** సీఎం కేసీఆర్ యాదాద్రి పర్యటన అనంతరం పనులు వేగిరం అయ్యాయి. ఆలయంలోపల నగిషీ పనులు, ఫ్లోరింగ్ పనులు, సాలహారాల ఏర్పాటుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. బుధవారం మధ్యాహ్నం సీఎం కేసీఆర్ ఆయన ప్రత్యేకకార్యదర్శి భూపాల్‌రెడ్డితో ఆలయపనులపై చర్చించారు. దర్శనాలు ప్రారంభం అయ్యాక వసతుల విషయంలో భక్తులకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. గండి చెరువు వద్ద 143 ఎకరాలలో నిర్మించతలపెట్టిన పుష్కరిణి, కళ్యాణకట్ట, నిత్యాన్నదానసత్రం, బస్‌స్టేషన్, కారు పార్కింగ్, క్యూ క్లాంప్లెక్స్, ఫైర్ స్టేషన్ తదితర పనుల కోసం త్వరలో టెండర్లు పిలువనున్నారు. భక్తులకు ఆహ్లాదం కలిగేలా బస్వాపూర్ రిజర్వాయర్‌ను తీర్చిదిద్దనున్నారు. దేవాలయానికి కావాల్సిన నీటిని నేరుగా ఇక్కడినుంచి తీసుకొచ్చేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బుధవారం శిల్పులు పనుల్లో బిజీగా కనిపించారు.

## ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రణాళిక

ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి

**ఖమ్మం, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లా టీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఒక్కప్పుడు ఆయిల్‌పామ్ ఖమ్మం జిల్లాకు మాత్రమే పరిమితమైందని, ఇప్పుడిప్పుడే మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో విస్తరిస్తుందన్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం నుంచి 1500 మంది రైతులు అశ్వారావుపేట, దమ్మపేటలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీలు, తోటలను పరిశీలించి వెళ్లారన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఐదేండ్ల కాలంలో 30 వేల ఎకరాలకు పంట విస్తరించామన్నారు.

## పులి దాడిలో ఏడు ఆవులు హతం



పులి దాడిలో చనిపోయిన ఆవు

**కోటపల్లి:** మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్‌లో ఆవులు, దూడలపై పులులు దాడులు చేస్తుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి కోటపల్లి మండలం పంగిడిసోమారం గ్రామంలో ఓ పులి ఏడు ఆవులను చంపేసింది. గ్రామానికి చెందిన మోడెం రమేశ్‌గౌడ్‌కు చెందిన రెండు ఆవులు, అశోక్‌కు చెందిన రెండు ఆవులు, మంచాల భీమయ్య, బోయిని లచ్చయ్య, పొన్నాల బానయ్యలకు చెందిన ఒక్కో ఆవు మేత కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బుధవారం ఉదయం ఆవుల కోసం వెతుకుతుండగా, గ్రామ సమీపంలో ఉన్న పత్తి చేలల్లో ఆవులు రక్తపు మడుగులో పడి చనిపోయి ఉండడం గమనించారు. ఒక ఆవును పూర్తిగా తినగా, చుట్టు పక్కల పులి అడుగులు ఉండడంతో పులి దాడిలోనే తమ ఆవులు మృతిచెందాయని పశువుల యజమానులు నిర్ధారణకు వచ్చారు. ఘటన స్థలాన్ని పంగిడిసోమారం బీట్ అధికారులు సందర్శించి వివరాలను సేకరించారు.





సూర్యాపేటలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో దేవులపల్లి ప్రభాకర్‌రావు తదితరులు

# ఐదేండ్లలోనే అద్భుత ఫలితాలు

- విద్యుత్ రంగంలో అగ్రగామిగా తెలంగాణ
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ దృఢ సంకల్పంతోనే ఐదేండ్లలోనే తెలంగాణ విద్యుత్ రంగం అద్భుత ఫలితాలు సాధించిందని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ 1104 యూనియన్ కార్మిక సంక్షేమ భవనాన్ని ట్రాన్స్‌కో, జెన్కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. కార్మిక సంఘాలు హక్కుల సాధనకు పాటుపడుతూనే సంస్థ పురోగతికి కృషి చేయాలని కోరారు. యాజమాన్యం, కార్మికులు సమిష్టిగా పనిచేస్తున్నందునే విద్యుత్ రంగంలో రాష్ట్రం ముందంజలో ఉందని పేర్కొన్నారు. 1104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మారెడ్డి, సాయిబాబా, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**విమర్శించేవారికి సైతం లబ్ధి**

సీఎం కేసీఆర్‌ను విమర్శించే నేతలు, మేధావులం అనుకునే వారికి కూడా సంక్షేమపథకాలు అందుతున్నాయని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ తరహా పథకాలు ఉన్నాయా అనేది గుర్తుచేసుకోవాలని ఆయా పార్టీలకు సూచించారు.

# మూడోరోజు కోర్టుకు సమత నిందితులు

- నిందితుల తరపున వాదనకు వకాల్తా దాఖలు చేసిన న్యాయవాది
- నేడు కొనసాగనున్న విచారణ

**ఆదిలాబాద్ / నమస్తే తెలంగాణ ప్రతినిధి:** సమత హత్యకేసులో నిందితులను మూడోరోజు బుధవారం పోలీసులు ఆదిలాబాద్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో హాజరుపర్చారు. భారీ బందోబస్తు నడుమ నిందితులు షేక్ బాబా, షేక షాబొద్దీన్, షేక్ మగ్దూలను ఆదిలాబాద్ జైలు నుంచి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తీసుకొచ్చారు. కాగా న్యాయమూర్తి కేసును గురువారానికి వాయిదా వేశారు. బార్ అసోసియేషన్ తీర్మానం మేరకు నిందితుల తరపున వాదనలు వినిపించిడానికి లాయర్లు ముందుకు రాకపోవడంతో కోర్టు రహీం అనే న్యాయవాదిని నియమించింది. కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం ముగ్గురు నిందితులను పోలీసులు ఆదిలాబాద్ జైలుకు తరలించారు.

# ఆరని పసుపు బోర్డు సెగ

- ఎంపీ అర్వింద్ రాజీనామాకు డిమాండ్
- మూడోరోజు కొనసాగిన రైతుల ఆందోళనలు
- గడ్కోల్‌లో ఎంపీ దిష్టిబొమ్మ దహనం
- నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట విద్యార్థి జేఏసీ నిరసన





నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో అర్వింద్ ఫ్లెక్సీతో ఆందోళన చేస్తున్న నాయకులు

**జక్రాన్‌పల్లి/ సిరికొండ/ఇందూరు:** ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే, గెలిచిన ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని రైతులకు హామీఇచ్చి, మాటమార్చిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్ రాజీనామా చేయాలని పసుపురైతులు డిమాండ్‌చేస్తున్నారు. బోర్డు ఏర్పాటు చేయకపోగా, రైతులను మభ్యపెట్టే యత్నాలు చేస్తున్నారని విమర్శిస్తూ నిజామాబాద్ జిల్లాలో మూడోరోజు బుధవారం కూడా పలుచోట్ల పసుపు రైతులు ఆందోళనలు చేశారు. బోర్డు ఏర్పాటుపై హామీ ఇచ్చిన ఎంపీ అర్వింద్ మాట తప్పితే ఉద్యమం తప్పదని పసుపు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి హెచ్చరించారు. ఎంపీ పదవికి అర్వింద్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో పాటు పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని బుధవారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో తాసిల్దార్ రాజుకు ఆయన ఆధ్వర్యంలో పసుపురైతులు వినతిపత్రం అందజేశారు. పసుపుబోర్డు ఏర్పాటు చేస్తానని రైతులకు బాండ్‌పేపర్ రాసిచ్చి, ఇప్పుడు రైతులను చులకన చేసే పద్ధతుల్లో మాట్లాడడం అర్వింద్‌కు తగదని నిజామాబాద్ జిల్లా సీపీఐ కార్యదర్శి భూమయ్య అన్నారు. నిజామాబాద్ నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు చేస్తున్న ఉద్యమానికి తమ పూర్తిమద్దతు ఉంటుందని, రైతుల ఉద్యమానికి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నామన్నారు. రైతులను మోసం చేసిన ఎంపీ అర్వింద్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు హామీని ఆయన నిలబెట్టుకోవాలన్నారు. సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో పసుపు రైతులు ఎంపీ ధర్మపురి అర్వింద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా పసుపు బోర్డు ఏర్పాటు చేయించాలని, లేదంటే ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని కలెక్టరేట్ వద్ద ఎంపీ అర్వింద్ రాజీనామా చేయాలని ఫ్లెక్సీతో నిరసన తెలిపారు. విద్యార్థి జేఏసీ నాయకుడు యెండల ప్రదీప్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.



నిజామాబాద్ జిల్లా గడ్కోల్‌లో ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు



దగ్ధమవుతున్న దుకాణం

# మందమర్రిలో అగ్ని ప్రమాదం

**మందమర్రి:** షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన మందమర్రి మార్కెట్‌లో బుధవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక మార్కెట్ శ్రీసాయి బాబ ఆలయం సమీపంలోని ఆరీఫ్ అనే వ్యక్తికి చెందిన గదిని మధ్యప్రదేశ్‌కు చెందిన ఒకనామి అద్దెకు తీసుకున్నాడు. అందులో బ్లాంకెట్లు, స్వెటర్లు తదితర చలికాలం ధరించే దుస్తులకు సంబంధించిన దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. రోజువారీగా బుధవారం దుకాణం మూసివేసి ఇంటికివెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి 10 గంట సమయంలో షాపు నుంచి మంటలు చెలరేగాయి. దుకాణంలోని చలి దుస్తులు కొంత మేర దగ్ధమయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానిక యువకులు వెంటనే స్పందించి షాపులోని కొంత మేర వస్త్రాల నిల్వలను దూర ప్రాంతానికి తరలించడంతో భారీ ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారంతో బెల్లంపల్లి అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. అనంతరం గది లోపలివి వెళ్లి చూడగా అందులో ఉన్న రూ.40 వేల నగదు కాలిపోకుండా లభించడంతో దుకాణం యజమాని ఒకనామి ఊపిరి పీల్చుకున్నాడు.




బొంరాస్‌పేట తాసిల్దార్ కార్యాలయం ఎదుట వంటలు చేస్తున్న మహిళలు

# తాసిల్ ఆఫీస్‌లో వంటావార్పు

**బొంరాస్‌పేట:** ఏండ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు భాగ పరిష్కారం చేయడం లేదని వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం ఏర్పుమళ్లకు చెందిన రైతులు బుధవారం తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో వంటావార్పుతో నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన 24 మంది రైతులకు సర్వే నంబర్లు 144, 147,172, 173, 175, 176, 177, 180, 181, 339, 341లో 52 ఎకరాల భూమి ఉన్నది. కానీ రికార్డుల్లో కొందరికి ఎక్కువ, కొందరికి తక్కువ భూమి నమోదైంది. దానిని సరిచేసి భాగ పరిష్కారం చేయాలని, కొత్త పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని రైతులు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో రైతులు బుధవారం తాసిల్దార్ కార్యాలయానికి చేరుకొని వంటలు వండి నిరసన తెలిపారు. ఎస్సై మహిపాల్‌రెడ్డి అక్కడికి వెళ్లి రైతులతో ఇంచార్జి తాసిల్దార్ కృష్ణతో ఫోన్‌లో మాట్లాడించారు. 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఎస్సై కృష్ణ హామీ ఇవ్వడంతో రైతులు నిరసనను విరమించారు.

# ఉరకలేస్తున్న గోదారి

- నంది, గాయత్రి పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతల
- ఎస్సారార్‌కు తరలుతున్న నీరు
- ప్రాజెక్టులో ప్రస్తుతం 23.085 టీఎంసీల నిల్వ



పెద్దపల్లి జిల్లా నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌లో నీటిని ఎత్తిపోస్తున్న మోటర్లు

**రామడుగు /ధర్మారం /బోయినపల్లి:** ఎల్లంపల్లి జలాశయం నుంచి శ్రీరాజరాజేశ్వర, ఎల్‌ఎండీ జలాశయాల వరకు గోదారి ఉరకలేస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లోని నంది, గాయత్రి పంప్‌హౌసుల్లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎల్లంపల్లి నుంచి జంట సొరంగాల ద్వారా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. ఇక్కడ 4, 5, 6 మోటర్ల ద్వారా నంది రిజర్వాయర్‌కు జలాలు చేరుతుండగా, జలాశయం గేట్లు ఎత్తడంతో జంటసొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. గాయత్రిలో 1, 6, 7 పంపులు ఎత్తిపోస్తుండడంతో గ్రావిటీ కాల్వ ద్వారా వరద కాల్వకు చేరుకుంటున్నాయి. ఇక్కడి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం వైపు కాళేశ్వర జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. ఈ నెల 5 నుంచి ఇప్పటివరకు గాయత్రి పంపుహౌస్ నుంచి 7.851 టీఎంసీల నీటిని ఎస్సారార్‌కు తరలించినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం వరకు ఎస్సారార్ ప్రాజెక్టులో 23.085 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని అధికారులు తెలిపారు. రివర్స్ స్లూయిస్(తూముల) ద్వారా దిగువకు 9,450 క్యూసెక్కులు వెళుతున్నది.

**కన్నెపల్లి నుంచి అన్నారం బరాజ్‌కు..**

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన లక్ష్మి( కన్నెపల్లి ) పంప్‌హౌస్‌లో బుధవారం మూడు మోటర్ల ద్వారా సరస్వతి(అన్నారం) బరాజ్‌కు 5,862 క్యూసెక్కుల నీరు తరలివెళ్లింది. అక్కడి నుంచి సరస్వతీ బరాజ్‌కు తరలుతున్నాయి. సరస్వతీ బరాజ్‌లో 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇంజినీర్లు తెలిపారు.

# మహిళను చంపింది సైకో కిల్లర్

- రామాయంపేట హంతకుడిని పట్టుకున్న పోలీసులు
- నిందితుడిపై గతంలో ఐదు కేసులు



నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశ పెడుతున్న తూప్రాన్ డీఎస్పీ అరుణ్‌కుమార్

**రామాయంపేట:** మెదక్ జిల్లా రామాయంపేట కొచ్చెరువు ప్రాంతంలో ఈ నెల 13న ఓ మహిళపై లైంగికదాడి, హత్య ఘటనలో నిందితుడు, సైకోకిల్లర్ అరుణ్‌కుమార్‌ను పోలీసులు పట్టుకున్నారు. తూప్రాన్ డీఎస్పీ కిరణ్‌కుమార్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం సుద్దాపూర్‌కు చెందిన నీరడి అరుణ్‌కుమార్ నిజామాబాద్ పట్టణానికి చెందిన బాధితురాలికి డబ్బు, నగదు, నగల ఆశ చూపి నిజామాబాద్ నుంచి ఇందల్‌వాయి వరకు స్కూటీపై వచ్చి అక్కడి నుంచి మరో వాహనంలో రామాయంపేటకు డిసెంబర్ 5న రాత్రి 9:30 గంటల ప్రాంతంలో తీసుకొచ్చాడు. అక్కడ ఆమెపై లైంగికదాడి చేయగా, ప్రతిఘటించడంతో హత్య చేశాడు. అరుణ్‌కుమార్‌పై గతంలోనూ లైంగికదాడి, హత్య, చోరీ కేసులు మొత్తం ఐదు ఉన్నాయి. బుధవారం అరుణ్‌కుమార్ స్కూటీపైనే రామాయంపేట నుంచి జాతీయ రహదారిపై నిజామాబాద్ వైపు వెళ్తుండగా పోలీసుల వాహనాల తనిఖీలో పట్టుబడ్డాడు. ఆన్‌లైన్‌లో చెక్ చేయగా స్కూటీ మృతురాలిదే అని తేలింది. దీంతో అరుణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకోగా, హత్య విషయం వెలుగులోకి వచ్చిందని పోలీసులు తెలిపారు. ఇంజినీరింగ్ చదివిన అరుణ్‌కుమార్ జల్సాలకు అలవాటు పడి సైకోకిల్లర్‌గా మారాడని వివరించారు.

# వజ్రాల వ్యాపారిపై దాడి.. కారు చోరీ

**గుడిహత్నూర్:** నాగపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వజ్రాల వ్యాపారి కారుపై దాడి చేసి అపహరించిన ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సావర్గమ్ సమీపంలో చోటుచేసుకున్నది. బాధితులు గుడిహత్నూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. గుజరాత్‌కు చెందిన ఓ వజ్రాల వ్యాపారి వద్ద పని చేసే కరణ్‌పటేల్, విశాల్‌పటేల్ కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. కారులో వజ్రాలు ఉన్నాయని భావించిన గుర్తు తెలియని వ్యక్తులు వారిపై దాడి చేసి కారును తీసుకెళ్లారు. మూడు ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు చేపట్టగా మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా వారాకౌఠ వద్ద కారు దొరికింది.



మిర్యాలగూడలో క్రైస్తవులకు దుస్తులు అందిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి



భీమ్‌గల్‌లో క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకులు అందజేస్తున్న మంత్రి వేముల

# అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నదని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పట్టణంలోని ఎల్జే గార్డెన్‌లో బుధవారం బాల్కొండ నియోజకవర్గంలోని పేద క్రైస్తవులకు ప్రభుత్వం తరపున క్రిస్మస్ గిఫ్ట్‌ప్యాకులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. పేద క్రైస్తవులు సైతం క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకులు అందజేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

**అన్ని మతాలకు ప్రాధాన్యం: మంత్రి సత్యవతి**


రాష్ట్రంలోని అన్ని మతాల పండుగలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ పేర్కొన్నారు. బుధవారం మహబూబాబాద్‌లోని మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలో నిర్వహించిన క్రిస్మస్‌వేడుకల్లో ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా కేక్ కట్ చేసిన మంత్రి తరువాత క్రిస్టియన్లకు దుస్తులు పంపిణీ చేశారు.

**క్రైస్తవుల్లో ఆనందం: మండలి చైర్మన్ గుత్తా**

క్రిస్మస్ సందర్భంగా గిఫ్ట్‌ప్యాకులు అందజేసి తెలంగాణ ప్రభుత్వం క్రైస్తవుల ఇండ్లల్లో సంతోషం నింపుతున్నదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో కలిసి క్రైస్తవులకు గిఫ్ట్‌ప్యాకుల అందజేశారు.

# పరిహారం సొమ్ము 6.50 లక్షలు స్వాహా

- భార్య పేరిట అక్రమంగా బదలాయించుకున్న వీఆర్‌ఏ
- ఆలస్యంగా వెలుగులోకి..



బాధితురాలు చంద్రమ్మ

**అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ:** నిరక్షరాస్యురాలిని మోసగించి ఓ వీఆర్‌ఏ రూ. 6.50 లక్షలు తన భార్య ఖాతాలోకి అక్రమంగా బదలాయించుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. 2017, ఆగస్టు 2న జరిగిన ఈ ఘటనపై బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం చెన్నాపురానికి చెందిన గాలి చంద్రమ్మకు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా వేలేరుపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లారం గ్రామంలో మూడెకరాల భూమి ఉండేది. ఆ భూమిని పోలవరం నిర్మాణంలో భాగంగా ఏపీ ప్రభుత్వం సేకరించింది. 2017 జూలై 20లో భూమికి సంబంధించిన పరిహారం నగదు రూ.35.33 లక్షలు చంద్రమ్మ ఖాతాలో జమ అయ్యాయి. ఈ మొత్తంలో కొంత నగదును పిల్లలకు పంచగా రూ.10 లక్షలు మిగిలాయి. పరిహారం సొమ్ము రావడానికి సహకరించాడని వీఆర్‌ఏ రమేశ్‌కు రూ.3.50 లక్షలు ఇచ్చి మిగిలిన రూ. 6.50 లక్షలు బ్యాంకులోనే ఉంచుకున్నది. కాగా అకౌంట్‌లోని డబ్బును సరిచూసుకుందామంటూ ఆగస్టు 2, 2017న వీఆర్‌ఏ రమేశ్ చంద్రమ్మను బ్యాంకుకు తీసుకెళ్లి.. ఆమెతో ఓచర్‌పై వేలిముద్ర వేయించుకొని బ్యాంకులో ఉన్న రూ.6.50 లక్షల నగదును తన భార్య ఖాతాలోకి బదలాయించాడు. బ్యాంకులో సొమ్ము భద్రంగా ఉందని భావించిన చంద్రమ్మ తిరిగి ఇంటికి వెళ్లిపోయింది. ఇటీవల కూతురు దుర్గమ్మకు నగదు అవసరం ఉండటంతో డ్రా చేసి ఇవ్వటానికి బుధవారం బ్యాంకుకు వచ్చింది. బ్యాంకులో నగదు నిల్వను చూసుకోగా కేవలం రూ.69 ఉన్నట్టు అధికారులు చెప్పారు. బ్యాంకు లావాదేవీలను పరిశీలించగా 2017లోనే రమేశ్ భార్య ఖాతాలోకి నగదు బదలాయించుకున్నట్టు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం | జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|---|---|---|
| | | | వరంగల్ రూరల్ | 17.0 | 28.0 |
| | | | ములుగు | 17.0 | 29.0 |
| | | | నాగర్‌కర్నూల్ | 17.0 | 29.0 |
| వికారాబాద్ | 12.3 | 33.3 | పెద్దపల్లి | 17.0 | 29.0 |
| మెదక్ | 13.7 | 30.5 | జనగామ | 17.1 | 28.0 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 15.0 | 30.0 | వరంగల్ అర్బన్ | 17.5 | 29.5 |
| మంచిర్యాల | 15.6 | 31.8 | ఆదిలాబాద్ | 17.7 | 28.8 |
| నిర్మల్ | 16.0 | 27.0 | జయశంకర్ భూపాలపల్లి | 18.0 | 29.0 |
| సిద్దిపేట | 16.0 | 28.0 | మహబూబాబాద్ | 18.0 | 30.0 |
| కామారెడ్డి | 16.0 | 29.0 | జోగుళాంబ గద్వాల | 18.0 | 31.0 |
| రాజన్న సిరిసిల్ల | 16.0 | 29.0 | హైదరాబాద్ | 18.2 | 28.0 |
| రంగారెడ్డి | 16.0 | 29.0 | మేడ్చల్ | 18.2 | 28.0 |
| నల్లగొండ | 16.0 | 29.0 | నిజామాబాద్ | 18.2 | 29.7 |
| జగిత్యాల | 16.0 | 30.0 | నారాయణపేట | 18.3 | 29.3 |
| వనపర్తి | 16.0 | 33.4 | మహబూబ్‌నగర్ | 18.3 | 29.3 |
| సంగారెడ్డి | 16.3 | 29.5 | సూర్యాపేట | 19.0 | 29.0 |
| కరీంనగర్ | 16.3 | 31.3 | భద్రాద్రి కొత్తగూడెం | 19.0 | 30.0 |
| యాదాద్రి భువనగిరి | 17.0 | 26.0 | ఖమ్మం | 19.0 | 31.0 |

నమస్తే తెలంగాణ
# ఆట
8
[ కరీంనగర్ ]
గురువారం 19 డిసెంబర్ 2019
WWW.NTNEWS.COM

# వైజాగ్‌లో వీరంగం

## రెండో వన్డేలో 107 పరుగులతో టీమ్ఇండియా జయభేరి

### 1-1తో సిరీస్ సమం.. రోహిత్, రాహుల్ శతక గర్జన.. కుల్దీప్ యాదవ్ హ్యాట్రిక్



రోహిత్ (159)

కుల్దీప్ (3/52)



రాహుల్ (102)

**రోజర్ ఫెదరర్, రఫేల్ నాదల్ కలిసి డబుల్స్ మ్యాచ్ ఆడినట్లు..అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ కలిసి ఒకే సినిమాలో కనిపించినట్లు.. వైజాగ్ పిచ్‌పై భారత ఆటగాళ్లు వీరంగం ఆడారు. మొదట రోహిత్ శర్మ, లోకేశ్ రాహుల్ సెంచరీలతో కదం తొక్కితే.. మేమేం తక్కువా అన్నట్లు యువ ద్వయం శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. విండీస్ బౌలర్లకు పట్టపగలే చుక్కలు చూపుతూ సిక్సర్ల వర్షం కురిపించారు. అచ్చొచ్చిన మైదానంలో భారత సారథి విరాట్ కోహ్లీ డకౌటైనా ఆ ప్రభావం ఏమాత్రం కనిపించనివ్వకుండా చెలరేగిపోవడంతో టీమ్ఇండియా భారీ స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో హోప్, పూరన్ ధాటిగా ఆడుతుండటంతో ఒక దశలో గెలుపు కష్టమే అనిపించినా.. కుల్దీప్ యాదవ్ హ్యాట్రిక్‌కు మహమ్మద్ షమీ డబుల్ తోడవడంతో విండీస్ చేతులెత్తేసింది. సిరీస్ సమం చేసిన కోహ్లీ అండ్ కో.. ఇక కటక్‌లో ఫైనల్ కాని ఫైనల్ ఆడేందుకు సమాయాత్తమవుతున్నది.**

**విశాఖపట్నం:** చావో రేవో మ్యాచ్‌లో టీమ్ఇండియా విజృంభించింది. మొదట బ్యాటింగ్‌లో కొండంత స్కోరు చేసిన విరాట్ సేన అనంతరం బౌలింగ్‌లోనూ ఆకట్టుకొని మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. బుధవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో భారత్ 107 పరుగులతో జయభేరి మోగించింది. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ (138 బంతుల్లో 159; 17 ఫోర్లు, 5 సిక్సర్లు), లోకేశ్ రాహుల్ (104 బంతుల్లో 102; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీలు బాదడంతో కోహ్లీ సేన నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లకు 387 పరుగులు చేసింది. మిడిలార్డర్‌లో యువ ద్వయం శ్రేయాస్ అయ్యర్ (32 బంతుల్లో 53; 3 ఫోర్లు, 4 సిక్సర్లు), పంత్ (16 బంతుల్లో 39; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో సాగర తీరంలో పరుగుల సునామీ వచ్చినట్లైంది. అనంతరం లక్ష్య ఛేదనలో హ్యాట్రిక్ హీరో కుల్దీప్ యాదవ్ (3/52), షమీ (3/39) ధాటికి విండీస్ 43.3 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. హోప్ (85 బంతుల్లో 78; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) మరోసారి నిలకడ ప్రదర్శించగా.. పూరన్ (47 బంతుల్లో 75; 6 ఫోర్లు, 6 సిక్సర్లు) అదరగొట్టాడు. వీరిద్దరు మినహా మిగిలినవారు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. రోహిత్ శర్మకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే ఆదివారం కటక్‌లో జరుగనుంది.

#### ఇది కదా కావాల్సింది

గత మ్యాచ్‌లో ఆకట్టుకోలేకపోయిన టీమ్ఇండియా ఓపెనర్లు ఈసారి ఇరగదీశారు. టాస్ గెలిచి భారత్‌కు బ్యాటింగ్ ఎందుకు అప్పగించానా అని పొలార్డ్ చింతించే విధంగా చెలరేగిపోయారు. ఆరంభంలో ఆచితూచి ఆడే రోహిత్ మరోసారి తన పంథా కొనసాగించగా.. రాహుల్ మాత్రం మొదటి నుంచే ధాటిగా ఆడుతూ వచ్చాడు. ఫలితంగా 10 ఓవర్లు ముగిసేసరికి భారత్ 55/0తో నిలిచింది. ఆ తర్వాత కూడా ఏ మాత్రం జోరు తగ్గించని ఈ జోడీ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ క్రమంలో మొదట రాహుల్ (46 బంతుల్లో), ఆ తర్వాత రోహిత్ (67 బంతుల్లో) అర్ధ శతకాలు పూర్తిచేసుకున్నారు. అక్కడి నుంచి వీరిద్దరు పోటీ పడి బౌండ్రీలు బాదారు. ఒక దశ దాటాక రాహుల్ కాస్త నెమ్మదించినా.. టాప్ గేర్‌లోకి వచ్చిన రోహిత్ శివాలెత్తిపోయాడు. 70 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద హెట్‌మైర్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన హిట్‌మ్యాన్ ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. రాహుల్ కంటే ముందే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వన్డేల్లో 28వ శతకం చేశాక మరింతగా రెచ్చిపోయిన రోహిత్.. హోల్డర్ బంతిని స్టేడియం బయటకు పంపాడు. సెంచరీ కాగానే రాహుల్ ఔటవడంతో.. తొలి వికెట్‌కు నమోదైన 227 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అచ్చొచ్చిన మైదానంలో అభిమానుల కేరింతల మధ్య క్రీజులోకొచ్చిన కెప్టెన్ కోహ్లీ తొలి బంతికే 'గోల్డెన్ డక్'గా పెవిలియన్ చేరాడు. వికెట్లు పడుతున్నా ఏ మాత్రం జోరు తగ్గించని రోహిత్ చూస్తుండగానే 150 మార్క్ దాటాడు. 67 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసిన రోహిత్.. ఆ తర్వాత వరుసగా 40, 25 బంతుల్లో ఫిఫ్టీలు కొట్టడం విశేషం. బౌండ్రీల ద్వారానే 98 పరుగులు రాబట్టిన హిట్‌మ్యాన్ మరింత వేగం పెంచే క్రమంలో ఔటైనా.. మిడిలార్డర్ సత్తాచాటడంతో భారత్ భారీ స్కోరు చేయగలిగింది.

#### అటు ఇద్దరు.. ఇటు ఇద్దరు

భారీ లక్ష్య ఛేదనలో విండీస్‌కు శుభారంభం లభించింది. తొలి ఓవర్ మూడో బంతికి హోప్ ఇచ్చిన తేలికైన క్యాచ్‌ను స్లిప్‌లో రాహుల్ వదిలేశాడు. దీన్ని వినియోగించుకున్న హోప్ నింపాదిగా ఆడితే.. లూయిస్ (30) ఉన్నంతసేపు వేగంగా ఆడాడు. గత మ్యాచ్ హీరో హెట్‌మైర్ (4).. రనౌట్ కాగా.. చేజ్ (4) విఫలమయ్యాడు. ఈ దశలో హోప్‌కు పూరన్ జతకలవడంతో విండీస్ ఇన్నింగ్స్ గాడినపడింది. 22 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద దీపక్ క్యాచ్ వదిలేయడంతో పూరన్ బతికిపోయాడు. వీరిద్దరూ ఎడాపెడా బౌండ్రీలతో విరుచుకుపడటంతో 30 ఓవర్లు ముగిసేసరికి విండీస్ 192/3తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. పూరన్, హోప్ ధాటిగా ఆడుతుండటంతో విండీస్ విజయం పెద్ద కష్టం కాదనిపించింది. అయితే వరుస బంతుల్లో పూరన్‌తో పాటు పొలార్డ్ (0)ను ఔట్ చేసిన షమీ భారత్‌ను పోటీలోకి తెస్తే.. 33వ ఓవర్లో కుల్దీప్ యాదవ్ హ్యాట్రిక్‌తో విండీస్ వెన్ను విరిచాడు. హోప్, హోల్డర్ (11), జోసెఫ్ (0)ను వరుస బంతుల్లో వెనక్కి పంపి వన్డేలో రెండో హ్యాట్రిక్ నమోదు చేసుకున్నాడు. ఫలితంగా కరీబియన్లు 210/8తో విజయానికి దూరమయ్యారు. చివర్లో కీమో పాల్ (46; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), పియర్ (21) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే పనికొచ్చింది.

### కోహ్లీ @ 400

విశాఖ మైదానంతో ఎంతో అనుబంధం ఉన్న విరాట్ కోహ్లీ.. బుధవారం మ్యాచ్‌లో ఇక్కడ మరో మైలురాయి దాటాడు. ఈ వేదికపై జరిగిన గత మ్యాచ్‌లో వన్డేల్లో అత్యంత వేగంగా (205 ఇన్నింగ్స్‌ల్లో) 10 వేల పరుగులు పూర్తిచేసుకున్న కోహ్లీ.. ఈ మ్యాచ్‌తో మూడు ఫార్మాట్‌లలో కలిపి అంతర్జాతీయ క్రికెట్‌లో 400వ వన్డే ఆడాడు. 2008లో శ్రీలంకపై అరంగేట్రం చేసిన విరాట్.. ఇప్పటి వరకు 241 వన్డేలు, 84 టెస్టులు, 75 టీ20లు ఆడాడు. భారత్ తరఫున సచిన్ (664), ధోనీ (538), ద్రవిడ్ (509), అజారుద్దీన్ (433), గంగూలీ (424), కుంబ్లే (403), యువరాజ్ సింగ్ (402) మాత్రమే నాలుగొందలకంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడారు. ఓవరాల్‌గా కోహ్లీ ఈ మైలురాయి దాటిన 33వ ఆటగాడిగా నిలిచాడు.

**1**
**వన్డే క్రికెట్‌లో భారత్ తరఫున రెండు హ్యాట్రిక్‌లు నమోదు చేసిన తొలి బౌలర్‌గా కుల్దీప్ నిలిచాడు**

### కెప్టెన్‌లు గోల్డెన్ డక్



కోహ్లీ (0)

ఈ వేదికపై ఘనమైన రికార్డు ఉన్న విరాట్ కోహ్లీ ఎదుర్కొన్న తొలి బంతికే 'గోల్డెన్ డక్'గా ఔటై అభిమానులను నిరాశ పరిచాడు. రాహుల్ ఔటైన బాధ కూడా లేకుండా స్టేడియం మొత్తం విరాట్ రాకకోసం ఎదురుచూస్తుంటే.. మన సారథి అలా వచ్చి ఇలా వెళ్లాడు. విండీస్ కెప్టెన్ కూడా అచ్చం ఇలాగే ఎదుర్కొన్న తొలిబంతికే పెవిలియన్ బాట పట్టడం కొసమెరుపు. వన్డే క్రికెట్‌లో కెప్టెన్‌లిద్దరూ మొదటి బంతికే డకౌటవడం ఇదే తొలిసారి.



పొలార్డ్ (0)

**7**
**ఈ ఏడాది వన్డేల్లో రోహిత్ సెంచరీల సంఖ్య. 2019లో ఓవరాల్‌గా ఇవే అత్యధికం. విరాట్ కోహ్లీ (5 శతకాలు) రెండో స్థానంలో ఉన్నాడు.**

### స్కోరు బోర్డు

**భారత్:** రోహిత్ (సి) హోప్ (బి) కాట్రెల్ 159, రాహుల్ (సి) చేజ్ (బి) జోసెఫ్ 102, కోహ్లీ (సి) చేజ్ (బి) పొలార్డ్ 0, అయ్యర్ (సి) హోప్ (బి) కాట్రెల్ 53, పంత్ (సి) పూరన్ (బి) పాల్ 39, జాదవ్ (నాటౌట్) 16, జడేజా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:** 18, **మొత్తం:** 50 ఓవర్లలో 387/5. **వికెట్ల పతనం:** 1-227, 2-232, 3-292, 4-365, 5-373, **బౌలింగ్:** కాట్రెల్ 9-0-83-2, హోల్డర్ 9-0-45-0, పియర్ 9-0-62-0, పాల్ 7-0-57-1, జోసెఫ్ 9-1-68-1, చేజ్ 5-0-48-0, పొలార్డ్ 2-0-20-1.

**వెస్టిండీస్:** లూయిస్ (సి) అయ్యర్ (బి) శార్దూల్ 30, హోప్ (సి) కోహ్లీ (బి) కుల్దీప్ 78, హెట్‌మైర్ (రనౌట్) 4, చేజ్ (బి) జడేజా 4, పూరన్ (సి) కుల్దీప్ (బి) షమీ 75, పొలార్డ్ (సి) పంత్ (బి) షమీ 0, హోల్డర్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 11, పాల్ (బి) షమీ 46, జోసెఫ్ (సి) జాదవ్ (బి) కుల్దీప్ 0, పియర్ (సి) కోహ్లీ (బి) జడేజా 21, కాట్రెల్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:** 11, **మొత్తం:** 43.3 ఓవర్లలో 280 ఆలౌట్. **వికెట్లపతనం:** 1-61, 2-73, 3-86, 4-192, 5-192, 6-210, 7-210, 8-210, 9-260, 10-280, **బౌలింగ్:** దీపక్ 7-1-44-0, శార్దూల్ 8-0-55-1, షమీ 7.3-0-39-3, జడేజా 10-0-74-2, కుల్దీప్ 10-0-52-3, అయ్యర్ 1-0-13-0.

### సచిన్-జడేజా రికార్డు బ్రేక్

తొలి వన్డేలో అదరగొట్టిన యువ ద్వయం శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ విశాఖలో పూనకం వచ్చినవాళ్లలా విరుచుకుపడింది. అల్జారీ జోసెఫ్ వేసిన 45వ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన పంత్.. కాట్రెల్‌కు పట్టపగలే చుక్కలు చూపాడు. అతడి ఓవర్‌లో 6,0,4,6,4,4తో 24 రన్స్ రాబట్టాడు. మరుసటి ఓవర్‌లో బాదే బాధ్యత అయ్యర్ తీసుకున్నాడు. చేజ్ వేసిన 47వ ఓవర్లో అయ్యర్ 6,6,4,6,6 అరుసుకోవడంతో మైదానం మోత మోగిపోయింది. ఈ ఓవర్‌లో మరో 3 పరుగులు కూడా రావడంతో.. మొత్తం 31 పరుగులు మన ఖాతాలో చేరాయి. వన్డేల్లో ఒక ఓవర్‌లో టీమిండియాకు ఇదే అత్యధిక స్కోరు. దీంతో 20 ఏండ్ల క్రితం సచిన్-జడేజా (28 పరుగులు) నెలకొల్పిన రికార్డు తెరమరుగైంది. చివర్లో అయ్యర్, పంత్ ఔటైనా.. జాదవ్ (16 నాటౌట్; 3 ఫోర్లు) విలువైన పరుగులు చేశాడు.



పంత్ (39)

అయ్యర్ (53)

## మానసికోల్లాసానికి క్రీడలు ముఖ్యం

### మంత్రి శ్రీనివాస్ గౌడ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిత్యం ప్రజా సేవలో నిమగ్నమయ్యే ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నగరంలోని జింఖానా మైదానంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరుసగా నాలుగో ఏడాది కూడా ఉద్యోగుల కోసం క్రీడాపోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీ ప్రసాద్, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం ముజీబ్ హుసేన్, ప్రతినిధులు ప్రభాకర్, ఉమాదేవి, కొండల్‌రెడ్డి, వరదరాజు, బాలరాజు, దేవేందర్, కుమార్, విక్రం, వెంకటేష్, గీత శంకర్ తదితరులు పాల్గొన్నారు.



**భారత అండర్-19 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకున్న తెలంగాణ ఆటగాడు ఎన్.ఠాకూర్ తిలక్ వర్మకు బుధవారం శుభాకాంక్షలు తెలుపుతూ లక్ష రూపాయాల నగదు బహుమతి అందజేస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్ తదితరులు**

## ఓవరాల్ చాంప్ నల్లగొండ

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీ



**మానకొండూర్ రూరల్:** రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో సత్తాచాటిన నల్లగొండ జిల్లా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్లో జరిగిన రాష్ట్ర పోటీలు బుధవారంతో ముగిశాయి. ఖో-ఖో పోటీల్లో జగిత్యాల, సిరిసిల్లా జిల్లాలు ఉమ్మడిగా ప్రథమ స్థానంలో, నిజామాబాద్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్‌లో నిజామాబాద్ అగ్రస్థానంలో, వరంగల్ రూరల్ ద్వితీయ స్థానంలో, కబడ్డీలో నల్లగొండ ప్రథమ, ఆదిలాబాద్ ద్వితీయ స్థానాలు దక్కించుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరై.. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారయ్యేందుకు క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ లింగయ్య, డీఈఓ దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని, డీవైఎఫ్‌వో ఆశోక్, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

### బెంగళూరు గెలుపు

**గువాహటి:** డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు ఎఫ్‌సీ ఐఎస్‌ఎల్ ఆరో సీజన్ పాయింట్ల పట్టికలో మరోసారి అగ్రస్థానానికి చేరింది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 2-0తేడాతో నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీపై విజయం సాధించింది. రెండో అర్ధభాగంలో బెంగళూరు కెప్టెన్ సునీల్ ఛెత్రి (68వ ని.లో) తొలి గోల్ చేస్తే.. అల్‌బెర్ట్ సెర్రెన్ (80వ ని.లో) ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతుండటంతో స్టేడియం వెలవెలబోయింది.

### మ్యాక్‌వెల్ '3డీ' ప్లేయర్: ఫించ్

**మెల్‌బోర్న్:** ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ త్వరలోనే జాతీయ జట్టులోకి వస్తాడని, అతడు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ సమర్థంగా చేయగల త్రీడైమెన్షన్ ప్లేయర్ అని ఆస్ట్రేలియా పరిమిత ఓవర్ల కెప్టెన్ ఆరోన్ ఫించ్ అన్నాడు. భారత పర్యటనకు ఎంపిక కానంత మాత్రాన మ్యాక్సీకి తలుపులు మూసుకుపోయినట్టు కానేకాదని బుధవారం స్పష్టం చేశాడు. మానసిక అనారోగ్యం కారణంగా ఈ ఏడాది అక్టోబర్ నుంచి మ్యాక్స్‌వెల్ క్రికెట్‌కు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే.



మ్యాక్స్‌వెల్

## వేలానికి వేళాయె..

### నేడు ఐపీఎల్ 2020 వేలం.. అదృష్టం పరీక్షించుకోనున్న 332మంది ప్లేయర్లు

**కోల్‌కతా:** స్టార్ ఆటగాళ్లపై కోట్ల వర్షం కురిపించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వేలం వచ్చేసింది. ఇప్పటి వరకు బెంగళూరులో జరిగిన ఈ తంతుకు.. మొట్టమొదటిసారిగా కోల్‌కతా వేదిక కానుంది. 332 మంది ప్లేయర్లు వేలానికి రానుండగా.. 8 జట్లలో మొత్తం 72 స్థానాలే ఖాళీగా ఉన్నాయి. ఫామ్‌లో ఉన్న విండీస్ హిట్టర్ హెట్‌మైర్ సహా ఆసీస్ స్టార్లు గ్లెన్ మ్యాక్స్‌వెల్, క్రిస్ లిన్ కోసం ఫ్రాంచైజీలు పోటీపడే అవకాశాలున్నాయి. దేశవాళీల్లో అదరగొట్టిన ప్రియం గార్గ్, యశస్వి జైస్వాల్, ఆర్. సాయి కిషోర్ లాంటి యువ ఆటగాళ్లపైనా ఫ్రాంచైజీలు ఆసక్తి చూపనున్నాయి. రాబిన్ ఊతప్ప, యూసఫ్ పఠాన్, పియూష్ చావ్లా లాంటి భారత సీనియర్లు కూడా వేలానికి అందుబాటులో ఉన్నారు.

| ఫ్రాంచైజీ | మిగిలిన సొమ్ము (రూ.కోట్లలో) | ఖాళీగా ఉన్న స్థానాలు | విదేశీ ఆటగాళ్లకు అవకాశం |
|---|---|---|---|
| పంజాబ్ | 42.70 | 9 | 4 |
| కోల్‌కతా | 35.65 | 11 | 4 |
| రాజస్థాన్ | 28.90 | 11 | 4 |
| బెంగళూరు | 27.90 | 12 | 6 |
| ఢిల్లీ | 27.85 | 11 | 5 |
| హైదరాబాద్ | 17.00 | 7 | 2 |
| చెన్నై | 14.60 | 5 | 2 |
| ముంబై | 13.05 | 7 | 2 |

#### విదేశీస్టార్లు వీరే..

వెస్టిండీస్ యువ హిట్టర్ షిమ్రన్ హెట్‌మైర్ కోసం ఫ్రాంచైజీలు తీవ్రంగా కృషి చేసే అవకాశం ఉంది. గత సీజన్ కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అతడిని రూ.4.2 కోట్లకు కొనుగోలు చేయగా.. ఐదు మ్యాచ్‌ల్లో 90 పరుగులు మాత్రమే చేసి నిరాశపరచడంతో వేలానికి వదిలేసింది. అయితే, ఇటీవల భారత్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో హెట్‌మైర్ మూడు మ్యాచ్‌ల్లో దాదాపు 150 స్ట్రయిక్ రేట్‌తో 120 పరుగులు చేయడం సహా.. తొలి వన్డేలో 85 బంతుల్లోనే శతకం బాది ఫుల్‌ఫామ్‌లో ఉన్నాడు. దీంతో బెంగళూరు సహా అతడి కోసం మిగిలిన ఫ్రాంచైజీలు పోటీ పడడం ఖాయంగా కనిపిస్తున్నది. అలాగే విండీస్ బౌలర్ కెస్రిక్ విలియమ్స్‌పైనా ఫ్రాంచైజీలు కన్నేశాయి. ఇటీవల మానసిక ఆందోళనతో క్రికెట్‌కు దూరమైన ఆసీస్ స్టార్ ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్ వేలంలో ప్రముఖ ఆటగాడిగా ఉండగా.. ఆ దేశం నుంచి ఆరోన్ ఫించ్, క్రిస్ లిన్, కమిన్స్, హేజిల్‌వుడ్ కూడా బరిలో ఉన్నారు. శ్రీలంక సీనియర్ ప్లేయర్ ఏంజెలో మాథ్యూస్, సఫారీ పేసర్ స్టెయిన్ ప్రారంభ ధర రూ.2 కోట్లతో ఉండగా.. వీరిపై ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతాయా అనేది చూడాలి. ఈసారి డబ్బు తక్కువగా ఉండడంతో ఫ్రాంచైజీలు అచితూచి ఖర్చుపెట్టే అవకాశం ఉంది.

#### ఉనాద్కట్ ధర నిలుస్తుందా..

గత సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ఉనాద్కట్‌పై ఆశ్చర్యకరంగా రూ. 11.5 కోట్లు వెచ్చించింది. కానీ అతడు అనుకున్న స్థాయిలో రాణించలేకపోవడంతో వేలానికి విడుదల చేసింది. ఈ వేలంలో అంత ధర పలకడం పక్కన పెట్టి అతడివైపు ఫ్రాంచైజీలు మొగ్గుచూపుతాయా అనేది తేలాల్సి ఉంది. ఇక సీనియర్ ప్లేయర్ ఊతప్పను కోల్‌కతా విడుదల చేయగా అతడి ప్రారంభ ధర రూ.1.5 కోట్లుగా ఉంది.



హెట్‌మైర్

పియూష్ చావ్లా, యూసఫ్ పఠాన్, హనుమ విహారి వేలం బరిలో ఉండగా టెస్టు స్పెషలిస్ట్ పుజారా మళ్లీ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. దేశవాళీ స్టార్లలో ముంబై ఓపెనర్ యశస్వి జైశ్వాల్, అండర్-19 ప్రపంచకప్ జట్టు కెప్టెన్ ప్రియం గార్గ్, తమిళనాడు స్పిన్నర్ ఆర్.సాయి కిషోర్, బెంగాల్ పేసర్ ఇషాన్ పోరెల్ కోసం ఫ్రాంచైజీలు పోటీ పడే అవకాశం ఉంది. **ముఖ్యమైన ఆటగాళ్లు వీరే:** మ్యాక్స్‌వెల్, ఫించ్, కమిన్స్, కారీ, క్రిస్ లిన్ (ఆస్ట్రేలియా), మోర్గాన్, వోక్స్, రాయ్, సామ్ కరన్ (ఇంగ్లండ్), హెట్‌మైర్, కాట్రెల్, కెస్రిక్ (వెస్టిండీస్), స్టెయిన్, మోరిస్ (దక్షిణాఫ్రికా).

### సఫారీ బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా కలీస్



**జొహన్నెస్‌బర్గ్:** వరుస పరాజయాలతో సతమతమవుతున్న దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు దిద్దుబాటు చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మాజీ వికెట్‌కీపర్ మార్క్ బౌచర్‌ను ఇటీవలే హెడ్‌కోచ్‌గా నియమించిన క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్ఏ).. తాజాగా దిగ్గజ ఆల్‌రౌండర్ జాక్వస్ కలీస్‌ను బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా నియమించింది. ఈ సీజన్ వరకు అతడు ఈ బాధ్యతలు నిర్వర్తిస్తాడని సీఎస్ఏ ట్విట్టర్‌లో పేర్కొంది. రిటైర్మెంట్ ప్రకటించిన ఏబీ డివిలీయర్స్‌ను తిరిగి జాతీయ జట్టులోకి తేవాలని యత్నిస్తున్న కొత్త కోచ్ బౌచర్ సలహా మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. అన్ని ఫార్మాట్‌లలో కలిపి 519 అంతర్జాతీయ మ్యాచ్‌లాడిన కలీస్.. 25,534 పరుగులు చేయడంతో పాటు 577 వికెట్లు పడగొట్టాడు. 'ఆల్‌రౌండర్ కలీస్‌ను బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా నియమించాం. ఈ సమ్మర్ సీజన్‌లో అతడు జట్టుతో కలిసి పనిచేస్తాడు. ఈ నియామకం బుధవారం నుంచే అమల్లోకి వస్తుంది' అని సీఎస్ఏ తెలిపింది.

### టోక్యో టికెట్లు కష్టమే..

**టోక్యో:** టోక్యో ఒలింపిక్స్ (2020) టికెట్లు సొంతం చేసుకోవడం క్రీడాభిమానులకు కష్టతరంగా మారింది. ముఖ్యంగా స్వదేశంలో జరిగే విశ్వక్రీడలను చూడాలని జపాన్ ప్రజలు వేయికండ్లతో వేచిచూస్తున్నారు. 10 లక్షల టికెట్ల కోసం తాజాగా లాటరీ నిర్వహించగా.. 2 కోట్ల 30 లక్షల మంది జపాన్ ప్రజలు పోటీ పడ్డారు. లాటరీల ద్వారా ఆతిథ్య దేశ ప్రజలకు ఇప్పటికే 35.7 లక్షల టికెట్లను అందించగా.. వాటి కోసం దాదాపు 6 కోట్ల మంది పోటీ పడ్డట్టు నిర్వాహకులు వెల్లడించారు. తర్వాతి టికెట్ల విక్రయం వచ్చే ఏడాది ప్రారంభంలో ఉండగా.. జపాన్‌తో పాటు ప్రపంచంలోని అన్ని దేశాల వారు సొంతం చేసుకునే అవకాశం ఉంది. ఇకపై లాటరీ పద్ధతిలో కాకుండా ముందుగా వచ్చిన వారికి టికెట్లు అందించనున్నారు. మొత్తంగా ఒలింపిక్స్ కోసం 78 లక్షల టికెట్లు అందుబాటులో ఉండగా 70 శాతం జపాన్ వాసులే సొంతం చేసుకునే అవకాశం ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 41,559 | 12,222 |
| ↗206 | ↗57 |
| ముడి చమురు (బ్రెంట్) | ↗ 66.33 డాలర్లు |

## టెక్ స్టార్టప్‌ల్లో ఉద్యోగాల జోరు

ఈ ఏడాది 60 వేల మందికి ఉపాధి: నాస్కాం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో టెక్నాలజీ స్టార్టప్‌లు దూసుకుపోతున్నాయి. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటి వరకు టెక్ స్టార్టప్‌లు ఏకంగా 60 వేల ఉద్యోగాలు సృష్టించాయని ఐటీ పారిశ్రామిక మండలి నాస్కాం తాజాగా వెల్లడించింది. కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్' ప్రోగ్రామ్‌లో నాస్కాం ప్రెసిడెంట్ దేబ్‌జాని ఘోష్ మాట్లాడుతూ..స్టార్టప్‌లు కూడా భారీగా ఉద్యోగాలు సృష్టిస్తున్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 60 వేల మందికి పైగా ఉపాధి కల్పించాయన్నారు. దేశంలో అతిపెద్ద 15 కంపెనీలు లక్ష మందికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే స్టార్టప్‌లు కూడా ఇంతే స్థాయిలో కల్పిస్తున్నాయని కేంద్ర ఐటీ, టెలికం మంత్రి రవి శంకర్ ప్రసాద్ తెలిపారు. దీంతో మొత్తంగా ఐటీ రంగంలో 41 లక్షల మంది ప్రత్యక్షంగాను, 1.02 కోట్ల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరంలో ఐటీ రంగంలో అవకాశాలు పెరిగాయని మంత్రి చెప్పారు.

## పన్నుదారులకు ఊరట!

వచ్చే బడ్జెట్‌లో 'వ్యక్తిగత' పన్ను తగ్గించే అవకాశం




**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు ఊరట కల్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పడిపోతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి ఇప్పటికే కార్పొరేట్, ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం..2020-21 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో వ్యక్తిగత పన్నుతోపాటు ఈక్విటీ మార్కెట్ పెట్టుబడులపై దీర్ఘకాలిక పన్నును తగ్గించే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు సూచనప్రాయంగా చెప్పాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌పై ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. ఆదాయం పన్ను తగ్గింపుపై ఇప్పటికే పలుదఫాలు చర్చించినట్లు, పన్నును తగ్గించడం ద్వారా ప్రజల చేతిలో డబ్బు పెరుగనుండటంతో వారు ఖర్చు పెట్టే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వ్యక్తిగత పన్ను తగ్గించాలని ఇదివరకే పలు విజ్ఞప్తులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మొదట్లో నూతన తయారీ సంస్థలపై విధిస్తున్న కార్పొరేట్ ట్యాక్స్‌ను 15 శాతానికి తగ్గించిన నరేంద్ర మోదీ సర్కార్..ఇప్పటికే ఉన్న సంస్థలపై విధిస్తున్న కార్పొరేట్ ట్యాక్స్‌ను 33 శాతం నుంచి 22 శాతానికి కుదించింది. పెట్టుబడులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా వచ్చే బడ్జెట్‌లో స్టాక్ మార్కెట్లో పెట్టిన పెట్టుబడులపై విధిస్తున్న దీర్ఘకాలిక మూలధన పన్నుపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని మరో ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వీటితోపాటు ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న వాటిపై విధిస్తున్న పన్నులను మార్చడానికి కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

## క్లిమామ్‌కు అంతర్జాతీయ పురస్కారం

దుబాయ్‌లో అవార్డు స్వీకరించిన అల్లోల దివ్యారెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ కేంద్రంగా వెల్‌నెస్ అండ్ ఫార్మ్స్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న క్లిమామ్‌కు అంతర్జాతీయ పురస్కారం లభించింది. హెల్త్‌కేర్ లీడర్ క్యాటగిరీలో అమెరికా, రష్యా, బ్రిటన్‌తోపాటు వివిధ దేశాలు పోటీపడగా.. క్లిమామ్‌కు టాప్ 100లో చోటుదక్కింది. బుధవారం దుబాయ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఫోరం ఆన్ అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ హెల్త్‌కేర్ (ఐఎఫ్‌ఏహెచ్) కార్యక్రమంలో క్లిమామ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డి ఈ అంతర్జాతీయ అవార్డును అందుకున్నారు. ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంలో విశేష కృషి చేసినందుకు ఈ పురస్కారం దక్కింది. అవార్డు లభించడంపై అల్లోల దివ్యారెడ్డి సంతోషం వ్యక్తంచేశారు. క్లిమామ్‌కు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు రావడంతో తమ బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు.

## ఐసీయూలో ఆర్థిక వ్యవస్థ

మాజీ ఆర్థిక సలహాదారు సుబ్రమణియన్ హెచ్చరిక



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** ఆర్థిక మాంద్యం దెబ్బ భారత్‌కు గట్టిగానే తగులబోతున్నదా! ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. ఆర్థిక వేత్తలు కూడా ఇదే తరహా భయాలను వ్యక్తంచేస్తున్నారు. మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ అయితే ఏకంగా ఆర్థిక మాంద్యం దెబ్బ గట్టిగానే తగులనున్నదని, భారత ఆర్థిక వ్యవస్థ అత్యవసర చికిత్స విభాగం(ఐసీయూ)లో ఉన్నదని వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ సర్కార్ తొలిసారి అధికారం చేపట్టినప్పుడు ఆర్థిక సలహాదారుడిగా వ్యవహరించిన సుబ్రమణియన్ గతేడాది ఆగస్టులో పదవికి రాజీనామా చేశారు. ఇంగ్లీష్ మీడియాకు రాసిన వ్యాసంలో ఆయన భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి ఇండియా హెడ్ జోష్ ఫెల్మేన్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. భారత ఆర్థిక వ్యవస్థ నాలుగు బ్యాలెన్స్ షీట్‌ల నుంచి సవాళ్లను ఎదుర్కొంటున్నదని, వీటిలో బ్యాంకులు, మౌలికం, ఎన్‌బీఎఫ్‌సీలు, రియల్ ఎస్టేట్ కంపెనీల నుంచి గట్టి సవాళ్లను ఎదుర్కొంటున్నదని వ్యాఖ్యానించారు. ఇదేమి సాధారణ మందగమనం కాదు..అతిపెద్ద సంక్షోభం ఎదుర్కొక తప్పదని హార్వర్డ్ యూనివర్సిటీకి రాసిన వ్యాసంలో ఆయన హెచ్చరించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు రెండు రకాల బ్యాలెన్స్ షీట్ సమస్యలు ఎదుర్కొంటున్నదని, వీటిలో స్టీల్, విద్యుత్, మౌలిక రంగానికి ఇచ్చిన రుణాలు వసూలు కాకపోవడంతో బ్యాంకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుండగా..పెద్ద నోట్ల రద్దు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు, రియల్ ఎస్టేట్ సంస్థలతో ఈ సమస్య మరింత జఠిలమైందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను భారత్ వృద్ధి ఆరేండ్ల కనిష్ఠ స్థాయి 4.5 శాతానికి పడిపోయిన విషయం తెలిసిందే. వరుసగా ఆరు త్రైమాసికాలుగా తగ్గుతూ వచ్చింది.

### ఉద్దీపనలు అవసరం లేదు..

ప్రస్తుతం ఉన్న గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కడానికి ఉద్దీపన ప్యాకేజీలు లాంటివి అవసరం లేదని, ఇదే సమయంలో వ్యక్తిగత పన్ను తగ్గించడం కానీ లేదా జీఎస్టీ రేట్లను పెంచడం చేయడం వల్ల ఒరిగేదేమి లేదని, కానీ ద్రవ్య పరపతి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించడం ఒక్కటే మంచిదని ఆయన వ్యాఖ్యానించారు. జీడీపీ, వినిమయం, ఉద్యోగ కల్పన, ఆర్థిక, మొండి బకాయిలతో సతమతమవుతున్న బ్యాంకులను గట్టెక్కించాల్సిన అవసరం ఉందన్నారు. 2017-18లో ఎన్‌బీఎఫ్‌సీలు రియల్ ఎస్టేట్ రంగానికి ఇచ్చిన రూ.5 లక్షల కోట్లు మొండి బకాయిల జాబితాలోకి వెళ్లాయి. ఆ తర్వాతి క్రమంలో ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ సంక్షోభం మొత్తం బ్యాంకింగ్ రంగాన్ని అతలాకుతలం చేసింది.

## ఆరింతలైన సైబర్ దాడులు

బీవోఐ చైర్మన్ పద్మనాభన్ వెల్లడి

**హైదరాబాద్, డిసెంబర్ 18:** బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నప్పటికీ, ఇదే సమయంలో సైబర్ దాడులు కూడా అధికమయ్యాయి. గడిచిన నాలుగేండ్లలో ఈ రంగంలో సైబర్ దాడులు ఆరింతలు పెరిగాయి. 2014లో 53 వేల దాడులు జరుగగా, 2019 నాటికి ఇవి 3.35 లక్షలకు చేరుకున్నాయని బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్, రిజర్వు బ్యాంక్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీ పద్మనాభన్ తెలిపారు. బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ లావాదేవీలు స్మార్ట్‌ఫోన్ ద్వారానే జరుపుకునేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నదని, కానీ, వీటి ఆధారంగా సైబర్ దాడులు పొంచివున్నాయని ఐడీఆర్‌బీటీలో జరిగిన 15వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సెక్యూరిటీ(ఐసీఐఎస్‌ఎస్)లో ముఖ్య అతిథిగా హాజరై ఆయన హెచ్చరించారు. సైబర్ దాడుల నుంచి ఖాతాదారుల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. కొన్నిసార్లు ఖాతాదారుల తప్పిదాల వల్ల పలు సమస్యలు తలెత్తుతాయని, వీటిని పరిష్కరించుకోవడానికి ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదన్నారు. బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు, పేమెంట్ సిస్టమ్, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థలు, స్టాక్ ఎక్స్ఛేంజ్, మ్యూచువల్ ఫండ్లు, బీమా ఇనిస్టిట్యూషన్లు, ఆర్థిక రంగానికి చెందిన ఇతర సంస్థలపై కూడా ఈ మధ్యకాలంలో దాడులు పెరిగాయన్నారు.

### కట్టుదిట్టమైన చట్టం తీసుకురావాలి..

సైబర్ దాడులను నియంత్రించడానికి ప్రభుత్వంతోపాటు ఇతర నియంత్రణ మండళ్లు కట్టుదిట్టమైన చట్టాలను తీసుకురావాల్సిన అవరం ఎంతైనా ఉందన్నారు పద్మనాభన్. 2018 సంవత్సరంలో సైబర్ దాడులు 100 శాతం కంటే అధికంగా పెరిగాయని, ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా 35 శాతం పెరిగాయన్నారు. సైబర్ దాడుల్లో అమెరికా తర్వాత భారత్‌లోనే అత్యధికమని ఆయన వ్యాఖ్యానించారు. ఖాతాదారులు నష్టపోవడంపై బ్యాంకులు కూడా బాధ్యత వహించాల్సిన అవసరం ఉన్నదని, ఇదే సమయంలో ఖాతాదారుల నిర్లక్ష్య చర్యలను కూడా తప్పుపడుతున్నట్లు చెప్పారు.

# మిస్త్రీకే టాటా పగ్గాలు

## చంద్రశేఖరన్ నియామకం చట్టవిరుద్ధం • ఎన్‌సీఎల్‌ఏటీ తీర్పు

టాటాలకు సుప్రీం కోర్టులో సవాల్ చేసుకునే అవకాశం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:**

సైరస్ మిస్త్రీకి గొప్ప ఊరట. తన తొలగింపుపై న్యాయ పోరాటం చేస్తున్న నేషనల్ కంపెనీ లా అప్పిలెట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)లో టాటాలపై ఎట్టకేలకు విజయం దక్కింది. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా మిస్త్రీని బుధవారం ఎన్‌సీఎల్‌ఏటీ పునర్నియమించింది. సంస్థ ప్రస్తుత చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ నియామకం చెల్లదంటూ తీర్పు చెప్పింది. దీంతో 110 బిలియన్ డాలర్ల విలువైన టాటా గ్రూప్ సంస్థల పగ్గాలు మళ్లీ మిస్త్రీ చేతికే వచ్చాయి. అయితే ఈ తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేసుకునే అవకాశం టాటాలకు కల్పించిన ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం.. అందుకు అనుగుణంగా నెల రోజుల తర్వాతే మిస్త్రీ పునర్నియామక ఆదేశాలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. జనవరి 18 వరకు గడువిచ్చినట్లు టాటా సన్స్ తరపు న్యాయవాది ఏఎం సింఘ్వీ తెలిపారు. ఇక మిస్త్రీ విషయంలో టాటా సన్స్ మాజీ చైర్మన్ రతన్ టాటా తీరును తప్పుబట్టిన ఎన్‌సీఎల్‌ఏటీ.. పబ్లిక్ సంస్థ నుంచి టాటా సన్స్ ప్రైవేట్‌గా మారడాన్నీ ఆక్షేపించింది. సెప్టెంబర్ 2017లో ప్రైవేటీకరణ ప్లాన్‌కు టాటా సన్స్ బోర్డు ఆమోదించిన విషయం తెలిసిందే. తనను అక్రమంగా తొలగించారంటూ నిరుడు జూలైలో ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించిన మిస్త్రీకి భంగపాటు ఎదురైన సంగతీ విదితమే. దీంతో ఎన్‌సీఎల్‌ఏటీకి వెళ్లగా, తాజా తీర్పు వచ్చింది. కాగా, ఈ తీర్పు టాటా గ్రూప్ కార్పొరేట్ గవర్నెన్స్‌పై సందేహాలను కలుగజేస్తున్నదని పలువురు పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం మిస్త్రీ.. షాపూర్జీ పల్లోంజీ అండ్ కంపెనీ ఎండీగా ఉన్నారు. తన కుటుంబానికి చెందిన షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ అనుబంధ సంస్థే ఇది. రతన్ టాటా నుంచి 2012లో టాటా సన్స్ ఆరో చైర్మన్‌గా మిస్త్రీ బాధ్యతలు స్వీకరించినది తెలిసిందే. టాటా సన్స్‌లో మిస్త్రీ కుటుంబానికి 18.4 శాతం వాటా ఉన్నది. కాగా, నానో కారు తయారీతోపాటు పలు ప్రధాన పెట్టుబడి నిర్ణయాలపై రతన్ టాటా, మిస్త్రీల మధ్య ఏర్పడిన విభేదాలు మిస్త్రీ ఉద్వాసనకు దారితీశాయి. రతన్ టాటాసహా టాటా సన్స్, 20 ఇతర సంస్థల నిర్వహణ సరిగా లేదని, తనను అన్యాయంగా తొలగించారని మిస్త్రీ ఆరోపించారు. తదనంతర పరిణామాల మధ్య ఈ వ్యవహారం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముంబై, ఢిల్లీ బెంచ్‌లకు చేరగా, అక్కడ ప్రతికూలంగా వచ్చిన తీర్పులపై ఎన్‌సీఎల్‌ఏటీలో మిస్త్రీ, ఆయన కుటుంబ సంస్థలు సవాల్ చేసి మూడేండ్ల తర్వాత విజయాన్ని అందుకున్నాయి. ఈ సందర్భంగా ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ మిస్త్రీపై చేసిన అవమానకర వ్యాఖ్యలనూ ఎన్‌సీఎల్‌ఏటీ కొట్టివేసింది.

### సుపరిపాలన విజయం: మిస్త్రీ

*ఎన్‌సీఎల్‌ఏటీ తీర్పును మిస్త్రీ స్వాగతించారు. ఈ విజయం తనది మాత్రమే కాదని, ఇది సుపరిపాలన, మైనార్టీ భాగస్వాముల హక్కులకు దక్కిన విజయంగా అభివర్ణించారు. టాటా గ్రూప్ అభివృద్ధి, సుస్థిర ప్రగతే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గ్రూప్ మాతృ సంస్థ టాటా సన్స్‌లో 50 ఏండ్లుగా ప్రధాన మైనార్టీ భాగస్వామిగా మిస్త్రీ కుటుంబం కొనసాగుతున్న విషయం తెలిసిందే.*

### న్యాయపరంగా ముందుకెళ్తాం: టాటా సన్స్

ఎన్‌సీఎల్‌ఏటీ తీర్పుపై న్యాయపరంగా ముందుకెళ్తామని టాటా సన్స్ వెల్లడించింది. మిస్త్రీ ఆశించిన దానికంటే ఎక్కువ ప్రయోజనాలు ఈ తీర్పుతో అందాయన్న టాటా సన్స్.. దీనిపై చట్టపరంగా పోరాడుతామని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. సంస్థ భాగస్వాములతో విస్తృత చర్చలు నిర్వహించాకే మిస్త్రీ విషయంలో టాటా సన్స్ నిర్ణయాలు తీసుకుందని, అయినప్పటికీ ఏ ప్రాతిపదికన ఎన్‌సీఎల్‌ఏటీ తాజా తీర్పు చెప్పిందో పరిశీలిస్తున్నామన్నది.

### వ్యాపారంపై దృష్టి: చంద్రశేఖరన్

ఎన్‌సీఎల్‌టీ ఆదేశాల నేపథ్యంలో టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖర్ స్పందించారు. గ్రూపు ఉద్యోగులు వ్యాపారంపై దృష్టి సారించాలని, అలాగే వాటాదారుల సంక్షేమానికి కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని ఉద్యోగులకు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. టాటా గ్రూపు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియామకంపై ఎన్‌సీఎల్‌ఏటీ అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో ఆయన ఈ విధంగా స్పందించారు.

### కేసు పరిణామక్రమం

- 2006లో టాటా సన్స్ బోర్డులోకి మిస్త్రీ
- నవంబర్, 2011లో డిప్యూటీ చైర్మన్‌గా నియామకం
- 2012లో సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు
- అక్టోబర్ 24, 2016న ఉద్వాసన, గ్రూప్ మధ్యంతర చైర్మన్‌గా రతన్ టాటా
- డిసెంబర్ 20, 2016న ఎన్‌సీఎల్‌టీకి వెళ్లిన మిస్త్రీ కుటుంబ సంస్థలు
- జనవరి 12, 2017న టాటా సన్స్ చైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్ నియామకం
- ఫిబ్రవరి 6, 2017న టాటా సన్స్ బోర్డులో డైరెక్టర్‌గా మిస్త్రీ తొలగింపు
- మార్చి 6, 2017న మిస్త్రీ ఫిర్యాదును కొట్టేసిన ఎన్‌సీఎల్‌టీ
- ఏప్రిల్ 27, 2017న ఎన్‌సీఎల్‌ఏటీలో సవాల్
- మే 23, 2019న విచారణ పూర్తి
- డిసెంబర్ 18, 2019న సైరస్ మిస్త్రీకి అనుకూలంగా తీర్పు విడుదల

# హమ్మయ్య.. వడ్డింపుల్లేవ్

- పన్నుల పెంపు జోలికి వెళ్లని జీఎస్టీ మండలి
- మార్చి 1 నుంచి అన్ని లాటరీలపై ఒకే పన్ను రేటు
- నేత సంచులపై పన్ను హేతుబద్ధం



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో నిర్మలా సీతారామన్ తదితరులు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** వివిధ వస్తు, సేవలపై జీఎస్టీ పెంపు, కొన్నింటికి వర్తింపు అంచనాల మధ్య సమావేశమైన జీఎస్టీ మండలి.. లాటరీ అంశం తప్ప మిగతా వాటి జోలికి వెళ్లలేకపోయింది. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నెలసరి వసూళ్లు క్షీణిస్తున్న నేపథ్యంలో ఈసారి భారీగానే వడ్డింపులుంటాయని అంతా భావించారు. అయితే అలాంటివేమీ లేకుండా జీఎస్టీ కౌన్సిల్ భేటీ ముగిసింది. దాదాపు పన్ను రేట్లను, శ్లాబులను యథాతథంగా ఉంచింది. పన్ను ఎగవేతలను అరికట్టడం ద్వారానే జీఎస్టీ ఆదాయాన్ని పెంచుకోవాలన్న నిర్ణయానికి వచ్చింది. ఆర్థిక మందగమనం వేళ పన్ను రేట్ల పెంపు మరిన్ని సమస్యలకు దారి తీస్తుందేమోనన్న భయం రాష్ర్టాల నుంచి వ్యక్తం కావడం వల్లే వెనక్కి తగ్గారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వంలో బుధవారం ఇక్కడ జీఎస్టీ మండలి 38వ సమావేశం జరుగగా.. ప్రభుత్వ, ప్రైవేట్ లాటరీలపై ఒకేవిధంగా 28 శాతం జీఎస్టీని వేయాలని నిర్ణయించారు. తొలిసారిగా ఓటింగ్ ద్వారా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 21 రాష్ర్టాలు అనుకూలంగా ఓటేశాయి. సమావేశం అనంతరం రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి 1 నుంచి దేశవ్యాప్తంగా అన్ని లాటరీలపై ఒకే పన్ను రేటు ఉంటుందని తెలిపారు. వోవెన్ (నేత), నాన్-వోవెన్ సంచులపై జీఎస్టీ రేటును హేతుబద్ధం చేశామని, 18 శాతంగా నిర్ణయించామని చెప్పారు. పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ఊతమిస్తూ ఇండస్ట్రియల్ ప్లాట్ల కోసం జరిగే దీర్ఘకాలిక లీజులపై జీఎస్టీని ఎత్తివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. జీఎస్టీ అమలు దగ్గర్నుంచి జీఎస్టీఆర్-1 దాఖలు చేయనివారిపై జరిమానాలనూ సడలించినట్లు పాండే ఈ సందర్భంగా తెలిపారు. ఇక 2017-18కి గాను జీఎస్టీఆర్ 9, 9సీ రిటర్నుల దాఖలు గడువునూ ఈ నెల 31 నుంచి జనవరి 31దాకా కౌన్సిల్ పొడిగించింది. కాగా, బుధవారం వివిధ రాష్ర్టాల, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులతో ముందస్తు బడ్జెట్ చర్చలనూ నిర్మల జరిపారు.

### పన్ను పెంచొద్దు

జీఎస్టీలో పన్నులను పెంచవద్దని, శ్లాబులను మార్చవద్దని సమావేశంలో పాల్గొన్న చాలా రాష్ర్టాల ఆర్థిక మంత్రులు నిర్మలా సీతారామన్‌కు స్పష్టం చేశారు. పన్నుల పెంపు.. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత మందగించేలా చేస్తుందని జీఎస్టీ మండలిలోని మెజార్టీ సభ్యులు అభిప్రాయపడ్డారు. అయితే జీఎస్టీ వసూళ్ల క్షీణతపైనా రాష్ర్టాలు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశాయి. అయినప్పటికీ ఆర్థిక మందగమనం వల్లే జీఎస్టీ ఆదాయం పడిపోతున్నదని, తక్కువ పన్ను రేట్ల వల్ల కాదన్నాయి. ఈ క్రమంలోనే పన్నుల పెంపు, శ్లాబుల మార్పును వారంతా తీవ్రంగా వ్యతిరేకించారు.

### కేంద్రం దివాలా

జీఎస్టీ బకాయిల జాప్యంపై రగిలిపోతున్న బీజేపీయేతర పాలిత రాష్ర్టాలు.. కేంద్రం దివాలా తీసిందంటూ తీవ్ర స్థాయిలో విమర్శించాయి. ఈ సమావేశంలో జీఎస్టీ నష్టపరిహారం చెల్లింపులపై నిర్మలా సీతారామన్ నుంచి స్పష్టమైన ప్రకటన వస్తుందని ఆశించిన వివిధ రాష్ర్టాలకు నిరాశే ఎదురైంది. గతంలో చెప్పినట్లుగానే జీఎస్టీ నష్టపరిహారం రాష్ర్టాల హక్కు అని నిర్మల పునరుద్ఘాటించారు. అయితే బకాయిలు ఎప్పట్లోగా ఇస్తామన్న దానిపై మాత్రం ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఇటీవలే కొంతమేర బకాయిలు విడుదల చేసినా.. ఇంకా ఇవ్వాల్సి ఉంది. దీంతో వాటిని వెంటనే విడుదల చేయాలని రాష్ర్టాలు డిమాండ్ చేస్తున్నాయి.



## రిలయన్సే మేటి

సంపదను పుట్టించడంలో అగ్రగామి

ఐదేండ్లలో రూ.5.6 లక్షల కోట్లు సృష్టి

మోతీలాల్ ఓస్వాల్ అధ్యయనం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** సంపద సృష్టిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అగ్రస్థానంలో నిలిచింది. 2014-19 వ్యవధిలో ఆర్ఐఎల్ రూ.5.6 లక్షల కోట్ల సంపదను సృష్టించిందని మోతీలాల్ ఓస్వాల్ తెలిపింది. మోతీలాల్ ఓస్వాల్ తమ వార్షిక సంపద సృష్టి అధ్యయనం-2019ను బుధవారం విడుదల చేసింది. టాప్-100 సంస్థలు ఈ ఐదేండ్ల కాలంలో అదనంగా రూ.49 లక్షల కోట్ల సంపదను సృష్టించాయని వెల్లడించింది. మునుపెన్నడూ ఈ స్థాయిలో సంపద సృష్టి జరుగలేదని ఈ సందర్భంగా తమ తాజా అధ్యయనంలో మోతీలాల్ ఓస్వాల్ స్పష్టం చేసింది. 'ఏడేండ్ల విరామం తర్వాత ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ మరోసారి సత్తా చాటింది. 2014-19లో అతిపెద్ద సంపద సృష్టికర్తగా నిలిచింది. మొత్తం రూ.5.6 లక్షల కోట్ల సంపద ఆర్ఐఎల్ ద్వారా పుట్టింది' అని మోతీలాల్ ఓస్వాల్ తెలియజేసింది. అత్యంత వేగంగా సంపదను సృష్టించడంలో ఇండియాబుల్స్ వెంచర్స్ వరుసగా రెండోసారి మొదటి స్థానాన్ని దక్కించుకున్నది. ఈ సంస్థ స్టాక్స్ విలువ అమాంతం పెరిగిపోవడంతోనే ఈ ఘనతను సొంతం చేసుకున్నది. ఇక ఇండస్‌ఇండ్ బ్యాంక్ అత్యంత సుస్థిర సంపద సృష్టికర్తగా నిలిచింది. సంపద సృష్టిలో ఆర్థిక రంగ సంస్థలే ముందుండగా, ప్రైవేట్ రంగ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు ఈ రంగంలో దూకుడును ప్రదర్శిస్తున్నాయి.

### ప్రభుత్వ సంస్థలు తొమ్మిదే

సంపద సృష్టిలో ప్రభుత్వ రంగ సంస్థలు వెనుకబడ్డాయి. తాజా అధ్యయనంలో టాప్-100 సంస్థల్లో కేవలం తొమ్మిది ప్రభుత్వ రంగ సంస్థలకే చోటు దక్కింది. ఇందులో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జీ, ఇంద్రప్రస్థా గ్యాస్, ఎల్ఐసీ హౌజింగ్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎన్‌బీసీసీ సంస్థలు ఉన్నాయి. 2014-19 కాలంలో మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో చోటుచేసుకున్న మార్పుల ఆధారంగా ఈ అధ్యయనాన్ని మోతీలాల్ ఓస్వాల్ చేసింది. విలీనాలు, విడదీతలు, పెట్టుబడులు, షేర్ల బైబ్యాక్ వంటి వాటినీ పరిగణనలోకి తీసుకున్నది.

## బిగ్'సి'తో క్విక్ హీల్ ఒప్పందం

**హైదరాబాద్, డిసెంబర్ 18:** ఐటీ సెక్యూరిటీ, డాటా ప్రొటెక్షన్ సేవలు అందించే క్విక్ హీల్ టెక్నాలజీస్ తాజాగా ప్రముఖ మొబైల్ విక్రయాల్లో అగ్రగామి సంస్థయైన బిగ్'సి'తో ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో బిగ్'సి'కి ఉన్న రెండు వందలకు పైగా రిటైల్ స్టోర్లలో మొబైల్ భద్రతకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు వారు పొందే ప్రయోజనాల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా క్విక్ హీల్ ఎండీ కైలాష్ కట్కర్ మాట్లాడుతూ..స్మార్ట్‌ఫోన్ ద్వారానే ఆర్థిక లావాదేవీలు జరుపుతున్న వారు తమ డాటాను భద్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు.

## జైపూర్‌లో రుపీక్ సేవలు

**జైపూర్, డిసెంబర్ 18:** బంగారం తాకట్టుపై రుణాలు అందించే రుపీక్..తాజాగా జైపూర్‌లో తన సేవలు ఆరంభించింది. ఇదివరకే హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, ఢిల్లీ, అహ్మదాబాద్, పుణె, కోయంబత్తూరు, చెన్నై, ముంబైలలో సేవలు అందిస్తున్న సంస్థ..వ్యాపార విస్తరణలో భాగంగా పింక్ సిటీలోకి ప్రవేశించింది. వచ్చే రెండేండ్లకాలంలో భారత్‌లో 100 నగరాలకు విస్తరించాలనుకుంటున్నట్లు కంపెనీ చీఫ్ మార్కెటింగ్ అధికారి కరన్ ప్రీత్ బింద్రా ఈ సందర్భంగా తెలిపారు.

# కొనసాగుతున్న ర్యాలీ




**ముంబై, డిసెంబర్ 18:**

స్టాక్ మార్కెట్ల ర్యాలీ నిరాటంకంగా కొనసాగుతున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న సూచీలు బుధవారం మరో చారిత్రక గరిష్ఠస్థాయికి ఎగబాకాయి. బ్లూచిప్ సంస్థల షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగబడటంతో వరుసగా రెండో రోజు సూచీలు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 41,614 పాయింట్ల ఆల్‌టైం హైకీ చేరుకున్న సూచీ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 206.40 పాయింట్ల లాభంతో 41,558.57 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌తోపాటు జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 56.65 పాయింట్లు అందుకొని 12,221.65 వద్ద ముగిసింది. నిఫ్టీకి కూడా ఇది జీవితకాల గరిష్ఠ స్థాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలను కొనసాగుతున్నప్పటికీ బ్లూచిప్ సంస్థల షేర్లు మాత్రం భారీగా పుంజుకుంటున్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 3.37 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. సన్‌ఫార్మా 2.53 శాతం, ఏషియన్ పెయింట్స్ 1.88 శాతం, ఐటీసీ 1.70 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.58 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 1.46 శాతం లాభపడ్డాయి. టాటా గ్రూపు చైర్మన్‌గా మళ్లీ సైరస్ మిస్త్రీని నియమిస్తూ నేషనల్ కంపెనీ లా అప్పిలెట్ ట్రిబ్యునల్ తీసుకున్న నిర్ణయం గ్రూపునకు చెందిన అన్ని షేర్లు కుదేలయ్యాయి. టాటా గ్రూపులోని టాటా పవర్, టాటా కెమికల్స్, టాటా గ్లోబల్ బెవరేజెస్ షేర్లు నాలుగు శాతానికి పైగా పతనం చెందాయి. వీటితోపాటు హెచ్‌యూఎల్, ఎస్బీఐ, యెస్ బ్యాంక్, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు రెండు శాతం వరకు క్షీణించాయి. ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన వృద్ధిరేటుకు ఊతమివ్వడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మార్కెట్లకు ఉత్తేజాన్ని ఇచ్చాయని, ముఖ్యంగా మెటల్, ఐటీ రంగ షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగబడటం, వాణిజ్య ఉద్రిక్త పరిస్థితులు కుదుటపడంతో చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయని జియోజిట్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలుండటం, జీఎస్టీ కౌన్సిల్ సమావేశంపై మదుపరులు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రంగాలవారీగా చూస్తే మెటల్, హెల్త్‌కేర్, రియల్టీ, ఇంధనం, వాహన, ఐటీ రంగ షేర్లు లాభపడగా, యుటిలిటీ, విద్యుత్, టెలికం రంగ షేర్లు ఆకట్టుకోలేకపోయాయి. కాగా, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 6 పైసలు తగ్గి 71.05 వద్ద ముగిసింది.



అమెరికాకు చెందిన ప్రొఫెసర్ ఫిలిప్ వాగ్నేర్ రాసిన 'ట్రావెల్ గైడ్ ఆన్ కాకతీయ మాన్యుమెంట్స్' అనే పుస్తకాన్ని బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ ఆర్చరీ ఫెడరేషన్ అధ్యక్షుడు పాపారావు, కాకతీయ హెరిటేజ్ సభ్యులు, పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు.

## వినోద పర్యాటకానిది మూడోస్థానం

టూరిజం జియోగ్రఫీ పుస్తకావిష్కరణలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలలో వినోద పర్యాటకానిది మూడోస్థానమని సాంస్కృతిక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రొఫెసర్ ఆనంద్ గౌడ్ రచించిన టూరిజం జియోగ్రఫీ పుస్తకాన్ని ఆయన బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఈ పుస్తకం ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.



భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శీతాకాల విడిది కోసం బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు శుక్రవారం రానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం హకీంపేట ఎయిర్‌పోర్టు నుంచి రాష్ట్రపతి నిలయం వరకు పోలీస్ బందోబస్తు మధ్య రాష్ట్రపతి కాన్వాయ్‌కు ట్రయల్ నిర్వహించిన దృశ్యం.



# కార్మికుల శ్రేయస్సుకు కృషి

- కార్మిక సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారు..
- కొచ్చిలో రీజినల్ లేబర్ కాన్ఫరెన్స్‌లో కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి

**మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల కష్టాలను తీర్చుతూ వారి శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి చెప్పారు. బుధవారం కేరళలోని కొచ్చిన్ నగరంలో నిర్వహించిన రీజినల్ లేబర్ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల కార్మికశాఖ మంత్రులతోపాటు పుదుచ్చేరి, లక్షద్వీప్ కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు హాజరై.. ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న కార్మిక సంక్షేమ పథకాలు, ఉద్యోగుల భద్రత, విధివిధానాల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుచేస్తున్నారన్నారు. గతంలో కేంద్ర కార్మికశాఖ మంత్రిగా పనిచేసిన అనుభవంతో కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు.



బుధవారం కొచ్చిలో కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి

భవన నిర్మాణరంగ బోర్డును తెలంగాణలో ఏర్పాటుచేసుకొనేందుకు కావాల్సిన మార్గదర్శకాలను ఇవ్వాలని కోరుతూ కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈఎస్ఐ భవనం పూర్తికి, డిస్పెన్సరీల ఏర్పాటుకు పెండింగ్‌లో ఉన్న ఈఎస్ఐ నిధులు విడుదలచేయాలని కోరారు.

# అంచనాలకు మించి సాగు

- 82,500 ఎకరాల్లో వరి నాట్లు
- ఆదిలాబాద్‌లో అధికంగా 145 శాతం పంటల సాగు
- పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో అత్యల్పంగా 1 శాతం
- వ్యవసాయశాఖ నివేదికలో వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

యాసంగిలో పప్పుధాన్యాల సాగు అంచనాలకు మించి సాగైంది. యాసంగిలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 31.95 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 9.92 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి విన్నవించింది. ఈ మేరకు బుధవారం నివేదిక అందజేసింది. యాసంగిలో పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 2.97 లక్షల ఎకరాలు కాగా, ఏకంగా 3.57 లక్షల (121 శాతం) ఎకరాల్లో సాగైంది. పప్పుధాన్యాల్లో అత్యంత ఎక్కువగా శనగ సాగైంది. శనగ సాధారణ సాగు విస్తీర్ణం 2.30 లక్షల ఎకరాలుగా ఉండగా, ఇప్పటివరకు ఏకంగా 3.35 లక్షల (145 శాతం) ఎకరాల్లో, వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 3.25 లక్షల ఎకరాలు కాగా, 2.70 లక్షల (83 శాతం) ఎకరాల్లో, మక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 3.77 లక్షల ఎకరాలుగా ఉండగా, 1.67 లక్షల (45 శాతం) ఎకరాల్లో సాగైనట్లు నివేదిక తెలిపింది. యాసంగిలో కీలకమైన వరి సాధారణ సాగు విస్తీర్ణం 17.07 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 82,500 ఎకరాల్లోనే (5శాతం) నాట్లు పడ్డాయి. ఈ నెలాఖరు నుంచి నాట్లు ఊపందుకొనే అవకాశాలున్నాయని వ్యవసాయశాఖ వర్గాలు చెప్తున్నాయి. ఒకవైపు దేశవ్యాప్తంగా ఉల్లి కొరత వేధిస్తుండగా.. యాసంగిలో ఉల్లి సాధారణ సాగు విస్తీర్ణం 25 వేల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 5 వేల ఎకరాలకే పరిమితమైంది. అంటే ఐదో వంతు విస్తీర్ణంలోనే ఉల్లి సాగైందని వ్యవసాయశాఖ నివేదించింది.

**ఆదిలాబాద్ జిల్లాలో అధికం**

ఆదిలాబాద్ జిల్లాలో యాసంగి పంటల సాగు ఏకంగా 141 శాతానికి చేరుకొన్నది. ఆ జిల్లాలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 54,827 ఎకరాలు కాగా, ఇప్పటివరకు ఏకంగా 77,155 ఎకరాల్లో సాగు కావడం విశేషం. పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో అత్యంత తక్కువగా ఒక శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. మంచిర్యాల జిల్లాలో రెండు శాతం, యాదాద్రి భువనగిరి జిల్లాలో నాలుగు శాతం విస్తీర్ణంలో సాగయ్యాయి. వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో మక్కజొన్న పంటపై కత్తెరపురుగు దాడి చేస్తున్నదని నివేదిక పేర్కొన్నది.

## వెటర్నరీ అసిస్టెంట్ పోస్టును టెక్నికల్ పోస్టుగా గుర్తించాలి

- పశుసంవర్ధకశాఖ సంచాలకుడికి వెటర్నరీ డిప్లొమా విద్యార్థుల విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పశుసంవర్ధకశాఖలో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులను టెక్నికల్ పోస్టులుగా గుర్తించి, వాటిని యూనివర్సిటీలో డిప్లొమా పట్టభద్రులతో భర్తీచేయాలని వెటర్నరీ డిప్లొమా విద్యార్థులు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు బుధవారం వారు మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఆ శాఖ సంచాలకుడు డాక్టర్ వీ లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఖాళీ వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులను నాలుగో తరగతి ఉద్యోగులకు పదోన్నతులిచ్చి భర్తీచేయాలనే ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు. పశుసంవర్ధక డిప్లొమా పూర్తిచేసుకొన్న 750 మంది నిరుద్యోగులుగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ సైన్స్ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి లింగరాజు, నాయకులు వెంకటేశ్, జానకీరాం, సమర్, దయానంద్, కొమ్మి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఔషధ తయారీలో కృత్రిమ మేధస్సు కీలకం

**ఐఈఈఈ సదస్సులో ప్రొఫెసర్ వివేక్ సర్కార్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఔషధాల తయారీలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ముఖ్య పాత్ర పోషిస్తున్నదని అమెరికాకు చెందిన ప్రొఫెసర్ వివేక్ సర్కార్ తెలిపారు. బుధవారం హెచ్ఐసీసీలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఐఈఈఈ) ఆధ్వర్యంలో హై పెర్ఫామెన్స్ కంప్యూటింగ్, డాటా అండ్ అనలటిక్స్‌పై మూడురోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాటా అనలటిక్స్ అంశాలపై వివిధ రంగాల్లో ప్రాముఖ్యం, అందుబాటులో ఉన్న కొత్తగా వచ్చిన సాంకేతికత పరిజ్ఞానం గురించి చర్చించారు. అల్గోరిథమ్ ఫర్ గ్రాఫ్స్, ఎమర్జింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై విపులంగా చర్చ జరిగింది. డాటా అనలటిక్స్, కంప్యూటింగ్‌లో మహిళలు అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సదస్సులో భారత్‌తోపాటు అమెరికా, చైనా, జపాన్ దేశాలకు చెందిన 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వివేక్ సర్కార్ మాట్లాడుతూ.. టెక్నాలజీలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. కంప్యూటింగ్ డాటా, అనలటిక్స్ ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను డాటా అనలటిక్స్ మరింత అధ్యయనం చేయాలని సూచించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ చిరంజీబ్‌నూర్ మాట్లాడుతూ.. ఈ సదస్సు ద్వారా అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానం, వైద్యారోగ్య, రక్షణరంగాల్లో మరింత వృద్ధి సాధించేందుకు కావాల్సిన అంశాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులతో ప్రదర్శన ఏర్పాటుచేశాయి.

# ఇంటింటికీ విజయ ఉత్పత్తులు

సంచార వాహనాల ద్వారా విక్రయాలు.. తెలంగాణ పాడి పరిశ్రమ సమాఖ్య కొత్త విధానం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విజయడెయిరీ ఉత్పత్తులను నేరుగా వినియోగదారుడి చెంతకు తీసుకెళ్లేందుకు తెలంగాణ పాడి పరిశ్రమ సమాఖ్య 'మొబైల్ ఈ-కార్ట్' పథకాన్ని రూపొందించింది. ఈ విధానం ద్వారా విజయడెయిరీ ఉత్పత్తులను మొబైల్ వాహనాల్లో నేరుగా వినియోగదారుల ఇండ్లకే చేరవేయనున్నారు. తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంతోపాటు.. పర్యావరణ హితం కోసం బ్యాటరీతో వాహనాలను నడుపనున్నారు. ఇందుకోసం 200 వాహనాలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**మొబైల్ వాహనం ప్రత్యేకత**

వాహనాన్ని ఒకసారి చార్జింగ్‌చేస్తే 100 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. వాహనంలో రెండు శీతల యంత్రాలు ఉంటాయి. ఒకదానిలో పాలు, పెరుగు, మజ్జిగ, నెయ్యి, విజయశుద్ధ జలం నిల్వ చేస్తారు. మరోదాంట్లో దూద్‌పేడ, మిల్క్‌కేక్, ఐస్‌క్రీంలు, బాదంపాలు, లస్సీ, పన్నీర్, బట్టర్ నిల్వచేస్తారు. వాహనం ఖరీదు రూ. 2.20 లక్షలు కాగా 30 శాతం సబ్సిడీతో రూ.1,57,500 కు లబ్ధిదారుడికి అందజేయనున్నారు. ఇందుకోసం ఆసక్తిగలవారు విజయడెయిరీ సంచాలకుల కార్యాలయంలో రూ. 500 చెల్లించి దరఖాస్తు ఫారం తీసుకోవాలని అధికారులు సూచించారు.

**ఇంటి వద్దకే వచ్చి విక్రయాలు**

నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఈ వాహనం ద్వారా విజయబ్రాండ్ ఉత్పత్తులను విక్రయిస్తారు. దీంతో వ్యాపారాన్ని వృద్ధిచేసుకోవచ్చని భావిస్తున్నారు. తద్వారా సంస్థకు లాభాలు రావటంతో పాటు నిరుద్యోగులకు జీవనోపాధి లభిస్తుంది. ప్రస్తుతం విజయబ్రాండ్ ఉత్పత్తులు కావాలంటే వినియోగదారులు తప్పనిసరిగా పార్లర్లు లేదా రిటైల్ దుకాణాల వద్దకు వెళ్లాల్సి వస్తున్నది. ఇకమీదట వినియోగదారులకు ఆ ఇబ్బంది తప్పనున్నది. ప్రైవేటు పాల ఉత్పత్తులు పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్న నేపథ్యంలో పోటీ తట్టుకునేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నది.

## మహిళలపై దాడులకు వ్యతిరేకంగా నేటినుంచి నిరసనలు

- ఏఐవైఎఫ్‌వై 20వ వార్షికోత్సవం సందర్భంగా కరపత్రం విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళలపై లైంగికదాడులు, హత్యలను నిరసిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్‌వై) 20వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్ తెలిపారు. బుధవారం ఓంకార్‌భవన్‌లో కార్యక్రమాల కరపత్రం విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మహిళలపై జరిగిన అత్యాచారాలు, దాడులు, హత్యలను ఖండిస్తూ ఏడురోజులపాటు అన్ని జిల్లాకేంద్రాల్లో నిరసన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.

## సీఎంఎస్ కార్యకర్తల నిర్బంధంపై పిటిషన్

- నేడు హాజరుపరుచాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) సంయుక్త కార్యదర్శులు డీ దేవేంద్ర, ఎం స్వప్న, తెలంగాణ విద్యార్థి వేదిక (టీవీవీ) జనరల్ సెక్రటరీ సందీప్‌ను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని పేర్కొంటూ సంఘం అధ్యక్షురాలు అనిత బుధవారం హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలుచేశారు. కారణాలు వివరించకుండా పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారని, బాధితుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించారని చెప్పారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్ నేతృత్వంలోని ధర్మాసనం.. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను గురువారం కోర్టులో హాజరుపర్చాలని పోలీసులను ఆదేశించింది.

# రాజధానులు అక్కడ ఉండొచ్చు.. ఉండకపోవచ్చు!

- ఏపీ మంత్రి పేర్ని నాని



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధానిపై సీఎం జగన్ ఏమి ప్రకటించారని ఇంత ఆందోళన చేస్తున్నారని మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. ఏపీకి మూడు రాజధానులు రావొచ్చు అని సీఎం మంగళవారం అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో రాజధాని ప్రాంత రైతులు బుధవారం కృష్ణాయపాలెం, మందడం, వెలగపూడిలో రోడ్లపైకి వచ్చి ధర్నాకు దిగారు. దీనిపై స్పందించిన మంత్రి అమరావతిలోని సచివాలయంలో మాట్లాడుతూ.. మూడుచోట్ల రాజధానులు ఉండొచ్చు అని మాత్రమే సీఎం చెప్పారని అన్నారు. రాజధానులు అక్కడ ఉండొచ్చు.. ఉండకపోవచ్చునని పేర్కొన్నారు. చంద్రబాబును నమ్మి మోసపోయిన రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామని తెలిపారు. జగన్ మాటిస్తే దానిపైనే నిలబడుతారని, నిపుణుల కమిటీ నివేదిక రావాల్సి ఉన్నది చెప్పారు. టీడీపీ నేతలు భూములు కొన్నారని రాజధాని మార్చడం లేదని, రాజధాని ప్రాంతంలో వంద శాతం అక్రమాలు జరిగాయన్నారు. అక్రమార్కులను గుర్తించి అవసరమైతే జైలుకు పంపుతామని వ్యాఖ్యానించారు.

**అయోమయ ప్రకటనలతో నష్టం: విపక్షాలు**

ఏకపక్ష నిర్ణయాలతో రాష్ట్రానికి నష్టమని, పరిపాలన వికేంద్రీకరణ కాదు.. అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. ఒక వ్యూహం ప్రకారమే మూడు రాజధానుల ప్రకటన చేశారని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. రాజధానిపై అయోమయ ప్రకటనలతో ఏపీకి నష్టమని, పెట్టుబడులు తరలిపోయే ప్రమాదం ఉన్నదని జయప్రకాశ్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. ఐదేండ్ల పాలనలో చంద్రబాబు ప్రజలకు వైకుంఠం చూపిస్తే.. మూడు రాజధానుల పేరుతో జగన్ కైలాసం చూపిస్తున్నారని కాంగ్రెస్ నేత తులసిరెడ్డి విమర్శించారు. రాజధానిపై వైఎస్సార్సీపీ కుట్రలు చేస్తున్నదని టీడీపీ నేత దేవినేని ఉమా ఆగ్రహించారు. ఏపీని దక్షిణాఫ్రికాతో పోల్చడంపై మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. రాజధానిని మార్చే అవకాశం ఉన్నదని, కర్నూలులో హైకోర్టు ఏర్పాటును స్వాగతిస్తున్నామని బీజేపీ నేత జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. మూడు రాజధానులు అనడం సముచితం కాదన్నారు. బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సీఎం జగన్ మూడు రాజధానుల ప్రకటనను బీజేపీ ఎంపీ టీజీ వెంకటేశ్ స్వాగతించారు.

**రాజధాని గ్రామాల్లో నేడు బంద్**

సీఎం జగన్ ప్రకటనపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ రాజధాని ప్రాంత రైతులు గుంటూరు జిల్లా ఉద్దండరాయునిపాలెంలో అమరావతికి శంకుస్థాపనచేసిన చోట సమావేశమయ్యారు. సీఎం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, రాజధానిగా అమరావతిని కొనసాగించాలని డిమాండ్‌చేశారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించిన రైతులు.. రాజధాని పరిధిలోని అన్ని గ్రామాల్లో గురువారం బంద్ పాటించాలని నిర్ణయించారు.



కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తారనే ప్రచారంతో నంద్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వీట్లు తినిపించుకుంటున్న న్యాయవాదులు

# బూట్లు నాకే పోలీసులను తెచ్చుకుంటాం!

**త్వరలోనే అధికారంలోకి వస్తాం.. టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యలు**



**అనంతపురం:** 'ఇప్పుడున్న పోలీసులు వైఎస్సార్సీపీ నేతలకు వంగి వంగి దండాలు పెడుతున్నారు. మేము త్వరలోనే అధికారంలోకి వస్తాం. అప్పుడు మా బూట్లు నాకే పోలీసులను తెచ్చుకుంటాం. మీ అంతు చూస్తా. మీ జేబుల్లో గంజాయి పెట్టించి కేసుల్లో ఇరికిస్తాం' అని టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలుచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం అనంతపురం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసులతోపాటు ఏకంగా చంద్రబాబును సైతం విమర్శించారు. చంద్రబాబు ఎప్పుడూ శాంతి వచనాలు చెప్తుంటారని, శాంతి వచనాలు చెప్పి తమను చంకనాకించారని, ఇకనైనా తమ బాధలు చూసి ఆ ప్రకారం వ్యవహరించండి అని సూచించారు. జగన్ ఎలాంటివాడో తాను గతంలోనే చెప్పానని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలో ఉన్న 10శాతం మంచిగుణాలు కూడా జగన్‌లో లేవని, అచ్చం రాజారెడ్డిలాంటివాడు అని వివరించారు. చంద్రబాబులో కూడా మార్పురావాలని, సాధుజంతువులా ఉండకూడదు అన్నారు. రెండున్నరేండ్లలోనే ఎన్నికలు వస్తాయని, అప్పుడు అధికారం తమదేనని చెప్పారు. తమ పార్టీ ఎమ్మెల్యేలకు చాలామందికి టికెట్టు ఇవ్వొద్దని చెప్పానని, కానీ చంద్రబాబు తన మాట వినలేదని పేర్కొన్నారు.

## నేడు తిరుపతిలో శారదా పీఠార్చన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి హిందూ ధర్మ ప్రచారయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో గురువారం రాజశ్యామల స్వరూప శారదా చంద్రమౌళీశ్వరులకు పీఠార్చన నిర్వహించనున్నారు. తిరుపతిలోని పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే కార్యక్రమంలో స్థానికులు భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు. విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వామిస్వరూపానందేంద్ర సరస్వతి బుధవారం తిరుమలకు చేరుకోగా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అలిపిరి వద్ద స్వాగతం పలికారు. టీటీడీ జేఈఓ ధర్మారెడ్డి, డాలర్ శేషాద్రి వారికి ఆలయ మర్యాదలు చేశారు. మంత్రి బుగ్గన, టీటీడీబోర్డు సభ్యులు నాదెండ్ల సుబ్బారావు, శేఖర్‌రెడ్డి, విశాఖ శారదాపీఠం ట్రస్టీలు, హిందూధర్మ ప్రచారయాత్ర సమన్వయకర్త శివభారత్‌రెడ్డి స్వామిని కలిసి ఆశీస్సులు పొందారు.



తిరుమలలో స్వరూపానందేంద్ర సరస్వతికి స్వాగతం పలుకుతున్న స్వాత్మానందేంద్రసరస్వతి

## వచ్చే ఏడాది నుంచే ఇంటర్‌లో కొత్త కోర్సులు

- ఐసీఏఐ సహకారంతో లెక్చరర్లకు అకౌంటింగ్, టాక్సేషన్, ఐటీలో శిక్షణ
- సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కామర్స్ ఏర్పాటుపై ఇంటర్ విద్యాశాఖ కసరత్తు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో కొత్తగా అకౌంట్స్, టాక్సేషన్, ఐటీ వంటి నూతన కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ చర్యలు తీసుకుంటున్నారు. 2020-21 విద్యా సంవత్సరం నుంచే అమలుకు నిర్ణయించారు. ఈ కోర్సులు బోధించడానికి ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్లకు సోమవారం నుంచి ప్రారంభమైన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రీలోని కోఆపరేటీవ్ ట్రైనింగ్ కేంద్రంలో శిక్షణ ఇచ్చామని ఇంటర్‌విద్యా కమిషనర్ సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సహకారంతో లెక్చరర్లకు శిక్షణ ఇచ్చామని, ఈ నేపథ్యంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కామర్స్ ఏర్పాటుచేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత పారిశ్రామికరంగానికి అవసరమైన విధంగా అకౌంట్స్ రంగంలో గ్రామీణ యువతకు నైపుణ్యాలు, ఆచరణాత్మక జ్ఞానం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు చార్టెర్డ్ అకౌంటెంట్లతోపాటు ఇంటర్‌విద్యా అధికారులు డీడీ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ పరిధిలోకి ప్రైవేటు స్కూల్స్

- బడులకు రెన్యువల్స్, తరగతుల అప్‌గ్రెడేషన్ వంటి సేవలు
- తక్షణమే అమలులోకి తీసుకొచ్చిన పాఠశాల విద్యాశాఖ
- రాష్ట్రంలోని పదివేలకుపైగా ప్రైవేటు స్కూళ్లకు ప్రయోజనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ మరో ముందడుగు వేసింది. మరింత పారదర్శక పాలనకు చర్యలు చేపట్టింది. ప్రైవేటు స్కూళ్లకు సంబంధించిన అన్నిరకాల సేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చింది. టీఎస్‌టీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ప్రైవేటు స్కూళ్లకు సేవలు అందిస్తున్నది. ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలతో తాజాగా నిర్వహించిన సమావేశంలో ఆన్‌లైన్ సేవల అంశాన్ని ప్రస్తావించగా.. పూర్తిస్థాయిలో సహకరిస్తామని చెప్పినట్టు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పది వేలకుపైగా ప్రైవేటు స్కూళ్లు ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ప్రతి స్కూల్‌కు యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు. ప్రైవేటు స్కూళ్లకు నోటీసులు, సర్క్యులర్లు, లేఖలు, ప్రణాళికలు వంటి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. ప్రైవేటు స్కూళ్ల యూజర్ ఐడీ సహకారంతో వెబ్‌సైట్‌కు లాగిన్‌నై విద్యాశాఖ సమాచారాన్ని తెలుసుకోవడం, పాటించడం జరుగుతున్నది. ఆన్‌లైన్ సేవల వల్ల స్కూల్ యాజమాన్యాలు విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన అవసరం ఉండదు. కొత్త స్కూళ్లకు అనుమతి, పాతస్కూళ్లకు రెన్యువల్స్, తరగతుల అప్‌గ్రెడేషన్ వంటి సేవలు అందించడం సులభమవుతుంది.

**ప్రైవేటు కాలేజీల సేవలు ఆన్‌లైన్‌లోనే..**

రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాబోర్డు పరిధిలోని ప్రైవేటు జూనియర్ కాలేజీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, యూనివర్సిటీల పరిధిలోని ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఇతర వృత్తి విద్యా కాలేజీలకు సంబంధించిన సేవలన్నీ కూడా ఇప్పటికే ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఆన్‌లైన్ సేవల వల్ల ప్రైవేటు కాలేజీల సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపడానికి అవకాశం కలుగుతున్నది.

## 21న హుస్సేన్‌సాగర్ పడవలో చర్చాగోష్ఠి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'చారిత్రక కల్పన - ఆధునిక విధానాల ఆవశ్యకత' అనే అంశంపై ఈ నెల 21న హుస్సేన్‌సాగర్‌లోని భాగమతి క్రూయిజ్‌లో చర్చాగోష్ఠి జరుగనున్నట్టు నిర్వాహకులు సాయి పాపినేని తెలిపారు. లుంబినీ పార్కులోని పడవ జెట్టినుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు క్రూయిజ్ ప్రారంభంకానున్నదని చెప్పారు.

## అపాయింట్‌మెంట్ సస్పెన్షన్‌పై వివరణ ఇవ్వండి

ప్రొబేషనరీ ఐపీఎస్ కేసులో కేంద్రానికి క్యాట్ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అఖిల భారత సర్వీసు నిబంధనల ప్రకారం అధికారులను సర్వీస్ నుంచి మాత్రమే సస్పెండ్ చేయాలని, అపాయింట్‌మెంట్ మీద సస్పెన్షన్ విధించడంపై వివరణ ఇవ్వాలని హైదరాబాద్ సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్ (క్యాట్).. కేంద్ర హోంశాఖకు ఆదేశాలు జారీచేసింది. అపాయింట్‌మెంట్ మీద కేంద్ర హోంశాఖ సస్పెన్షన్ విధించడంపై ప్రొబేషనరీ ఐపీఎస్ కేవీ మహేశ్వర్‌రెడ్డి క్యాట్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ సందర్భంగా పైమేరకు ఆదేశించింది. మరోవైపు భావనతో మహేశ్వర్‌రెడ్డి పెండ్లి జరిగిన విషయం వాస్తవమేనని, విడాకులు ఇస్తాననే ఆందోళనతోనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిందని మహేశ్వర్‌రెడ్డి తరపు న్యాయవాది క్యాట్‌కు వివరించారు.

# విద్యార్థులు తక్కువైతే.. ఖర్చు ఎక్కువ

- విద్యార్థులు ఎక్కువైతే.. భారీగా తగ్గిన ఖర్చు
- ప్రతి టీచర్‌పై ఏటా సగటున రూ.5,78,772 ఖర్చు
- జేపాల్ సంస్థ సర్వేలో ఆసక్తికర అంశాలు వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రభుత్వానికి ఎంత ఖర్చువుతున్నది' అనే అంశంపై జేపాల్ అనే సంస్థ నిర్వహిస్తున్న సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. సర్వే ప్రాథమిక వివరాలను నిర్వాహకులు తాజాగా విద్యాశాఖకు తెలిపారు. 30 మందిలోపు పిల్లలున్న పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై రూ.63,637 ఖర్చవుతున్నదని, రాష్ట్రంలో ఇలాంటి స్కూళ్లు 9,505 ఉన్నాయని పేర్కొన్నారు. 30-100లోపు విద్యార్థులున్న పాఠశాలల్లో ఒక్కరికి రూ.39,814 ఖర్చు వస్తున్నదని, ఇలాంటి స్కూళ్లు 17,808 ఉన్నాయని వెల్లడించారు. 100 - 200 విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ప్రతివిద్యార్థిపై రూ.30,234 వ్యయం అవుతున్నదని, విద్యార్థుల సంఖ్య 200 దాటే స్కూళ్లలో రూ.22,715 ఖర్చు వస్తున్నదని వివరించారు. ఏడాదిలో 1,37,471 మంది టీచర్ల కోసం రూ.7,956.44 కోట్లు విద్యాశాఖ ఖర్చు పెడుతున్నట్టు చెప్పారు. ప్రతి టీచర్‌పై సగటున రూ.5,78,772 వెచ్చిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 24,550 ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయల కోసం పెట్టిన ఖర్చు వివరాలను విద్యాశాఖకు వెల్లడించారు.

## మద్యంమత్తులో తండ్రిని చంపిన కొడుకు

**రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో దారుణం**

**హయత్‌నగర్:** మద్యంమత్తులో కన్నతండ్రినే రోకలితో మోది చంపిన ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాలకు చెందిన గ్యారపల్లి రాంనర్సయ్య (52) బతుకుదెరువు కోసం 20 ఏండ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. ఆయనకు భార్య, కొడుకు విష్ణు (25), కూతురు ఉన్నారు. మూడురోజుల క్రితం కుటుంబంతో కలిసి హయత్‌నగర్ బృందావన్‌కాలనీకి మారాడు. రాంనర్సయ్య పెయింటర్‌కాగా, విష్ణు ఓ ట్రావెల్స్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, కూతురు వేరేఊరికి వెళ్లడంతో తండ్రి కొడుకు కలిసి మంగళవారం మధ్యాహ్నం నుంచే మద్యం తాగారు. రాత్రి 11:30 గంటల సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. తాగిన మైకంలో విష్ణు రోకలితో రాంనర్సయ్య తలపై కొట్టడంతో అతడు ఒక్కసారిగా నేలకొరిగాడు. విష్ణు మద్యం మత్తులోనే నిద్రపోయాడు. తెల్లవారుజామున నిద్రలేచి చూడగా తండ్రి స్పృహలో లేడు. 108కు ఫోన్‌చేయగా వారు పరిశీలించి మృతిచెందినట్టు ధ్రువీకరించారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

## 'పౌరసత్వ సవరణ'పై అనుకూల, వ్యతిరేక ర్యాలీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైకోర్టు న్యాయవాదుల బృందం రెండువర్గాలుగా విడిపోయి పౌరసత్వ సవరణ చట్టానికి అనుకూలంగా, వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు. 'భారత్‌ను రక్షించండి, సీఏఏను వెనకకు తీసుకోండి' అంటూ ఓ వర్గం న్యాయవాదులు ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేశారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకురావడంపై మరోవర్గం న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు. 'భారత్ మాతాకీ జై, రోహింగ్యా ముస్లింలను వెళ్లగొట్టాలి' అంటూ నినదించారు.

నమస్తే తెలంగాణ WWW. NTNEWS.COM

# జిందగీ

గురువారం 19 డిసెంబర్ 2019 కరీంనగర్ /nt.zindagi

ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు అట్టహాసంగా జరుగనున్నాయి. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ చకచకా సాగుతున్నాయి. మగవాళ్లంతా మిగతా పనుల్లో ఉంటే మహిళలు మాత్రం పండుగకు ఎలాంటి వంటలు చేయాలని ఆలోచిస్తున్నారు. మిగిలిన రోజులు ఎలా అయినా ఫర్వాలేదు. వేడుక రోజైనా మీ కుటుంబసభ్యుల కోసం స్వయంగా స్వీట్లు చేసి తినిపిస్తే వాళ్లెంతో సంతోషిస్తారు. ఈ స్వీట్లతో క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోండి.

# క్రిస్మస్‌కు క్రిస్పీస్వీట్స్!





## షుగర్‌కుకీ, జింజర్ కుకీ

**కావాల్సినవి :**

మైదాపిండి : 4 కప్పులు
బేకింగ్ సోడా : అర టీస్పూన్
బటర్ : 2 పెద్దస్లైడులు
మెత్తటి చక్కెర : 1 కప్పు
వెనిలా ఎక్స్‌ట్రాక్ట్ : 2 టీస్పూన్లు
కోడిగుడ్డు : 1
అల్లం పౌడర్ : 1 టీస్పూన్
దాల్చిన చెక్కపొడి : 1 టేబుల్ స్పూన్
సాండింగ్ షుగర్ : సరిపడా
ఉప్పు : తగినంత

**తయారీ :**

ముందుగా ఒక గిన్నెలో మైదాపిండి, బేకింగ్‌సోడా, ఉప్పు వేసి కలపాలి. మరొక గిన్నెలో బట్టర్, మెత్తటిచక్కెర వేసి కలపాలి. ఆ తర్వాత వెనిలా ఎక్స్‌ట్రాక్ట్, గుడ్డు మిశ్రమం వేసి నెమ్మదిగా కలపాలి. ముందుగా కలిపిన పిండిని ఇందులోవేసి ముద్దగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని మూడు ముద్దలుగా చేసి రెండుముద్దలను కవర్‌లో చుట్టి 30 నిమిషాలపాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. మూడో ముద్దను జింజర్‌బ్రెడ్‌కు వాడాలి. దీనికి దాల్చినచెక్క పౌడర్, అల్లంపౌడర్ వేసి కలిపి 30 నిమిషాలపాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. ఈ రెండింటినీ బయటకు తీసాక చపాతీలా, కొంచెం మందంగా రుద్దుకోవాలి. దానిని నచ్చిన సైజులో కట్‌చేసుకొని వాటిపై సాండింగ్ షుగర్‌తో అలంకరించుకోవాలి. దీన్ని మరలా 15 నిమిషాలు ఫ్రిజ్‌లో పెట్టి తర్వాత 10 నిమిషాటు ఓవెన్‌లతో పెట్టుకుంటే షుగర్‌కుకీ, జింజర్‌కుకీ రెడీ!



## రోజ్ కుకీ

**కావాల్సినవి :**

పాలు : 1 కప్పు
కోడిగుడ్డు : 1
మెత్తటి చక్కెర : 4 టేబుల్‌స్పూన్లు
ఏలకులపొడి : ఒకటిన్నర టీస్పూన్
మైదాపిండి : 1 కప్పు
నూనె : సరిపడా
ఉప్పు : తగినంత

**తయారీ :**

గిన్నెలో పాలు, గుడ్డు, ఏలకులపొడి, మెత్తటిచక్కెర, ఉప్పు వేసి కలపాలి. అందులోనే మైదాపిండి వేసి లూజ్‌గా కలుపుకోవాలి. తర్వాత కడాయిలో నూనె వేడిచేయాలి. రోజ్‌కుకీ సైజులో ఉండే అచ్చుని నూనెలో 15 నిమిషాలపాటు ముంచాలి. తర్వాత అచ్చుని మిశ్రమంలో ముంచి నూనెలో పెడితే వేడికి ఆ మిశ్రమం రోజ్‌కుకీలా వస్తుంది. ఇవి బ్రౌన్‌రంగులోకి మారాక ప్లేట్‌లో సర్వ్ చేసుకోవాలి.

## మార్జిపాన్స్



**కావాల్సినవి :**

**జీడిపప్పు పౌడర్** : ఒకటిన్నర కప్పు, **చక్కెర** : 4 టేబుల్‌స్పూన్లు, **నీరు** : 4 టేబుల్‌స్పూన్లు, **వెనిలా ఎక్స్‌ట్రాక్ట్** : 1 టీస్పూన్, **నెయ్యి** : 1 టీస్పూన్, **ఫుడ్‌కలర్** : కావాల్సిన రంగు, **రబ్బరుఅచ్చు** : 1

**తయారీ :**

కడాయిలో నీరు వేడిచేయాలి. అందులో చక్కెర వేసి మరిగించాలి. చక్కెర కరిగిన తర్వాత జీడిపప్పు పౌడర్‌వేసి కలపాలి. మిశ్రమం దగ్గరపడ్డాక నెయ్యి, తర్వాత వెనిలా ఎక్స్‌ట్రాక్ట్ వేసి మిశ్రమం ముద్దలా అయ్యేవరకు ఉడికించి దించేయాలి. ఈ మిశ్రమం చేతితో ఉండలు వచ్చేలా ఉండాలి. ఈ మిశ్రమాన్ని రెండు బౌల్స్‌లోకి తీసుకొని వాటిలో నచ్చిన ఫుడ్‌కలర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని రబ్బరు అచ్చులోకి తీసుకోవాలి. తర్వాత 30 నిమిషాలపాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. అలా కాకపోయినా మిశ్రమాన్ని చేతితో రౌండ్లు చేసుకోవచ్చు. ఫ్రిజ్ నుంచి తీసాక కావాల్సిన షేప్‌లో ఎంతో రుచికరమైన మార్జిపాన్‌ను తినేయొచ్చు.

## సిరిముగ్గు

15 చుక్కలు
7 వరుసలు
7 వచ్చే వరకు





బలుపాల
సునీత సుధాకర్,
పెబ్బేరు గ్రామం,
వనపర్తి జిల్లా

**ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:**

సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నం-10, హైదరాబాద్ -500034.
zindagi.nt@gmail.com



II. నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
గురువారం 19 డిసెంబర్ 2019


కృష్ణ, రాజ్‌తరుణ్, దిల్‌రాజు

# జయాపజయాల్ని బేరీజు వేయను

'ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ ఇది. ప్రతి ఒక్కరి మనసుల్ని కదిలిస్తుంది' అని అన్నారు దిల్‌రాజు. ఆయన సమర్పకుడిగా వ్యవహరిస్తున్న చిత్రం 'ఇద్దరి లోకం ఒకటే'. రాజ్ తరుణ్, షాలినిపాండే జంటగా నటించారు. శిరీష్ నిర్మిస్తున్నారు. జీఆర్ కృష్ణ దర్శకుడు. ఈ నెల 25న విడుదలకానుంది. మంగళవారం ట్రైలర్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'జయాపజయాల్ని బేరీజు వేసుకొని సినిమాలు చేయను. ఆ నమ్మకంతోనే రాజ్‌తరుణ్‌తో ఈ సినిమాను నిర్మించాను. హీరోగా అతడిని కొత్త పంథాలో ఆవిష్కరిస్తుంది. మిక్కీ జే మేయర్ చక్కటి బాణీలను అందించారు. 'ఎఫ్-2', 'మహర్షి' తర్వాత మా సంస్థకు ఈ ఏడాది హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తుందనే నమ్మకముంది' అని తెలిపారు. స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రమిదని రచయిత అబ్బూరి రవి అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'కథానాయిక పాత్రకు షాలినిపాండే న్యాయం చేస్తుందా? లేదా? అని తొలుత సంశయించాం. కానీ మా అంచనాల్ని తప్పని నిరూపిస్తూ గొప్పగా నటించింది. ఛాయాగ్రాహకుడు సమీర్‌రెడ్డి దృశ్యకావ్యంలా ఈ సినిమాను రూపొందించారు. 47 రోజుల్లో షూటింగ్ పూర్తిచేశాం' అన్నారు. 'హృద్యమైన ప్రేమకథ ఇది. థియేటర్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా కథ, పాత్రలు ప్రతి ఒక్కరికి గుర్తుండిపోతాయి. ప్రేమకథతో సహానుభూతి చెందుతారు' అని రాజ్‌తరుణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బెక్కెం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# శివనిర్వాణ దర్శకత్వంలో..

సినిమాల జోరును పెంచుతున్నారు విజయ్‌దేవరకొండ. నవ్యమైన కథాంశాలతో వరుసగా సినిమాల్ని అంగీకరిస్తున్నారు. విజయ్‌దేవరకొండ కథానాయకుడిగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కనున్నది. శివనిర్వాణ దర్శకత్వం వహించనున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మించనున్నారు. నిర్మాత దిల్ రాజు పుట్టినరోజును పురస్కరించుకొని బుధవారం ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. 2020లో చిత్రీకరణ ప్రారంభంకానుంది. త్వరలో ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని వెల్లడిస్తామని చిత్ర బృందం తెలిపింది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించనున్న 12వ సినిమా ఇది. ఈ సందర్భంగా దిల్‌రాజుకు ట్విట్టర్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు అందజేసిన ఆయన 'బ్లాక్‌బస్టర్ గిఫ్ట్ లోడింగ్. మీపై ఎంతో ప్రేమ,అభిమానం ఉంది' అంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం 'వరల్డ్‌ఫేమస్‌లవర్' సినిమాతో బిజీగా ఉన్నారు విజయ్‌దేవరకొండ. ఈ సినిమాతో పాటు పూరిజగన్నాథ్ దర్శకత్వంలో 'ఫైటర్' సినిమా చేయనున్నారు.


విజయ్‌దేవరకొండ


రామ్‌చరణ్, వెంకటేష్‌లతో కలిసి డ్యాన్స్ చేస్తున్న సల్మాన్‌ఖాన్

# సల్మాన్ నుంచి క్రమశిక్షణ నేర్చుకున్నా!

''దబాంగ్-3' తెలుగులో విడుదలకావడం ఆనందంగా ఉంది. 'డ్రస్ వేస్తే పోలీస్... తీసేస్తే గుండా..' అంటూ సల్మాన్ ఖాన్ నోటి నుండి తెలుగు సంభాషణలు వినడం బాగుంది' అని అన్నారు వెంకటేష్. సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'దబాంగ్-3'. అర్బాజ్‌ఖాన్, నిఖిల్ ద్వివేదిలతో కలిసి సల్మాన్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రభుదేవా దర్శకుడు. సోనాక్షిసిన్హా కథానాయిక. సుదీప్ ప్రతినాయకుడిగా నటించారు. ఈ నెల 20న ఈ చిత్రం విడుదలకానుంది. తెలుగులో సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు అందిస్తున్నది. బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరోలు వెంకటేష్, రామ్‌చరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సల్మాన్‌ఖాన్ మాట్లాడుతూ 'రామ్‌చరణ్ నాకు అత్యంత సన్నిహితుడు. అతడిని నా చిన్న తమ్ముడిగా భావిస్తాను. చిరంజీవితో చక్కటి సాన్నిహిత్యముంది. వెంకటేష్‌తో పాతికేళ్లుగా పరిచయముంది. ప్రభుదేవా ఈసినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. నేను నటించిన సినిమాలన్నీ ఇక్కడ పెద్ద విజయాల్ని సాధించాయి. ఆ ఆలోచనతోనే 'దబాంగ్-3'ని తెలుగులో విడుదల చేస్తున్నాం' అని తెలిపారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'సల్మాన్‌ఖాన్ పట్ల నాకున్న అభిమానాన్ని, ప్రేమను మాటల్లో వ్యక్తపరచలేను. సల్మాన్‌ఖాన్, చిరంజీవి, సుదీప్, వెంకటేష్..అందరి నుంచి నాతో పాటు మా తరం హీరోలందరం క్రమశిక్షణ నేర్చుకున్నాం. ప్రభుదేవా, సోనాక్షిసిన్హాతో పాటు ప్రతి ఒక్కరికి ఈ సినిమాతో పెద్ద విజయం దక్కాలి' అని పేర్కొన్నారు. 'దబాంగ్' సిరీస్ తనకెంతో ప్రత్యేకమని సోనాక్షిసిన్హా చెప్పింది. ప్రభుదేవా మాట్లాడుతూ 'పక్కా మాస్ యాక్షన్ చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించే హంగులన్నీ ఉన్నాయి. రామ్‌చరణ్‌ను చూస్తుంటే చిరంజీవి గుర్తొస్తున్నారు. చాలా రోజుల తర్వాత ఈ వేడుక ద్వారా వెంకటేష్‌ను కలవడం ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు. సల్మాన్‌ఖాన్‌తో ఈ సినిమాలో నటించడాన్ని గౌరవంగా భావిస్తున్నానని సుదీప్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అనంత శ్రీరామ్, సునీల్‌నారంగ్, సయీ మంజ్రేకర్ తదితరులు పాల్గొన్నారు.


సాయితేజ్

'కెరీర్‌లో ఎదురైన పరాజయాల బాధ్యత పూర్తిగా నాదే. నేనే ఒప్పుకొని ఆ సినిమాలు చేశాను కాబటి వైఫల్యాల విషయంలో ఇతరుల్ని తప్పపట్టడం లేదు' అని అన్నారు సాయితేజ్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ప్రతిరోజూ పండగే'. మారుతి దర్శకత్వం వహించారు. బన్నీ వాస్ నిర్మించారు. రేపు ఈ చిత్రం విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో సాయితేజ్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి...

# నేనే కనిపించాలనే స్వార్థం లేదు!

**కుటుంబ కథలతో గతంలో చాలా సినిమాలు వచ్చాయి?వాటితో పోలిస్తే ఇందులో ఎలాంటి కొత్తదనం ఉంటుంది?**

• తాతామనవళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని హృద్యంగా ఆవిష్కరించే సినిమా ఇది. మరణం అంచుల్లో ఉన్న తాతయ్య కోరికల్ని నెరవేర్చడానికి ఓ మనవడు ఎలాంటి ప్రయత్నాల్ని చేశాడన్నది ఈ చిత్ర ఇతివృత్తం. ప్రతిరోజు మన మనసుకు నచ్చిన పనిచేయడంలోనే సంతోషం ఉంటుంది. కుటుంబసభ్యులంతా కలిసి ఉంటే ప్రతి రోజూ పండగే అవుతుందని పాయింట్‌ను నమ్మి మారుతి ఈ సినిమాను రూపొందించారు. అలాంటి రోజులు వస్తే చావును కూడా సంతోషంగా ఆహ్వానించవచ్చన్నదే ఈ సినిమాలో చూపించాం.

**మారుతి చెప్పిన కథలో మిమ్మల్ని ఆకట్టుకున్న అంశమేది?**

• తన తాతయ్య ఐదు వారాల్లో చనిపోతాడని తెలిసిన ఓ మనవడు ఏం చేశాడనే పాయింట్ నన్ను బాగా ఆకట్టుకున్నది. చాలా మంది తమ తల్లిదండ్రులను విడిచిపెట్టి విదేశాలకు వెళుతున్నారు. అలాంటి వారందరిలో ఈ సినిమా ఆలోచనను రేకెత్తిస్తుంది. సున్నితమైన కథతో సందేశం, వినోదాన్ని బ్యాలెన్స్ చేస్తూ అర్థవంతంగా మారుతి సినిమాను తీర్చిదిద్దారు.

**ట్రైలర్‌లో చూస్తుంటే చాలా పాత్రలు కనిపిస్తున్నాయి. అంత మంది నటుల కారణంగా మీ పాత్రకు ప్రాధాన్యత తగ్గుతుందని ఎప్పుడైనా అనుకున్నారా?**

• కథను నమ్మే నేను ఈ సినిమా చేశాను. అంతే కానీ నా పాత్ర మాత్రమే ఎక్కువ సమయం తెరపై కనిపించాలనే స్వార్థంతో ఎప్పుడూ ఆలోచించలేదు. సినిమా అనేది సమిష్టి కృషికి నిదర్శనంగా ఉంటుంది. ఒక్కరి ఎఫర్ట్‌తో విజయం సాధ్యం కాదు. అదే నేను నమ్ముతాను. అందరితో కలిసి నటించినప్పుడే మనలోని ప్రతిభాసామర్థ్యాలు ఏమిటో తెలుసుకునే అవకాశం దొరుకుతుంది.

**ఈ సినిమాలో లుక్ పరంగా కొత్తగా కనిపిస్తున్నారు?**

• 'చిత్రలహరి'లో చాలా లావుగా కనిపించాను. ఈ సినిమాలో కొత్తగా కనిపించాలనే రెండు నెలల పాటు వర్కవుట్స్ చేసి ఇరవై కిలోల బరువు తగ్గాను. సినిమాలో ఓ సన్నివేశంలో సిక్స్‌ప్యాక్‌లో కనిపిస్తాను. నా పాత్ర, లుక్ పరంగా వైవిధ్యత కనిపించాలనే ఆలోచనతో సిక్స్‌ప్యాక్ కోసం కష్టపడ్డాను. ఫిట్‌గా కనిపించడం కోసం ఫుడ్ విషయంలో చాలా పరిమితులు విధించుకోవాల్సివచ్చింది.

**మీ సినిమాకు పోటీగా చాలా సినిమాలు విడుదలవుతుండటం ఒత్తిడిని పెంచిందా?**

• పోటీ ఉందనే భయం ఎప్పుడూ లేదు. కథ బాగుంటే తప్పకుండా ఆదరిస్తారు. ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకంతోనే ప్రతి ఒక్కరూ సినిమా చేస్తారు. మేము అలాగే ఈ సినిమాను నమ్మాం.

**కుటుంబ కథా చిత్రాలు చేయడంతో పోలిస్తే కమర్షియల్ సినిమాలు చేయడం సులభమని అనుకుంటున్నారా?**

• ఏ సినిమాకు ఉండే కష్టం దానికుంటుంది.ప్రతి సినిమాలో పాత్ర తీరుతెన్నులు, లుక్, వస్త్రధారణ అనుగుణంగా నన్ను నేను మలుచుకోవడం సవాల్‌గానే ఉంటుంది. దర్శకుడు మారుతి నా పాత్రను పక్కాగా సిద్ధం చేయడంతో ఈ సినిమాకు పెద్దగా కష్టపడాల్సిన అవసరం రాలేదు.

> వారసత్వం అనేది ఓ బాధ్యత. ఆ మాటను గుర్తుంచుకొని పనిచేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. చిరంజీవి లాంటి గొప్ప నటుడి కుటుంబం నుంచి రావడం బాధ్యతగానే భావిస్తాను. మైనస్‌గా ఎప్పుడూ అనుకోను. మామయ్యలు నిర్దేశించిన లక్ష్యాల్ని కొనసాగించాలనే ఆలోచనను ప్రతిక్షణం గుర్తుంచుకొని కష్టపడతాను.

**'చిత్రలహరి' విజయం తర్వాత కథల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?**

• సినిమాల పరంగా గతంలో నేను చేసిన తప్పుల నుంచి చాలా నేర్చుకున్నాను. భవిష్యత్తులో వాటిని పునరావృతం చేయకుండా జాగ్రత్తపడుతున్నాను. కథ చెప్పగానే వెంటనే ఒప్పుకోకుండా నాకు ఉన్న అనుమానాల్ని నివృత్తి చేసుకుంటున్నాను. నేను కోరిన మార్పులు చేశారో లేదో చూసుకుంటూ సినిమాల్ని అంగీకరిస్తున్నాను. జయాపజయాలకు అతీతంగా ప్రతి సినిమా కోసం కష్టపడి పని చేయాల్సిందే. అభిమానులతో పాటు ప్రేక్షకుల్ని మెప్పించే సినిమా చేయాలనే ఒత్తిడి ఎప్పుడూ ఉంటుంది.

**మల్టీస్టారర్ సినిమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారా?**


• నేను, వరుణ్‌తేజ్ కలిసి సినిమాలు చేయాలని ఎప్పుడూ అనుకుంటుంటాం. మంచి కథ కోసం ఎదురుచూస్తున్నాం. అలాగే రవితేజతో కలిసి నటించాలనుంది. 'అబ్బాయ్ మనం ఇద్దరం కలిసి సినిమా చేద్దాం' అని ఆయన ఎప్పుడూ అంటుంటారు. మల్టీస్టారర్ సినిమాలు చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

**మీ సోదరుడు వైష్ణవ్‌తేజ్‌కు ఏమైనా సలహాలు ఇస్తుంటారా?**

• నటనలో వాడు నా కంటే సీనియర్. మావయ్యలతో కలిసి శంకర్‌దాదా ఎంబీబీఎస్, జానీ, అందరివాడు సినిమాల్లో నటించాడు. 'ఉప్పెన' సినిమా సెట్స్‌కు నన్ను రావద్దని చెప్పాడు.

**తదుపరి సినిమా విశేషాలేమిటి?**

• ప్రస్తుతం 'సోలో బ్రతుకే సో బెటర్' సినిమాలో నటిస్తున్నాను. ఓ వ్యక్తి జీవితంలో 22, 32 ఏళ్ల వయసులో జరిగే పరిణామాల్ని ఆవిష్కరిస్తూ ఈసినిమా రూపొందనున్నది. మరో కొత్త దర్శకుడు కథ వినిపించారు. ప్రస్తుతం ఆ సినిమాకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి.


కాలభైరవ, రవిశంకర్, శ్రీసింహా, రితేష్


# చిన్నబడ్జెట్ హిట్ కంటెంట్

'తొలి సినిమా ఎవరికైనా ప్రత్యేకమే. కానీ ఇది నాకు డబుల్ స్పెషల్. ఈ సినిమాతో నేను సంగీత దర్శకుడిగా, నా తమ్ముడు హీరోగా అరంగేట్రం చేస్తుండటం ఆనందంగా ఉంది' అని అన్నారు కీరవాణి తనయుడు కాలభైరవ. ఆయన స్వరకర్తగా పరిచయమవుతున్న చిత్రం 'మత్తువదలరా'. కీరవాణి రెండో కుమారుడు శ్రీసింహా హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. రితేష్‌రానా దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మించారు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదలకానుంది. ట్రైలర్‌ను బుధవారం ట్విట్టర్ ద్వారా హీరో రానా విడుదలచేశారు. ఈ సందర్భంగా చిత్రబృందం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సమర్పకుడు రవిశంకర్ మాట్లాడుతూ ' హిట్ కంటెంట్‌ను చిన్న బడ్జెట్‌లో చేయడం ఉత్సుకతగా ఉంది. శ్రీసింహా, కాలభైరవ, రితేష్‌రానా, థామస్, తేజ అందరూ కొత్త వాళ్లు కలిసి అద్భుతాన్ని సృష్టించారని సినిమా చూసిన ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తారనే నమ్మకం ముంది. హిట్ సినిమాతో ఈ ఏడాదిని ముగించబోతున్నాం' అని తెలిపారు. కాలభైరవ మాట్లాడుతూ 'సినిమా చేస్తున్నప్పుడు, చూసినప్పుడు చివరిక్షణం మేము ఎంతగా ఆనందించామో ప్రేక్షకులు అలాగే ఎంజాయ్ చేస్తారని అనుకుంటున్నాం. ఇటీవల విడుదలైన టీజర్, పాటకు చక్కటి స్పందన లభిస్తున్నది' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'నాయకానాయికల మధ్య ప్రేమకథ, పాటలు కాకుండా కేవలం పాత్రలు, వాటి చుట్టూ అల్లుకున్న సన్నివేశాలు మాత్రమే కనిపిస్తాయి. యథార్థ సంఘటనల్ని ఆధారంగా చేసుకొని ఈ సినిమాను రూపొందించాం' అని పేర్కొన్నారు. శ్రీసింహా మాట్లాడుతూ ' కథానాయకుడు, దర్శకుడు,నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ కొత్త వాళ్లను నమ్మి ఈ సినిమాను నిర్మించి నిర్మాత చెర్రీ, మైత్రీ మూవీ మేకర్స్ గొప్ప సాహసం చేశారు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్‌సారంగం, రవితేజ తదితరులు పాల్గొన్నారు. నరేష్ ఆగస్త్య, అతుల్య చంద్ర, సత్య, వెన్నెలకిషోర్, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేష్ సారంగం, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్.

# ఖోఖో కథతో


పులా సిద్దేశ్వర్‌రావ్

ఖోఖో ఆట నేపథ్యంలో తెలుగులో రూపొందుతున్న చిత్రం 'రథేరా'. పులా సిద్దేశ్వర్‌రావ్ హీరోగా నటిస్తూ, నరేష్‌యాదవ్, వై.ఎస్. కృష్ణమూర్తిలతో ఈచిత్రాన్నినిర్మిస్తున్నారు. రమేష్ జకట దర్శకుడు. జనవరిలో ఈసినిమా విడుదలకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఖోఖో ఆట ప్రధానంగా ఊహకందని మలుపులతో సాగే చిత్రమిది. తన టీమ్‌ను గెలిపించడం కోసం ఓ నిజాయితీపరుడైన కోచ్ ఎలాంటి మార్గాన్ని ఎంచుకున్నాడన్నది ఆకట్టుకుంటుంది. వినాయక్ విడుదలచేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. కొత్తదనాన్ని కోరుకునే ప్రతి ఒక్కరిని అలరించే చిత్రమిదని నిర్మాతలు పేర్కొన్నారు. సిద్ధు, మానస, ఎస్.కృష్ణమూర్తి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం:సిద్ధార్థ్.


జానీ, తనీష్, కబీర్‌దుహన్‌సింగ్

# తనీష్ 'మహాప్రస్థానం'

తనీష్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'మహాప్రస్థానం'. 'జర్నీ ఆఫ్ ఎన్ ఎమోషనల్ కిల్లర్' అనేది ఈ చిత్రానికి ఉపశీర్షిక. ఈ చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. దేవుడి పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి హీరో తనీష్ క్లాప్‌నిచ్చాడు. దర్శకుడు జానీ చిత్ర విశేషాలను తెలియజేస్తూ 'యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఇంటెన్స్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ముస్కాన్ సేథీ నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో 'వరుడు' ఫేం భానుశ్రీమెహ్రా కీలక పాత్రను పోషిస్తుంది.తప్పకుండా చిత్రం అన్ని వర్గాల ఆదరణ పొందుతుందనే నమ్మకం వుంది'అని తెలిపారు. చాలా రోజుల తర్వాత షూటింగ్ సెట్‌లో అడుగుపెట్టానని, ఈ కథ తనలో కొత్త ఎనర్జీని తీసుకొచ్చిందని నటుడు తనీష్ చెప్పారు. శుభాంగీ పంత్, గగన్‌విహారి, అమిత్, రవికాలే తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: వసంత కిరణ్, యానాల శివ, సంగీతం: సునీల్ కశ్యప్, కథ-కథనం-దర్శకత్వం: జాని.


రక్షిత్‌శెట్టి, శాన్వీ శ్రీ వాత్సవ

# శ్రీమన్నారాయణ జర్నీ

రక్షిత్‌శెట్టి హీరోగా పుష్కర్ ఫిలింస్ పతాకంపై పుష్కర్ మల్లికార్జున్, హెచ్.కె.ప్రకాశ్ నిర్మిస్తున్న చిత్రం 'అతడే శ్రీమన్నారాయణ'. సచిన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. జనవరి 1న ప్రపంచవ్యాప్తంగా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో రక్షిత్ శెట్టి మాట్లాడుతూ 'ఇంజనీరింగ్ చదివే సమయంలో వంశీ కృష్ణ అనే మిత్రుడు ద్వారా తెలుగుతో పరిచయం ఏర్పడింది. అప్పట్లో చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, సినిమాలు చూసే వాడిని. కానీ తేడా తెలిసేది కాదు. కానీ వంశీకృష్ణను చూసిన తర్వాత సినిమాపై ఎంత ప్యాషనేట్‌గా వుండాలనేది తెలిసేది. నేను సినిమా పరిశ్రమలోకి అడుగు పెట్టిన తర్వాత ఇక్కడి ప్రేక్షకులు సినిమాను ఎలా ఆదరిస్తారు, ప్రేమిస్తారో తెలిసింది. అందుకే నా 'అతడే శ్రీమన్నారాయణ'ను తెలుగులో విడుదల చేస్తున్నాను. చాలా ప్యాషన్‌తో ప్రేమతో సినిమా చేశాం, మూడేళ్ల కష్టం. గొప్ప జర్నీ ఇది. తెలుగు ప్రేక్షకులు సినిమాను ఎలా ఆదరిస్తారో చూడాలని ఆసక్తి వున్నాను' అని తెలిపారు. ఐదేళ్ల తర్వాత ఈ సినిమా ద్వారా తెలుగులో పునరాగమనం చేయడం ఆనందంగా వుందని హీరోయిన్ శాన్వీ శ్రీ వాత్సవ చెప్పింది. ఈ సమావేశంలో బాలాజీ మనోహర్, ప్రమోద్ శెట్టి, ఇమ్రాన్, రాజేష్, డిస్ట్రిబ్యూటర్ సతీష్, రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# వాట్సప్‌లో తోటి విద్యార్థినులపై అశ్లీల సంభాషణ

- అశ్లీలం, హింస, జుగుప్సాకరమైన మాటలు
- స్కూల్లో తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఎనిమిది మంది విద్యార్థుల సస్పెన్షన్
- ముంబైలోని ఇంటర్నేషనల్ స్కూల్లో ఘటన

**ముంబై:** దేశవ్యాప్తంగా విద్యార్థినులు, యువతులు, మహిళలపై లైంగికదాడులు పెరిగిపోతున్నాయి. సోషల్ మీడియాలో కూడా వారిపై అసభ్యకరమైన పోస్టులు, అశ్లీల వ్యాఖ్యలు రోజురోజుకు అధికమవుతున్నాయి. తాజాగా ముంబైలోని ప్రఖ్యాత ఇంటర్నేషనల్ బోర్డు స్కూల్ విద్యార్థులు తమ వాట్సప్ గ్రూప్‌లో తోటి విద్యార్థినులను ఉద్దేశించి అశ్లీల పదజాలంతో సంభాషణలు సాగించారు. ఈ విషయం పిల్లల తల్లిదండ్రుల దృష్టికి రావడతో వారు స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదుచేశారు. దీంతో ఎనిమిది మంది విద్యార్థులను స్కూల్ యాజమాన్యం సస్పెండ్‌చేసింది. విద్యార్థులంతా 13-14 ఏండ్ల వయసువారు కావడం గమనార్హం. వీరు ఆయా రంగాల్లో పేరుగాంచిన ప్రముఖుల పిల్లలని తెలుస్తున్నది. విద్యార్థుల వాట్సప్ సందేశాలు పరిశీలించగా అవన్నీ దారుణమైన అశ్లీలతతో, హింసతో జుగుప్సాకరంగా ఉన్నాయి. 'విద్యార్థినులపై లైంగిక దాడిచేయాలి.. వారిని హింసించాలి. విద్యార్థినులు ట్రాష్.. క్లాస్‌మేట్స్‌ను గ్యాంగ్‌రేప్ చేయాలి' వంటి సంభాషణలు ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో భయాందోళనకు గురైన పలువురు విద్యార్థినులు స్కూల్‌కు వెళ్లేందుకు జంకుతున్నట్టు సమాచారం. దీంతో సదరు విద్యార్థులపై స్కూల్ యాజమాన్యం చర్యలు తీసుకున్నది.

# పరిశోధన వ్యాసాల ప్రచురణలో భారత్ @ 3

**వాషింగ్టన్, డిసెంబర్ 18:**

సైన్స్, ఇంజినీరింగ్ అంశాలపై పరిశోధన వ్యాసాలు ప్రచురించడంలో భారత్‌ది మూడోస్థానమని అమెరికాకు చెందిన ఓ ప్రభుత్వ సంస్థ తెలిపింది. సైన్స్, ఇంజినీరింగ్‌పై భారత్ ఇప్పటికి 1.35 లక్షలకుపైగా పరిశోధన వ్యాసాలను ప్రచురించిందని పేర్కొంది. ఈ జాబితాలో చైనా మొదటి స్థానంలో ఉంది. అమెరికాకు చెందిన నేషనల్ సైన్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) సేకరించిన గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయ అంశాలపై ప్రచురించిన పత్రాలు 2008లో 17,55,850 కాగా, అవి 2018 నాటికి 25,55,959కి పెరిగాయి. గత పదేండ్లలో ఈ వ్యాసాలు ఏటా నాలుగు శాతం చొప్పున పెరిగాయి. సైన్స్, ఇంజినీరింగ్‌కు సంబంధించి భారత్‌లో 2008లో 48,998 వ్యాసాలను ప్రచురించగా, 2018 నాటికి వాటి సంఖ్య 1,35,788కి పెరిగింది. భారత్‌లో ఏటా సగటున 10.73 శాతం వృద్ధి నమోదైనట్టు ఎన్ఎస్ఎఫ్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా సైన్స్, ఇంజినీరింగ్‌పై ప్రచురితమైన పరిశోధన వ్యాసాలలో భారత్‌ది 5.31 శాతం వాటా అని తెలిపింది. 20.67 శాతం వ్యాసాలతో చైనా మొదటిస్థానంలో ఉండగా, 16.54 శాతంతో అమెరికా రెండో స్థానంలో ఉంది. ఇంకా మొదటి పది స్థానాల్లో జర్మనీ, జపాన్, బ్రిటన్, రష్యా, ఇటలీ, దక్షిణ కొరియా, ఫ్రాన్స్ ఉన్నాయి.





ఎల్బీ స్టేడియంలో క్రిస్మస్ విందు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

# రేపు క్రిస్మస్ విందు

- ఎల్బీస్టేడియంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం
- మైనార్టీ, ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్రిస్మస్‌ను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరపున శుక్రవారం క్రైస్తవ కుటుంబాలకు ఇచ్చే విందుకు ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయని మైనార్టీ, ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. బుధవారం లాల్‌బహదూర్ స్టేడియంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఐదేండ్లుగా క్రిస్మస్ విందు నిర్వహిస్తున్నదని, దీనికి సీఎం కేసీఆర్ స్వయంగా హాజరవుతున్నారని తెలిపారు. పెద్దసంఖ్యలో క్రైస్తవ కుటుంబాలు హాజరయ్యే విందు కార్యక్రమాన్ని 14 శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఏకేఖాన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, మైనార్టీ సంక్షేమశాఖ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

**క్రిస్మస్ వేడుకలకు హాజరుకానున్న సీఎం కేసీఆర్**

శుక్రవారం ఎల్బీస్టేడియంలో క్రిస్మస్ ఫీస్ట్, దుస్తులు, బహుమతుల అందజేత, విందు కార్యక్రమానికి సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ ఏహెచ్‌ఎన్ కాంతి వెస్లీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీమేరకు క్రిస్టియన్ భవన్ నిర్మాణం కోసం కోకాపేట వద్ద రెండెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. క్రైస్తవులశ్మశాన వాటిక కోసం రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 40.21 ఎకరాల భూమిని ప్రభుత్వం ప్రతిపాదించినట్టు వెల్లడించారు. విస్తృత సేవలందించిన క్రైస్తవ ప్రముఖులకు, సంస్థలకు సీఎం చేతులమీదుగా అవార్డులను అందజేయనున్నట్టు వివరించారు.

# శశిథరూర్‌కు సాహితీ పురస్కారం

- 'ఇంగ్లిష్' విభాగంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్న కాంగ్రెస్ నేత
- తెలుగు నవలా రచయిత బండి నారాయణస్వామి, సంస్కృత రచయిత పెన్నా మధుసూదన్‌కు పురస్కారం
- వివిధ భాషల్లో 23 మంది విజేతలు
- వచ్చే ఫిబ్రవరి 25న ఢిల్లీలో అవార్డుల ప్రదానం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** కాంగ్రెస్ నేత, రచయిత శశిథరూర్ ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికయ్యారు. 'ఎరా ఆఫ్ డార్క్‌నెస్'- ద బ్రిటిష్ ఎంపైర్ ఇన్ ఇండియా.. అనే పుస్తక రచనకు ఆయనను ఈ అవార్డు వరించింది. మరోవైపు 'శప్తభూమి' నవలకుగాను తెలుగు రచయిత బండి నారాయణస్వామికి ఈ పురస్కారం లభించగా, 'చల్తే హుయే అప్‌నే కో' అనే హిందీ కవితా సంకలన రచయిత నందకిశోర్ ఆచార్య, సంస్కృతంలో పెన్నా మధుసూదన్ అవార్డుకు ఎంపికయ్యారు. కేంద్ర సాహిత్య అకాడమీ ఈ ఏడాది అవార్డులను బుధవారం ప్రకటించింది. అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కంబర్ అధ్యక్షతన సాహిత్య అకాడమీ సమావేశమై దేశంలోని 23 భాషలకు చెందిన రచయితలను సాహిత్య అకాడమీ పురస్కారాలకు ఎంపికచేసినట్టు అకాడమీ కార్యదర్శి కే శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో ఏడుగురు కవులు, చిన్న కథల విభాగంలో ఆరుగురు రచయితలు, వ్యాసరూపంలోని కథల విభాగంలో ముగ్గురు, నవలా విభాగంలో నలుగురు, కాల్పనికేతర, ఆత్మకథ, జీవితచరిత్ర విభాగంలో ముగ్గురు అవార్డులకు ఎంపికయ్యారు. కవుల విభాగంలో పుకన్ సీహెచ్ బసుమాతరి (బోడో), నందకిశోర్ ఆచార్య (హిందీ), నిబా ఏ ఖాందేకర్ (కొంకణి), కుమార్ మనీశ్ అర్వింద్ (మైథిలి), వీ మధుసూదనన్ నాయర్ (మలయాళం), అనురాధా పాటిల్ (మరాఠి), పెన్నా మధుసూదన్ (సంస్కృతం) అవార్డులకు ఎంపికయ్యారు. నవలా రచయితలు జయశ్రీ గోస్వామి మహంత (అస్సామీ), ఎల్ బిర్మన్‌గల్ సింగ్ (మణిపూర్), చో ధార్మన్ (తమిళ్), బండి నారాయణస్వామి (తెలుగు) పురస్కారాలు అందుకోనున్నారు. చిన్నకథల విభాగంలో ఆరుగురు రచయితలు.. అబ్దుల్ అహద్ హజిని (కశ్మీరీ), తరుణ్ కాంతి మిశ్రా (ఒడియా), క్రిపాల్ కజక్ (పంజాబి), రాంస్వరూప్ కిషన్ (రాజస్థానీ), కాళీచరణ్ హెంబ్రం (సంతాలి), ఈశ్వర్ మూర్జాని (సింధి) ఎంపికయ్యారు. కాల్పనికేతర, ఆత్మకథ, జీవిత చరిత్ర వంటి రచనల్లో సృజనాత్మకతను చూపిన శశిథరూర్ (ఇంగ్లిష్), విజయ (కన్నడ), శఫీ కిద్వాయి (ఉర్దూ) అవార్డులను గెలుపొందారు. వ్యాస పుస్తకాల రచయితలు ముగ్గురు.. చిన్మయ్ గుహ (బెంగాలి), ఓం శర్మ జంద్రియారి (డోగ్రి), రతిలాల్ బోరిసాగర్ (గుజరాతి) కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులకు ఎంపికయ్యారు. పురస్కార విజేతలకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో రాగి జ్ఞాపికతోపాటు రూ.లక్ష నగదు బహుమతిని ప్రదానం చేయనున్నారు.

# మాతాశిశు సంరక్షణకు పెద్దపీట

- గాంధీ దవాఖానలో రూ.50 కోట్లతో ప్రత్యేక మెటర్నిటీ విభాగం
- రాష్ట్రవ్యాప్తంగా నమోదయ్యే హైరిస్క్ గర్భిణులకు ఇక్కడే ప్రసవం
- 200 బెడ్లు.. అత్యాధునిక వసతులు.. 24 గంటల వైద్యసేవలు
- రాష్ట్రంలోనే డెలివరీలకు మోడల్‌గా మారనున్న గాంధీ దవాఖాన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భవిష్యత్ తరాలకు ఆరోగ్య సమాజాన్ని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మాతాశిశు రక్షణకు పెద్దపీట వేస్తున్నది. రాష్ట్రంలోని పలు సర్కారు దవాఖానల్లో పూర్తిస్థాయిలో వసతులను కల్పించడంతోపాటు మాతాశిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నది. హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక కేంద్రం ద్వారా ప్రసవాలు చేయాలనే లక్ష్యంతో రూ.50 కోట్లతో గాంధీ దవాఖానలో 200 బెడ్లతో మెటర్నిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ పేరిట ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగే హైరిస్క్ ప్రసవాలను భవిష్యత్తులో ఇక్కడే నిర్వహించేలా మాతా శిశు సంరక్షణకు ప్రత్యేక విభాగాన్ని ఐసీయూసహా అన్నిరకాల అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటుచేయనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో ఎక్కడాలేని విధంగా ఇక్కడ అన్ని రకాల హైరిస్క్ ప్రసవాలు చేస్తారు. రాష్ట్రంలోనే అన్ని దవాఖానకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా ఇది నిలువనున్నది.

**సాధారణ ప్రసవాలకు ఇప్పటికే 150 పడకలు**

సాధారణ ప్రసవాలకు ఇప్పటికే గాంధీ దవాఖానలో 150 పడకలు ఉన్నాయి. వాటితో సంబంధం లేకుండా కొత్తగా వచ్చే 200 పడకలను ఏరియా, జిల్లా, ఇతర దవాఖానల నుంచి వచ్చే హైరిస్క్ కేసులకోసం కేటాయిస్తారు. ఇది అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోనే గాంధీ దవాఖాన డెలివరీలకు మోడల్‌గా మారనున్నది. మాతాశిశు సంరక్షణలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం నీలోఫర్, పేట్లబుర్జు, గాంధీ, సుల్తాన్‌బజార్ దవాఖానల్లో బాలింతలకు ప్రత్యేక ఐసీయూ (మాట్రెనల్ ఐసీయూ)లను నెలకొల్పి ప్రసవానికి ముందు, తర్వాత సేవలను అందిస్తున్నది. పిల్లలకు ప్రత్యేక ఐసీయూ (ఎస్ఎన్‌సీయూ)లను కూడా పెంచి నవజాత శిశువులకు అవసరమైన వైద్యసేవలు చేస్తున్నది.



సికింద్రాబాద్ గాంధీ దవాఖానలోని ప్రసూతి వార్డు

**హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి**

గాంధీ దవాఖానలో ఏర్పాటుచేసే మెటర్నిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో అధికరక్తపోటు, మధుమేహం, మూర్ఛ, తీవ్ర రక్తహీనత, గుండెజబ్బు.. తదితర ప్రమాదకర లక్షణాలు అధికంగా ఉన్న గర్భిణులకు ఇక్కడ వైద్యసేవలు అందిస్తారు. హైరిస్క్ ఉన్నట్టు గుర్తించిన గర్భిణులకు ముందుగానే ఆరునెలల నుంచి సమీప దవాఖాన ద్వారా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తారు. ఇందులో తల్లీబిడ్డలకు ప్రత్యేక వైద్యసేవలు అందించేందుకు ఎంఐసీయూ, ఎన్ఐసీయూలను వేర్వేరుగా ఏర్పాటుచేస్తారు. ఈ కేంద్రంలో స్పెషలిస్టు, సూపర్ స్పెషలిస్టు వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు 24 గంటలు అందుబాటులో ఉంటారు. గైనకాలజీ, అనస్థీషియా, పిడియాట్రిక్స్ వంటి వైద్యసేవలే కాకుండా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ తదితర స్పెషాలిటీ సేవలనూ ఇక్కడ అందించనున్నారు. కార్పొరేట్ స్థాయి ప్రైవేటు దవాఖానల్లో కూడా అందని స్పెషాలిటీ సేవలను ఇక్కడి ప్రత్యేక కేంద్రం ద్వారా అందించనున్నారు.

## మధ్యాహ్న భోజనంలో పప్పు, చిరుధాన్యాలు చేర్చాలి

**నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** పౌష్టికాహారం విషయంలో భారత్ స్థానాన్ని మెరుగుపరిచేందుకు పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం తప్పనిసరిగా చిరు ధాన్యాలను, పప్పు ధాన్యాలను చేర్చాలని నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో గోధుమలు, వరి ధాన్యం స్థానంలో పౌష్టికాహారం ఎక్కువగా గల పప్పు ధాన్యాలు, చిరుధాన్యాల కొనుగోలుపై దృష్టి పెట్టాలని సూచించారు. 'ఇంధనం- నీరు- వ్యవసాయానికి మధ్య అనుబంధం: సౌరవిద్యుత్ పెంపు, జలాల పొదుపుతో వ్యవసాయంలో రెట్టింపు ఆదాయం' అనే అంశంపై బుధవారం ఢిల్లీలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. తక్కువ నీటి వినియోగం గల పంటల సాగుపై ఎక్కువగా దృష్టి సారించాలని, పంటల మార్పిడి పద్ధతిని వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ దిగుబడుల పెంపుదలకు నిరంతరం రైతులతో సంప్రదింపులు జరుపాల్సిన అవసరం ఉందని అమితాబ్ కాంత్ నొక్కి చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నీటి వినియోగం పెంపుదలకు పలు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. 'దేశంలో నీటి వినియోగంలో 90 శాతం వ్యవసాయానిదే. దీన్ని తగ్గించకుండా గ్రామీణ, పట్టణ, పారిశ్రామిక అవసరాలను తీర్చలేం' అని అమితాబ్ కాంత్ పేర్కొన్నారు.

# భవిష్యత్ తరాలకు ఆరోగ్య వాతావరణం

- కృష్ణ, గోదావరి పునర్జీవంతో 25 లక్షల ఎకరాల్లో పచ్చదనం
- ఆగ్రోఫారెస్ట్రీ, వ్యవసాయ అభివృద్ధితో ఉజ్వల భవిష్యత్
- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచించారు. గోదావరి-కృష్ణా నది పరివాహక ప్రాంతాల పరిరక్షణకు కేంద్రం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. బుధవారం దూలపల్లిలోని తెలంగాణ అటవీ అకాడమీలో జరిగిన కృష్ణా-గోదావరి నదీ పరివాహక ప్రాంత పునర్జీవ పథకం డీపీఆర్ రూపకల్పన సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాలు, పట్టణాల్లో కూడా భూగర్భ మురుగునీటి వ్యవస్థతోపాటు మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటుచేయాలన్న ఆలోచన ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టిలో ఉన్నదన్నారు. 1,465 కిలోమీటర్ల పరిధిలో కృష్ణా-గోదావరి పరివాహక ప్రాంతం ఉన్నదని, ఈ ప్రాజెక్టు ద్వారా 25 లక్షల ఎకరాల్లో పచ్చదనం వెల్లివిరియగలదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఏటేటా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణంలో విపరీత మార్పులు సంభవించి ప్రజాజీవనంతోపాటు జీవరాశులు, పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఇలాంటి అంశాల గురించి మాట్లాడకుండా పనికిరాని విషయాలపై కొట్లాడుకొంటున్నామని తెలిపారు. మురుగునీరు కలిసి కృష్ణా, గోదావరి నదులు కలుషితం అవుతున్నాయని, నదిలోకి చేరే నీటిని శుభ్రపరచాల్సిన అవసరం ఉన్నదన్నారు. నదులకు ఐదు కిలోమీటర్ల దూరం నుంచి పొలాల్లో నీడనిచ్చే చెట్లు, ఉద్యానపంటలు వేయాలని, వాగులకు రెండు కిలోమీటర్ల పరిధిలో భారీ ఎత్తున పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. ఇందుకు నీటిపారుదల, ఉద్యాన, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖలు కలిసికట్టుగా పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధించవచ్చునని చెప్పారు. ఆగ్రోఫారెస్ట్రీకి తోడు ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా భవిష్యత్ తెలంగాణ ముఖచిత్రం ఉజ్వలంగా ఉంటుందని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ ఫారెస్ట్ బయోవర్సిటీ సంచాలకుడు జయప్రసాద్, శాస్త్రవేత్త డీఆర్ఎస్ రెడ్డితోపాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణహిత మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి భరోసా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రాణహిత నదిని దాటుతూ పడవ ప్రమాదంలో మృతిచెందిన అటవీ బీట్ అధికారుల కుటుంబాలను ఆదుకుంటానని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. తానే స్వయంగా బాధిత కుటుంబాలను ఓదార్చి, ప్రభుత్వపరంగా అన్నివిధాలా సహాయ సహకారాలను అందిస్తానని చెప్పారు. అటవీ రక్షణ విధులు నిర్వహిస్తూ నదిలో ప్రాణాలు కోల్పోయిన అధికారుల కుటుంబాలకు న్యాయంచేయాలని తెలంగాణ జూనియర్ అటవీ అధికారుల సంఘం నాయకులు బుధవారం మంత్రిని కోరిన సందర్భంగా ఆ మేరకు హామీ ఇచ్చారు. పడవ ప్రమాదంలో మృతి చెందిన అధికారులు బాలకృష్ణ, సురేశ్‌ల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, పరిహారం చెల్లించాలని సంఘం అధ్యక్షుడు మహమ్మద్ మోజం అలీ ఖాన్ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ జూనియర్ అటవీ అధికారుల సంఘం నాయకులు కిషన్, భాగ్యనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్, కిరణ్ మంత్రిని కోరారు. అటవీ పరిరక్షణలో అంకితభావంతో పనిచేసేవారికి ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తుందని మంత్రి వారికి హామీ ఇచ్చారు.



బుధవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసిన తెలంగాణ జూనియర్ అటవీ అధికారుల సంఘం నాయకులు

# ఎస్సై, 17 మంది కానిస్టేబుళ్లపై వేటు

బిజ్నూర్ కోర్టు హాలులో కాల్పుల ఘటనపై యూపీ సర్కార్ నిర్ణయం

**లక్నో/ బిజ్నూర్, డిసెంబర్ 18:** ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నూర్ చీఫ్ మెజిస్టీరియల్ కోర్టు హాలులో మంగళవారం జరిగిన కాల్పుల ఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. కోర్టు పోలీస్ ఔట్‌పోస్ట్ ఎస్ఐతోపాటు 17 మంది కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్ర అదనపు (హోంశాఖ) ప్రధాన కార్యదర్శి అవనీష్ అవస్థీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో ఐదుగురు మహిళా కానిస్టేబుళ్లు కూడా ఉన్నారు. కోర్టులోకి వచ్చే వారిని తనిఖీ చేయడంలో విధులు సరిగ్గా నిర్వహించనందున వారిని సస్పెండ్ చేశామన్నారు. ఇటీవల స్థిరాస్థి వ్యాపారి హజీ ఎహ్‌సాన్, అతడి మేనల్లుడిని షానవాజ్, జబ్బార్ అనే వ్యక్తులు హత్య చేశారు. తన తండ్రి ఎహ్‌సాన్ హంతకులపై ప్రతీకారం తీర్చుకోవాలని అతడి కుమారుడు మంగళవారం కోర్టు హాలులోకి ప్రవేశించి జరిపిన కాల్పుల్లో షానవాజ్ మరణించగా, జబ్బార్ తప్పించుకున్నాడు. ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఒకరిని మీరట్ దవాఖానకు తరలించామని పోలీసులు చెప్పారు. కాగా, కాల్పులు జరిపిన ఎహ్‌సాన్ కొడుకు, మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని ఎస్పీ సంజీవ్ త్యాగి చెప్పారు.

# భారీగా గంజాయి పట్టివేత

- రూ.48 లక్షల విలువైన 324.5 కిలోల సరకు స్వాధీనం
- రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్



భద్రాచలంలో పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాచలం పట్టణంలో కంటెయినర్‌లో నిషేధిత గంజాయి రవాణా చేస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన బుధవారం చోటుచేసుకున్నది. పట్టణ సీఐ వినోద్ వివరాలు తెలిపారు. సీలేరు, వైజాగ్ నుంచి ఆర్‌జే 18జీ బీ 5095 కంటెయినర్ లారీలో గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో బుధవారం మధ్యాహ్నం భద్రాచలంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రాజస్థాన్‌కు చెందిన లారీని తనిఖీచేయగా 324.5 కేజీల గంజాయి ప్యాకెట్లు లభించాయి. దీని విలువ రూ.48.67 లక్షలు ఉం టుందని సీఐ వినోద్ తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రం, పిలానీ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాథకుండ్‌రూరల్‌కు చెందిన భజన్‌దాస్‌ను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. కంటెయినర్ లారీ యజమాని రాజ్‌పాల్‌సింగ్ పరారీలో ఉన్నాడు. వీరిపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వినోద్ వెల్లడించారు.

**ఖమ్మం రైల్వేస్టేషన్‌లో 38 కిలోలు..**

ఖమ్మం క్రైం:ఒడిశా నుంచి మధ్యప్రదేశ్‌కు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఖమ్మం రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ పోలీసులు అరెస్టుచేశారు. బుధవారం ఖమ్మం జీఆర్పీ సీఐ చంద్రభాను వివరాలు వెల్లడించారు. జీఆర్పీ డీఎస్పీ ఆదేశాలతో మంగళవారం ఖమ్మం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. సాయంత్రం ఆరు గంటలకు రెండోనంబర్ ప్లాట్‌ఫాంపై ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 38 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.3.5 లక్షలు ఉంటుందని సీఐ చంద్రభాను పేర్కొన్నారు. నిందితులు ఒడిశాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మధ్యప్రదేశ్‌లో ఎక్కువకు విక్రయించేందుకు తరలిస్తున్నారని వివరించారు. నిందితులు ఇద్దరు మైనర్ కావడంతో జువైనల్ బోర్డుకు తరలించామని తెలిపారు. విలేకరుల సమావేశంలో జీఆర్పీ ఎస్సై రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో 60 రవాణాసేవలు

- ఎల్ఎల్ఆర్, ఫ్యాన్సీనంబర్లు ఇంటినుంచే పొందే వెసులుబాటు
- సాఫ్ట్‌వేర్ రూపకల్పనకు టెండర్లు ఖరారుచేయనున్న టీఎస్‌టీఎస్




**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర రవాణాశాఖలోని దాదాపు అన్నిసేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణ ఏర్పడ్డాక దళారులకు చెక్‌పెట్టేందుకు రవాణాశాఖలో ఇప్పటికే 59 సేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. కొత్తగా ఫ్యాన్సీనంబర్ల వేలాన్ని ఆన్‌లైన్‌లోకి తెస్తున్నది. దీంతో వినియోగదారులు కంప్యూటర్ లేదా మొబైల్‌ఫోన్ ద్వారా స్లాట్ బుక్‌చేసుకొని లైసెన్సులు, వాహన లావాదేవీల్లాంటి పలురకాల సేవలను ఇంటినుంచే పొందుతున్నారు. ఫ్యాన్సీనంబర్ల కేటాయింపులో తరచుగా వివాదాలు తలెత్తుతుండటంతో అధికారులు ఒత్తిడికి గురవుతున్నారు. ఫ్యాన్సీనంబర్ల కోసం పోటీపడేవారిలో ఎక్కువమంది సంపన్నులే కావడంతో కోరుకున్న నంబరు రాకపోతే నానాయాగీ చేస్తున్నారు. ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయంలో ఇద్దరు వాహన యజమానులు ఒకే నంబరు కోసం పిడిగుద్దులు గుద్దుకున్న సందర్భం కూడా ఉన్నది. ఇటువంటి ఘటనలు అనేకం జరుగుతుండటంతో ఫ్యాన్సీ నంబర్ల వేలాన్ని ఆన్‌లైన్‌లోకి తెస్తున్నారు. వేలంలో పాల్గొని నంబరురాని వ్యక్తికి బిడ్డింగ్ వేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించేలా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నారు. ఇది అమల్లోకివస్తే ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా పోటీపడి ఎక్కువ బిడ్‌చేసిన వారికి కోరుకున్న నంబరు లభిస్తుంది.

**ఆన్‌లైన్‌లో ఎల్ఎల్ఆర్**

వాహనాన్ని నడిపేందుకు ప్రాథమికంగా జారీ చేసే లెర్నింగ్ లైసెన్సు (ఎల్ఎల్ఆర్)ను ఆన్‌లైన్‌లోకి తెస్తున్నారు. తొలిసారి ఎల్ఎల్ఆర్ తీసుకునేవారికి ఇది వర్తించదు. వారు తప్పనిసరిగా కార్యాలయానికి వచ్చి ఎంవీఐ సమక్షంలో కంప్యూటర్‌పై పరీక్ష రాయాల్సిందే. ఒక లైసెన్సుకు అదనంగా మరో లైసెన్సు తీసుకొనే (ఉదాహరణకు టూవీలర్ లైసెన్సు ఉండి ఫోర్‌వీలర్ లైసెన్సు తీసుకొనే) క్రమంలో కార్యాలయానికి రాకుండా ఆన్‌లైన్ ద్వారానే ఎల్ఎల్ఆర్‌ను పొందవచ్చు.

**సర్వర్ సరే అంటేనే పొల్యూషన్ సర్టిఫికెట్**

ప్రస్తుతం వాహన కాలుష్యానికి సంబంధించిన తనిఖీలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. రోడ్లపై ఉండే పొల్యూషన్ టెస్టింగ్ కేంద్రాల నిర్వాహకులకు ఎంతోకొంత ముట్టజెబితే కాలుష్యస్థాయిని తగ్గించి వాహనదారులకు అనుకూలంగా సర్టిఫికెట్లు ఇస్తున్నారు. దీన్ని నిరోధించేందుకు టెస్టింగ్ కేంద్రాలను నేరుగా రవాణాశాఖ సెంట్రల్‌సర్వర్‌తో అనుసంధానం చేస్తున్నారు. దీంతో వాహనాన్ని ఎక్కడ పరీక్షించినా గరిష్ఠ కాలుష్యాన్ని సర్వర్ ద్వారా కొలచి నిబంధనల ప్రకారం ఉంటేనే పొల్యూషన్ సర్టిఫికెట్ ఇస్తారు. పరిమితికి మించి కాలుష్యాన్ని విడుదలచేసే వాహనాలకు సర్టిఫికెట్లు ఇవ్వరు.

**వచ్చేనెల నుంచి అందుబాటులోకి**

ఈ సేవలన్నీ వచ్చేనెల నుంచి అందుబాటులోకి వచ్చేలా ప్రణాళికలు రూపొందించినట్టు రవాణాశాఖ ఐటీ విభాగానికి చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఈ సేవలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ రూపకల్పనకు బిడ్లను ఆహ్వానిస్తామని, టెండర్ల ప్రక్రియను టీఎస్‌టీఎస్ (తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీసెస్) ఖరారుచేస్తుందని చెప్పారు.



'DIL' RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
A 'DIL' RAJU PRODUCTION
DECEMBER 25TH RELEASE
U r my heart Beat
ఇద్దరి లోకం ఒకటే
SHIRISH MICKEY J MEYER G R KRISHNA
HARSHITH REDDY - BEKKEM VENUGOPAL (GOPI) SAMEER REDDY ABBURI RAVI
TAMMI RAJU BANDI RATNA KUMAR RAMANA VANKA STUNT SIVA
G ANUHYA REDDY BHANU VIJAY
ADITYA MUSIC
U/A




SKF
రేపే విడుదల
దబంగ్ 3
దర్శకత్వం: ప్రభుదేవా
ఆటకైనా వేటకైనా రెడీ
నిర్మాతలు: సల్మాన్ ఖాన్, అర్బాజ్ ఖాన్, నిఖిల్ ద్వివేది




Viacom18 STUDIOS
Parallel Minds
AKSHAYASRI PRESENTS
HARSHITHA MOVIES
KARTHI JYOTIKA SATHYARAJ
రేపే విడుదల
దొంగ
A JEETHU JOSEPH FILM
RAVURI. V .SRINIVAS
RD RAJASEKHAR ISC GOVIND VASANTHA MALLURI VENKAT
RAMAJOGAYYA SASTRY HANUMAAN CHOUDARY VS VINAYAK
PREM NAVAS STUNT SILVA PRASANNA SUJIT & SHOBI B.A. RAJU VIKRAMDESIGNS




ఉదయం గం॥ 8:33 ని॥ల ఆటతో
రేపే విడుదల
సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్ సమర్పించు
హ్యాపీ మూవీస్
NANDAMURI BALAKRISHNA
రూలర్
POLICE
సి. కళ్యాణ్ కె. యస్. రవికుమార్
సి. వెంకటేశ్వరరావు - పత్స నాగరాజా చిరంతన్ భట్
సి. రాంప్రసాద్ పరుచూరి మురళి చిన్నా జాన్ అబ్రహం రామ్-లక్ష్మణ్ అన్‌బరివు వంశీ శేఖర్
ADITYA MUSIC
U/A